బహిర్గతం కాని రంగులు
రూ॥140/-
పేజీలు: 140

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
PRAJAPAKSHAM ★
సంపుటి 07, సంచిక: 235 | శుక్రవారం | 26-07-2024 | ఖమ్మం
Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar
పేజీలు: 8+8 | వెల రూ. 5.00

## ప్రతిపక్ష నేతగా తొలిసారి అసెంబ్లీకి కెసిఆర్

**ప్రజాపక్షం / హైదరాబాద్:** మాజీ ముఖ్యమంత్రి, ప్రధాన ప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు తొలిసారిగా గురువారం తెలంగాణ అసెంబ్లీకి వచ్చారు. అసెంబ్లీకి వచ్చిన ఆయనకు బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు పుష్పగుచ్ఛాలుఉ అందించి స్వాగతం పలికారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బిఆర్ ఎస్ గత ఎన్నికల్లో ఓటిమిని చవిచూసింది. కాంగ్రెస్ గెలు పొందడం, రేవంత్ రెడ్డి సిఎంగా బాధ్యతలు స్వీకరించడం త్వరత్వరగా జరిగిపోయాయి.

# దుక్కుకు మహాదన్ను



## రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి రూ.72వేల కోట్లు

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి రూ.29,816 కోట్లు
నీటిపారుదలకు రూ.22,301 కోట్లు
ఎస్‌సి సంక్షేమానికి రూ.33, 124కోట్లు, ఎస్‌టి సంక్షేమానికి రూ.17,056 కోట్లు
హైదరాబాద్ మహానగరాభివృద్ధికి రూ.10,000 కోట్లు
స్వయం సహాయ గ్రూపులకు ఏటా రూ.20,000 కోట్ల వడ్డీలేని రుణాలు

**ఈ ఏడాది నుంచి రైతు కూలీలకు ఏటా రూ.12వేలు**

శాసనసభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన డిప్యూటీ సిఎం భట్టి, మండలిలో మంత్రి శ్రీధర్‌బాబు



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో తొలి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. వ్యవసాయానికి చారిత్రాత్మక మహా సహాయం చేస్తూ, ఆరు గ్యారెంటీలకు బాటలు వేస్తూ, హైదరాబాద్ మహా నగరానికి మౌలిక సదుపాయాలను కల్పించడమే కాక ఔటర్ రింగ్ రోడ్ వరకు విస్తరిస్తూ బడ్జెట్‌లో భారీగా నిధులను కేటాయించింది. ఐదేళ్ళలో స్వయం సహాయక మహిళా గ్రూపు సభ్యులను కోటీశ్వరులను చేసే లక్ష్యంతో ఏటా రూ.20వేల కోట్ల వడ్డీ లేని రుణాలను కల్పిస్తామని, ఈ ఏడాది నుంచి రైతు కూలీలకు ఏటా రూ.12వేల కోట్లు ఇస్తామని ప్రకటించింది. అన్ని వర్గాలకు వెన్నుదన్నుగా నిలుస్తూ 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.2,91,159 కోట్లతో వార్షిక బడ్జెట్‌ను ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం శాసనసభలో ప్రవేశపెట్టారు. రెవెన్యూ వ్యయం రూ.2,20,945 కోట్లు కాగా, మూలధన వ్యయం రూ.33,487 కోట్లు, ద్రవ్య లోటు రూ.49,255.41 కోట్లతో బడ్జెట్‌ను రూపొందించారు. ఈ ఏడాది రూ.57,112 కోట్ల అప్పులు తీసుకోవాలని ప్రతిపాదించారు. మొత్తం 70 పేజీల బడ్జెట్ ప్రసంగాన్ని భట్టి శాసనసభలో మధ్యాహ్నం 12:03 గంటలకు మొదలుపెట్టి 1 : 50 గంటలకు ముగించారు. మరోవైపు శాసనమండలిలో శాసనసభా వ్యవహారాల తరువాయి 2లో



మొత్తం బడ్జెట్
రూ.2,91,159 కోట్లు

రెవెన్యూ వ్యయం
రూ.2,20,945 కోట్లు

మూలధన వ్యయం
రూ.33,487 కోట్లు

ద్రవ్యలోటు
రూ.49,255 కోట్లు

రుణాలు
రూ.57,112 కోట్లు

## అంకెల సమాహారం కాదు.. విలువలు, ఆశల వ్యక్తీకరణ

ఆర్థిక క్రమశిక్షణ పాటించని గత ప్రభుత్వం
శాసనసభ బడ్జెట్ ప్రసంగంలో భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రణాళికాబద్ధంగా నడిపించాల్సిన రాష్ట్ర ఆర్థికవ్యవస్థను, గత ప్రభుత్వం ఒంటెత్తుపోకడలతో, స్వంత జాగీరులా ఆర్థిక క్రమశిక్షణను ఏ మాత్రం పాటించలేదని ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు విమర్శించారు. ఆ తప్పిదాల పర్యవసానం తాము వారసత్వంగా అందుకున్నామని, రాష్ట్ర విభజన నాటికి ఎంతో సమృద్ధిగా, ఆర్థికంగా పరిపుష్టిగా ఉన్న రాష్ట్రం, నేడు అప్పుల కుప్పగా మారడం విచారకరమన్నారు. బడ్జెట్ కేవలం అంకెల సమాహారం కాదని, బడ్జెట్ అనేది విలువలు, ఆశల వ్యక్తీకరణ అని అన్నారు. శాసనసభలో 2024–25 వార్షిక బడ్జెట్‌ను భట్టి విక్రమార్క గురువారం ప్రవేశపెట్టారు. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అన్న దాశరథి కవితతో భట్టి బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభించారు. త్వరలో నియామక ప్రణాళిక క్యాలెండర్ విడుదల చేస్తామని వెల్లడించారు. రైతుభరోసా సహా హామీలన్నీ త్వరలోనే అమలు చేసి తీరుతామన్నారు. రైతులకు పైసా ఖర్చు లేకుండా పంటలకు పూర్తి భద్రత కల్పిస్తామని హామీనిచ్చారు. కమిటీ అధ్యయనం తర్వాత ధరణి సమస్యలకు శాశ్వత పరిష్కారం చేస్తామన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 73 నీటిపారుదల ప్రాజెక్టులు చేపడితే ఇందులో 42 ప్రాజెక్టులు తరువాయి 2లో

## బడ్జెట్ ఉత్త ట్రాష్

భవిష్యత్త్‌లో ప్రభుత్వాన్ని చీల్చి చెండాడుతాం
ప్రతిపక్ష నాయకుడు కె.చంద్రశేఖర్‌రావు

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్ర బడ్జెట్ అట్టడుగు వర్గాల బడ్జెట్ అంటూనే కాంగ్రెస్ ప్రభుత్వం వారి గొంతు కోసిందని శాసనసభలో ప్రతిపక్ష నాయకులు కె.చంద్రశేఖరరావు విమర్శించారు. ప్రభుత్వం తరువాయి 2లో

## భారీ రుణాల నేపథ్యంలో కొత్త ప్రభుత్వానికి అన్ని కష్టాలే

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్రానికి రూ.6.71 లక్షల కోట్లు అప్పు ఉన్నా రూ.2.91 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశ పెట్టడం సానుకూలమైన విషయమని సిపిఐ రాష్ట్రకార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. నిధుల సంక్లిష్ట పరిస్థితిలోనైనా ఈ బడ్జెట్ సంతోషదాయకమని, అయితే పరిపూర్తి చేయడానికి ప్రభుత్వ గడ్డు పరిస్థితులు ఎదుర్కోవాల్సి వుంటుందని తరువాయి 2లో

## ఇది మోసపూరిత బడ్జెట్

బిజెపి పక్ష నేత మహేశ్వర్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్



కాంగ్రెస్ ప్రవేశపెట్టిన బడ్జెట్ మోసపూరితమైనది, ప్రజా వ్యతిరేకమైనదని అని శాసన సభ బిజెపి పక్ష నేత ఆలేటి మహేశ్వర్‌రెడ్డి అభివర్ణించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన బిజెపి ఎమ్మెల్యేలతో కలిసి బడ్జెట్‌పై మాట్లాడుతూ...కాంగ్రెస్ ఇచ్చిన ఆరు హామీలకు, ఐదు డిక్లరేషన్ పథకాలకు ఎలాంటి నిధులు కేటాయించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. నిరుద్యోగ భృతి, మహాలక్ష్మి కింద మహిళలకు ప్రతి నెల రూ.2500, గృహలక్ష్మి పథకం, రూ.4 వేల పెంచన్ పథకాలకు ఎలాంటి నిధులు తరువాయి 2లో

## దామరతోగులో పేలిన తూటా



మావోయిస్టు దళ నేత అశోక్ మృతి
ఎన్‌కౌంటర్‌పై పలు అనుమానాలు
ఇది ప్రభుత్వ హత్యేనన్న ఆజాద్

**ప్రజాపక్షం/ ఖమ్మం / గుండాల/ కరకగూడెం :** గుండాల అడవుల్లో మళ్లీ తుపాకీ చప్పుళ్లు వినిపించాయి. లింగన్న ఎన్‌కౌంటర్ తర్వాత మళ్లీ ప్రజల్లో ఈ ఎన్‌కౌంటర్‌తో ఆందోళన మొదలైంది. ఒకప్పుడు సాయుధ దళాలకు కేంద్రంగా ఉన్న ఈ ప్రాంతంలో గడిచిన రెండు మూడేళ్లుగా దళ సంచారం లేదన్న ప్రచారం జరిగింది. కానీ ఇటీవల ఛత్తీస్‌గఢ్ ప్రాంతం నుంచి మావోయిస్టు యాక్షన్ టీములు ప్రవేశించాయన్న వార్తలను నిజం చేసేవిధంగా గురువారం ఎన్‌కౌంటర్ జరిగింది. గుండాల మండలం, భూపాలపల్లి జిల్లా సరిహద్దు దామరతోగు వద్ద జరిగిన ఎదురు కాల్పుల్లో మావోయిస్టు దళ నేత నల్లమారి అశోక్ అలియాస్ విజయేందర్ (30) మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. భూపాలపల్లి జిల్లా ఘనాపురం మండలం బుద్ధారం గ్రామానికి చెందిన అశోక్ తరువాయి 8లో

## అధికార, విపక్షాల మాటల యుద్ధం

సభ్యుల వాగ్వాదం మధ్య లోక్‌సభ పలుమార్లు వాయిదా



**న్యూఢిల్లీ :** కేంద్ర బడ్జెట్‌పై చర్చ సందర్భంగా గురువారం నాడు అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగింది. దీంతో సభ పలుమార్లు వాయిదా పడింది. కాంగ్రెస్ ఎంపి చరణ్‌జిత్ సింగ్ చన్ని, బిజెపి సభ్యుడు రవనీత్ సింగ్ బిట్టు మధ్య మధ్య మొదలైన వాదన తీవ్రస్థాయికి చేరి ఆందోళనకు దారితీసింది. బడ్జెట్ చర్చలో పాల్గొన్న చన్ని బిట్టు తాత, పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి బీంట్ సింగ్ హత్యను ప్రస్తావించారు. అది కాస్త ఇటీవల కాంగ్రెస్‌ను వీడి బిజెపిలో చేరిన బిట్టు, చన్ని మధ్య మాటల యుద్ధానికి తారితీసింది. చన్ని, కాంగ్రెస్ మాజీ అధినేత్రి సోనియాగాంధీ వ్యక్తి విషయాలను ప్రస్తావిస్తూ కేంద్ర రైల్వేశాఖ తరువాయి 2లో

## సంక్షేమ రంగాల ప్రాధాన్యతను గుర్తించాలి

కేటాయించిన బడ్జెట్‌ను ఖర్చు చేయాలి
సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయం, దళిత, గిరిజన, విద్యా, వైద్య రంగాలకు కేటాయింపులను స్వాగతిస్తున్నామని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. గత 10 సంవత్సరాలలో కేటాయింపులు జరిగినప్పటికీ పూర్తిగా ఖర్చు చేయలేదన్నారు. వ్యవసాయ రంగంలో రైతు రుణమాఫీ, రైతుభరోసా, రైతు బీమాతో పాటు, వ్యవసాయ పరిశోధనలకు రు.72659 కోట్లు కేటాయింపులు చేశారన్నారు. విద్యా, వైద్యానికి చేసిన కేటాయింపులు గతంలాగే ఉన్నాయన్నారు. విద్యా, వైద్య రంగంలో ప్రభుత్వాలు శ్రద్ధ చూపకపోవడంతో ప్రైవేటు రంగాలకు ఆకర్షించబడుతున్నాయన్నారు. ఈ రెండు రంగాలకు కేటాయింపులు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో ఇండ్ల నిర్మాణానికి బిసిలకు రు.5 లక్షలు, దళితులకు రు.6 లక్షలు ఇస్తామని, నియోజకవర్గానికి తరువాయి 2లో

## ఖనిజాలు, గనులపై రాష్ట్రాలు రాయల్టీ విధించొచ్చు

సుప్రీంలో కేంద్రానికి ఎదురుదెబ్బ



**న్యూఢిల్లీ :** ఖనిజాలు, గనులపై రాష్ట్రాలు రాయల్టీ విధించే విషయంలో సుప్రీంకోర్టులో కేంద్రానికి ఎదురు దెబ్బ తగిలింది. ఖనిజాలు, గనులు కలిగిన భూములపై రాయల్టీ విధించే హక్కు రాష్ట్రాలకు ఉందని స్పష్టం చేసింది. ఈ మేరకు 8:1తో విస్తృత ధర్మాసనం కీలక తీర్పు వెలువరించింది. ఖనిజాలు సమృద్ధిగా కలిగిన ఒడిశా, జార్ఖండ్, పశ్చిమ్ బెంగాల్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలకు ఈ తీర్పు వల్ల ప్రయోజనం చేకూరనుంది. ఇప్పుడు ఆ రాష్ట్రాలు తమ భూభాగంలో కార్యకలాపాలు నిర్వహిస్తోన్న సంస్థలపై అదనంగా మొత్తాన్ని వసూలు చేయడానికి వీలుకలగనుంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం తాజా తీర్పు వెలువరిస్తూ.. రాయల్టీ, ట్యాక్స్ ఒకటి కాదని వ్యాఖ్యానించింది. అయితే తొమ్మిది మంది బెంచ్‌లో ఎనిమిది మంది ఒకే రకమైన తీర్పు ఇవ్వగా.. జస్టిస్ బివి నాగరత్న మాత్రం భిన్నమైన తీర్పు ఇచ్చారు. గనులు, ఖనిజాల నియంత్రణ, అభివృద్ధిపై పార్లమెంటుకు గంపగుత్త అధికారాన్ని రాజ్యాంగం కట్టబెట్టలేదని గత విచారణలో సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. రాష్ట్రాలకూ వాటిపై తరువాయి 8లో

## సిబ్బందిని నియమించాలి

హైదరాబాద్ లిబర్టీలోని ఇండియన్ బ్యాంక్ రీజినల్ కార్యాలయం ఎదుట ధర్నా
సబార్డినేట్ సిబ్బంది లేకుండా బ్యాంకు శాఖలను నడపడం దయనీయం : బి.ఎస్.రాంబాబు
పర్మినెంట్ ఉద్యోగాల్లో పనిచేస్తున్న క్యాజువల్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి : కృష్ణారావు


ప్రజాపక్షం/హైదరాబాద్




ఇండియన్ బ్యాంక్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని శాఖలలో అవసరమైన మేరకు సిబ్బందిని, అధికారులను నియమంచాలని ఎఐబిఇఎ కార్యదర్శి, ఎపిటిబిఇఎఫ్ ప్రధాన కార్యదర్శి బి.ఎస్.రాంబాబు, ఇండియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎపి, టిఎస్) జనరల్ సెక్రటరీ పి.వి.కృష్ణారావు యాజమాన్యాన్నిడిమాండ్ చేశారు. బ్యాంకుల శాఖలలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి యాజమాన్యానికి సామూహికంగా విజ్ఞాపన పత్రాలు సమర్పించాలని ఇండియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు ఉద్యోగులు గురువారం సాయంత్రం హైదరాబాద్ లిబర్టీలోని ఇండియన్ బ్యాంక్ రీజినల్ కార్యాలయంలో ముందు ధర్నా నిర్వహించారు. ఇండియన్ బ్యాంక్ సిబ్బంది, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో ధర్నాలో పాల్గొన్నారు. ప్రదర్శనకారులను ఉద్దేశించి బి.ఎస్.రాంబాబు మాట్లాడుతూ ఇండియన్ బ్యాంక్ చాలా శాఖలు ఒకే క్లరికల్ సిబ్బందితో కొనసాగుతున్నాయి, కొన్ని శాఖలు క్లరికల్ సిబ్బంది లేకుండానే పనిచేస్తున్నాయని, అధికారులే తాళాలు పట్టుకుని నగదు కార్యకలాపాలు తరువాయి 8లో

## ఫిర్యాదును స్వీకరించండి

స్పీకర్ కార్యాలయాన్ని ఆదేశించిన హైకోర్టు



**హైదరాబాద్:** ఎమ్మెల్యే పార్టీ ఫిరాయింపు అంశంపై తెలంగాణ హైకోర్టులో గురువారం మరోసారి విచారణ జరిగింది. బిఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌పై చర్యలు తీసుకోవాలంటూ చేసిన ఫిర్యాదును స్పీకర్ తీసుకోలేదని బిజెపి శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. స్పీకర్ తన ఫిర్యాదును స్వీకరించేలా ఆదేశించాలని కోర్టును కోరారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. మహేశ్వర్‌రెడ్డి పిటిషన్‌ను తీసుకోవాలని, పిటిషనర్‌కు ధ్రువీకరణ రశీదు ఇవ్వాలని స్పీకర్ కార్యాలయాన్ని హైకోర్టు ఆదేశించింది. ఎమ్మెల్యేలు దానం, తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరిలపై దాఖలు చేసిన పిటిషన్‌లపైనా విచారణ జరిగింది. స్పీకర్ నిర్ణయం తీసుకోక ముందే పిటిషనర్లు కోర్టుకు వచ్చారని ఏజీ తెలిపారు. స్పీకర్ ఇండిపెండెంట్ ట్రైబ్యునల్ అని.. కోర్టుల జోక్యం ఉండదన్నారు. గతంలో సుప్రీంకోర్టు సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసిందని ఏజీ తెలిపారు. 3 నెలలైనా స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్న వాదన సరైంది కాదన్నారు. వివాదం కోర్టులో ఉన్నందున స్పీకర్.. పిటిషన్లను పరిశీలించలేదని ఏజీ వివరించారు. స్పీకర్ కోర్టు నిర్ణయం కోసం వేచి చూస్తూ ఉండొచ్చన్నారు. తదుపరి విచారణను హైకోర్టు రేపటికి వాయిదా వేసింది.

## ప్రాధాన్యతను గుర్తించాలి
(మొదటి పేజీ తరువాయి)

3500 ఇండ్లు కేటాయిస్తామని ప్రకటించారని, దీనికి రు.8424 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. వాస్తవానికి రాష్ట్రంలో లక్షల మంది ఇండ్లు లేనివారు ఉన్నారని, అర్హతగల ప్రభుత్వ భూములను పేదలకు పంపిణి చేసి ఇండ్ల నిర్మాణానికి కనీసం రు.10లక్షల చొప్పున ఇవ్వాలని కోరారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని, మహిళలకు రూ.1లక్ష ఆర్థిక సహాయాన్ని వడ్డీలేకుండా రూ.2 లక్షలకు పెంచాలన్నారు.

## బడ్జెట్ ఉత్త ట్రాష్ (మొదటి పేజీ తరువాయి)

ఏర్పడిన తర్వాత 6 నెలల వరకు గడువు ఇవ్వాలకున్నామని, ఇచ్చామని, ఇక భవిష్యత్త్‌లో ప్రభుత్వాన్ని చీల్చి చెండాడుతామని కెసిఆర్ అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద గురువారం బడ్జెట్‌పై ఆయన స్పందిస్తూ ప్ర భుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉత్త ట్రాష్ అని వ్యాఖ్యానించారు. రాష్ట రైతులను ప్రభుత్వం పొగుడుతూనే వారిని వెన్నుపోటు పోడించిందన్నారు. రైతు భరోసాకు సంబంధించి అనేక ఆంక్షలు పెట్టబోతున్నట్లుగా వారి మాటలతోనే స్పష్టమవుతుందని తెలిపారు. గత ప్రభుత్వం తెలంగాణ ప్రజల సంక్షేమాన్ని కాక్షించి అనేక పథకాలను ప్రవేశపెట్టిందని, ఈ ప్రభుత్వానికి ఒక్క పథకంపై కూడా స్పష్టత లేదన్నారు. బడ్జెట్‌లో యాదవుల కోసం పెట్టిన గొర్రెల పంపిణీ, దళితల కోసం దళితబంధు పథకాల ఊసే లేదన్నారు. బడ్జెట్‌లో కేటాయింపుల అంశం వచ్చిన ప్రతిసారి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఒత్తి ఒత్తి పలకడం తప్ప కొత్తగా ప్రకటించింది మాత్రం ఏమిలేదని కెసిఆర్ ఎద్దేవా చేశారు. రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించి ఏ రంగానికి ఏమి చేయబోతున్నారని కూడా ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో స్పష్టత ఇవ్వలేకపోయిందన్నారు.

## ఇది మోసపూరిత బడ్జెట్
(మొదటి పేజీ తరువాయి)

కేటాయించలేదన్నారు. మహిళను ఈ బడ్జెట్‌లో కాంగ్రెస్ మోసగించిందన్నారు.బట్టి ప్రవేశ పెట్టిన బడ్జెట్ పచ్చి అబద్దాలతో కూడిందన్నారు. కేవలం కొడంగల్ కోసమే బడ్జెట్ ప్రవేశపెట్టినట్లుగా ఉందన్నారు.రాష్ట్రానికి అప్పుల కుప్పగా మార్చారని ఆరోపించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం కాళ్వేశ్వరం పేరుతో దోచుకోగా కాంగ్రెస్ ప్రభుత్వం మూసి ప్రక్షాళన పేరుతో దోచుకునేందుకు సిద్ధమవుతుందన్నారు. బడ్జెట్‌లో ఈ సారి సాగునీటి పథకాలకు రూ.6 వేల కోట్లు తగ్గించడంపై మతలబు ఏమిటని ప్రశ్నించారు.నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరిచేందుకు బడ్జెట్‌లో నిధులు నిల్ అన్నారు. రైతు భరోసాపై ఇంత వరకు ప్రభుత్వానికి క్లారిటీ లేదన్నారు.

## విలువలు, ఆశల వ్యక్తీకరణ
(మొదటి పేజీ తరువాయి)

పూర్తికాగా, మరో 31 ప్రాజెక్టులు నిర్మాణదశలో ఉన్నాయని, రాష్ట్ర వ్యాప్తంగా ఆరు ప్రాజెక్టులను ఈ ఏడాది, 12 ప్రాజెక్టులను, వచ్చే ఏడాది పూర్తి చేయాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. ప్రాజెక్టుల నిర్వహణ, మరమ్మతులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, గత ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టును కాపాడేందుకు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటి నిపుణుల సూచనలకు మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కనీసం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలను, పెన్షన్లను కూడా సరైనకాలంలో చెల్లించకపోవడం గత ప్రభుత్వ ఆర్థిక క్రమశిక్షణారాహిత్యానికి, ప్రజాసంక్షేమంపై నిర్లక్ష్యానికి మచ్చుతునక మాత్రమే అని వ్యాఖ్యానించారు. ఇటువంటి నిర్లక్ష్యవైఖరితో ఉద్యోగులు, పెన్షనర్లు, సామాన్య ప్రజలు, ప్రభుత్వ పథకాలపై ఆధారపడిన అభాగ్యులు, పేద ప్రజలు చెప్పుకోలేని కష్టాలు పడ్డారని వివరించారు. ఒక పక్క అప్పులు పెరగడంతో పాటు మరొక పక్క బిల్లుల బకాయిలు భారీగా పేరుకుపోవడంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రమాద స్థాయికి చేరుకున్నదన్నారు. చేతగానమ్మ కు మాటలెక్కువన్నట్లు రుణమాఫీలో పూర్తిగా విఫలమైన గత ప్రభుత్వ నాయకులు,తమ చిత్తశుద్ధిని శంకిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు శతవిధాల ప్రయత్నించారన్నారు. చిలికి చిలికి గాలి వాన అయినట్లు రాష్ట్ర ఆవిర్భావ సమయానికి ఉన్న రూ.75,577 కోట్ల అప్పు గత ఏడాది డిసెంబర్ నాటికి వామనావతారంలా పెరిగి రూ.6,71,757 కోట్లకు చేరిందని, గత పది సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అప్పు దాదాపు పదిరెట్లు పెరిగిందని, తదనుగుణంగా రాష్ట్ర అభివృద్ధి జరగలేదన్నారు. గత దశాబ్ద కాలంలో పాలకులు తీసుకున్న తప్పుడు విధాన నిర్ణయాల కారణంగా నాణ్యత లేని పనులతో సాగు నీటి ప్రాజెక్టులు ఆశించిన ఫలితాలను ఇవ్వలేదన్నారు. నీళ్ళు ఏ కాలువల ద్వారా పారించాలన్న ధ్యేయంతో కాకుండా, అవినీతి సొమ్మును ఏ కాలువల ద్వారా ప్రవహింప చేయాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వం పని చేసిందని, తద్వారా రైతుల సాగునీటి సమస్యలు అపరిష్కృతంగానే మిగిలిపోయాయని వివరించారు.

## మాటల యుద్ధం (మొదటి పేజీ తరువాయి)

సహాయమంత్రి అయిన బిట్టు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీంతో సభ అట్టుడికిపోయింది. అరు పక్షాల మధ్య మాటలు వాగ్వాదం కొనసాగుతండగా, కాంగ్రెస్ సభ్యుడు అమరిందర్‌సింగ్ రాజా సభ వెల్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా, ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ అడ్డుకున్నారు. అధికార పక్షం నుంచి కూడా బిట్టు వెల్‌లోకి ప్రవేశించేందుకు యత్నించారు. ఈ నేథ్యంలో స్పీకర్ స్థానంలో బిజెపి సభ్యులు సంధ్యారాయ్ సభను భోజన విరామం తరువాత 30 నిమిషాల పాటు మధ్యాహ్న 2 గంటల వరకు వాయిదా వేశారు. ఆ తరువాత సభ తిరిగి సమావేశం కాగానే రక్షణశాఖమంత్రి, లోక్‌సభలో ఉపనేత రాజ్‌నాథ్‌సింగ్ అభ్యంతరకరమైన వ్యాఖ్యలను తొలగించాలని, బడ్జెట్‌పై చర్చను కొనసాగించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. సభ గౌరవాన్ని కాపాడాలని అధికార, ప్రతిపక్ష సభ్యులను స్పీకర్ ఓమ్ బిర్లా హెచ్చరించారు. ముఖ్యంగా మంత్రులు నిబంధనలను ఉల్లంఘించకూడదన్నారు. ఆ తరువాత చన్ని తన ప్రసంగాన్ని ముగించారు. కాగా, బుధవారం కొంత మంది రైతు నేతలు లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీతో సమావేశమైన విషయాన్ని చన్నీ ప్రస్తావించారు. వారు ప్రధానిని కలిసిందుకు సమయం ఇప్పించాల్సిందిగా కోరారని చెప్పారు. ఈ ప్రభుత్వం రైతుల హామీలను నెరవేర్చడం లేదని విమర్శించారు. మంత్రి పీయూష్ గోయల్ కల్పించుకుని కాంగ్రెస్ ఎంపి సభను తప్పుదారి పట్టిస్తున్నారన్నారు. ఆ ఎంపి చేసిన ఆరోపణలను నిరూపించాలని సూచించారు. అధికార పార్టీ సభ్యులు తన ప్రసంగాన్ని పదే పదే అడ్డుకుంటున్నారని చన్ని మండిపడ్డారు. ఈ ప్రభుత్వ రైతులను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ సహా రైతులు అనేక డిమాండ్లను నెరవేర్చలేదన్నారు. నిరసన వ్యక్తం చేస్తున్న రైతులపై జాతీయ భద్రతా చట్టం నిబంధనలను ప్రయోగించారని చన్ని ఆరోపించారు. ఈ క్రమంలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ చన్నీ ఆరోపణలను ధృవీకరించాలని, సభను తప్పుదారి పట్టించారని ఆరోపించారు. చన్నీకి వ్యతిరేకంగా ప్రివిలేజ్ మోషన్‌ను ప్రవేశపెట్టాలని రిజిజు స్పీకర్‌ను కోరారు. కాగా, చన్నీ ప్రసంగం ముగిసిన తర్వాత కూడా అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం సాగింది. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ ఎంపి తత్కరే సునీల్ దత్తాత్రే తన ప్రసంగాన్ని ప్రారంభించగా, తృణమూల్ కాంగ్రెస్ ఎంపి కల్యాణ్ బెనర్జీ మంత్రిని సీటు పక్కనే సభ్యుడి తీసుకోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇంకా సీట్లు కేటాయించలేదని స్పీకర్ బిర్లా స్పష్టం చేశారు, ఎన్‌డిఎ సభ్యులకు కేటాయించిన సీటులోనే మంత్రి కూర్చున్నారన్నారు. బెనర్జీ తాను కూడా వేరే సీటులో కూర్చుంటానని చెప్పి, ట్రెజరీ బెంచీల వైపు కూర్చున్నాడు. అనంతరం తిరిగి తన సీటుకు చేరుకున్నారు. కొద్దిసేపు గందరగోళం కొనసాగడంతో సభాపతి స్థానంలో ఉన్న జగదాంబిక పాల్ సభను మధ్యాహ్నం 3 గంటలకు వాయిదా వేశారు. మధ్యాహ్నం 3 గంటలకు సభ సమావేశమైన తర్వాత సభ యధావిధిగా ప్రారంభమైంది.

## భారీగా మొక్కలు నాటుతాం

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ఈ వర్షాకాలంలో రాష్ట్రంలో లక్షల సంఖ్యలో మొక్కలను నాటే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని, ఇందులో లోకల్ బాడీలను భాగస్వాములను చేస్తున్నట్లు రాష్ట్రం హైకోర్టుకు చెప్పింది. ఈ మేరకు నివేదిక ఇవ్వాలని చీఫ్ జస్టిస్ అలోక్ అరాథే, జస్టిస్ జె.అనిల్ కుమార్లతో కూడిన డివిజన్ బెంచ్ గురువారం రాష్ట్రాన్ని ఆదేశించింది. జనాభా నిష్పత్తిలో మొక్కలు లేవంటూ కె.ప్రతాప్‌రెడ్డి వేసిన పిల్‌పై తదుపరి విచారణను ఆగస్ట్ 1కి వాయిదా వేసింది.

# నెతన్యాహూను అరెస్ట్ చేయాలి




- వాషింగ్టన్‌లో వేలాదిమంది ప్రదర్శన
- దిష్టిబొమ్మలు, అమెరికా పతాకాలు దగ్ధం
- వాళ్ళంతా ఇడియట్స్ : ఇజ్రాయెల్ ప్రధాని ఆగ్రహం

**వాషింగ్టన్ :** అమెరికాలో పర్యటిస్తున్న ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నేతన్యాహూకు వ్యతిరేకంగా వాషింగ్టన్‌లో వేలాదిమంది ప్రదర్శన జరిపారు. దీంతో వేలాదిమందిని హత్యచేసి యుద్ధ నేరాల కు పాల్పడిన నేతన్యాహూను తక్షణం అరెస్టు చేయాలని ప్రదర్శకులు డిమాండ్ చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. నేతన్యాహూ దిష్టిబొమ్మలు దగ్ధం చేశారు. ట్రైన్ స్టేషన్ వద్ద ఉన్న మూడు అమెరికా పతాకాలను కిందకులాగి ప్రదర్శకులు దగ్ధం చేశారు. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు వెంటనే అరెస్టు వారెంట్ జారీ చేయాలని ప్రదర్శకులు నినాదాలు చేశారు. పాలస్తీనియన్లు, వామపక్షాలు ఈ ప్రదర్శనలో పాల్గొన్నాయి. యుద్ధం తక్షణం విరమించాలని కోరారు. ఐతే నేతన్యాహూ వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వాళ్ళంతా ఇరాన్‌కు ప్రయోజనం కలిగించే ఇడియట్స్ (ఇరాన్ యూజ్‌ఫుల్ ఇడియట్స్) అని విమర్శలు చేశారు. గురువారంనాడు ఆయన క్యాపిటల్ హిల్‌లో ప్రసంగిస్తున్న సమయంలో ఆ వెలుపల వీధుల్లో వేలాదిమంది ప్రదర్శకులు గుమిగూడారు. నేతన్యాహూకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నేతన్యాహూ దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. తక్షణం యుద్ధం నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. అమెరికా ఎగువ సభ, దిగువసభలు రెండింటి సంయుక్త సమావేశంలో నేతన్యాహూ ప్రసంగిస్తున్నంతసేపూ అతడికి వ్యతిరేకంగా వెలుపల వీధు ల్లో వేలాదిమంది నిరసన ప్రదర్శనలు కొనసాగించారు. సంయుక్త సమావేశంలో నేతన్యాహూ విమర్శలు చేస్తూ ఈ విధంగా ప్రదర్శన లు చేసేవారంతా ఇరాన్‌కు ప్రయో




జనం చేకూర్చే మూర్ఖులని విరుచుకుపడ్డారు. హమాస్‌ను అంతం చేసేందుకు, పూర్తిగా హమాస్ ఉగ్రవాదులను నిర్మూలించేందుకు ఇజ్రాయెల్ సైన్యం చేస్తున్న కృషికి మద్దతు ఇవ్వాలని, అండగా నిలబడాల ని ఆయన అమెరికా చట్టసభ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. ''ఆ నేరస్తుడు ఇప్పుడు ఇక్కడికే వచ్చాడు, గాజాలో ఆసుపత్రులను ధ్వంసం చేశారు, ఆ ఘోరాన్ని చూడలేకపోతున్నాం, వేలాదిమంది పిల్లలను హతమార్చి వారికి వైద్యసదుపాయం లేకుండా చేసిన నేరస్తుడికి ఇక్కడ వాష్టింగ్టన్‌లో రాజకీయవేత్తలు అభినందనలు తెలియజేస్తున్నారు'' అని గాజా ఊచకోత వ్యతిరేక వైద్యుల సంఘం నాయకురాలు కరమే కుయెమ్మెర్ల్ అన్నారు. కాగా నేతన్యాహూ గురువారంనాడు అమెరి కా అధ్యక్షుడు జో బైడెన్, ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్‌లను కలిశారు. శుక్రవారంనాడు ప్రతిపక్ష డోనాల్డ్ ట్రంప్‌తో నేతన్యాహూ సమావేశం కానున్నారు.

**నేతన్యాహూ టెర్రరిస్ట్ : పాక్ ప్రభుత్వం ప్రకటన**

పాకిస్థాన్ ప్రభుత్వం బెంజిమన్ నేతన్యాహూను ఒక టెర్రరిస్టుగా ప్రకటించింది. ఆయన అమెరికా పర్యటన చేయడానికి ముందుగానే గడచిన శనివారంనాడు ఈ ప్రకటన చేసింది. అదేవిధంగా ఇజ్రాయెల్ ఆర్థిక అభివృద్ధికి చేయూత ఇవ్వకూడదని వివిధ కంపెనీలకు కూడా పాకిస్థాన్ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఈ ప్రకటనపట్ల హమాస్ హర్షం ప్రకటించింది. పాకిస్థాన్ ప్రభుత్వం చేసిన ఈ విధమైన ప్రకటన పాలస్తీనియన్ల కు విశ్వాసం పెరుగుతుంద ని, వారికి ప్రపంచవ్యాప్తంగా దేశాలు ముఖ్యంగా ముస్లిం దేశాలు ఆర్థిక సహాయ సహకారాలు అందించాలని ఈ సందర్భం గా హమాస్ విజ్ఞప్తి చేసింది.. గాజాలో కొనసాగుతున్న సామూహిక హత్యాకాండను అడ్డుకునేందు కు గట్టి చర్యలు తీసుకోవాలని కోరింది.

ప్రపంచం

## కెన్యా మంత్రివర్గంలో ప్రతిపక్షానికి నాలుగు మంత్రి పదవులు : దేశాధ్యక్షుడు విలియం రూటో


**నైరోబీ :** కెన్యా మంత్రివర్గంలో ప్రతిపక్షాలకు కూడా మంత్రి పదవులు లభించాయి. ప్రధాన ప్రతిపక్షం నుండి నలుగురు నాయకులు మంత్రులుగా పదవులు ఇస్తున్నట్లు దేశాధ్యక్షుడు విలియం రూటో ప్రకటించారు. రూటో తన పదవికి రాజీనామా చేయాలని ఉధృతస్థాయిలో దేశవ్యాప్తంగా ఒకవైపు నిరసన ప్రదర్శనలు కొనసాగుతున్న తరుణంలో ప్రధాన ప్రతిపక్షం నుండి నలుగురిని మంత్రులుగా నియమించారు. దేశాన్ని రక్షించేందుకు, ఐక్యత సాధించేందుకే తాను ఈ చర్యలు తీసుకున్నానని ఆయన అన్నారు. దేశంలో పన్నులు భారీగా పెంచేశారని విమర్శలు, నిరసన ప్రదర్శనలు జరుగుతూ ఉండటంతో పాతమంత్రివర్గాన్ని రూటో డిస్మిస్ చేసి కొత్త మంత్రివర్గాన్ని నియమించారు. ఈ నిరసన ప్రదర్శనల్లో 50 మంది పైగా మరణించగా, వందలాది మంది గాయపడ్డారు. ప్రతిపక్ష నాయకుడు రైలా ఒడింగాను 2022 ఎన్నికల్లో రూటో ఓడించారు. ఏడాదికాలంపైగా దేశంలో నిరసనలు, అల్లర్లు జరుగుతున్నాయి. ఇప్పుడు రైలా ఒడింగాను అధ్యక్షుడు రూటో కొత్తమంత్రివర్గంలోకి తీసుకున్నారు. జాన్ ఎంబడీ నాగో ఆంగోను ఆర్థికమంత్రిగా, జేమ్స్ ఒపియో వాండాయిని ఇంధనశాఖామంత్రిగా నియమిస్తున్నట్లు ప్రకటించారు.

## మారిటానియాలో వలసబోటు బోల్తా
### 15 మంది మృతి: 150 మంది గల్లంతు

**న్యూయిక్చాట్ :**ఉత్తర ఆఫ్రికాదేశం మారిటానియా రాజధాని న్యూయిక్చాట్ సమీపంలోని జలాలలో ఒక వలస ప్రయాణికుల బోటు బోల్తా పడటంతో 15 మంది మరణించారు. మరో 150 మంది గల్లంతయ్యారు. ఈ బోటులో మొత్తం 300 మంది ప్రయాణం చేస్తున్నారని అంతర్జాతీయ వలసల సంస్థ (ఐఎంఓ) గురువారం ఒక ప్రకటనలో తెలియజేసింది. పశ్చిమ ఆఫ్రికాదేశం గాంబియాలోని పైరోగ్‌లో సుమారు 300 మంది వలస ప్రయాణికులతో బయలుదేరిన ఈ పడవ సుమారు ఏడురోజులపాటు అట్లాంటిక్ సముద్రంలో ప్రయాణించిన తర్వాత జులై 22వ తేదీన న్యూయిక్చాట్ సమీపంలో బోల్తా పడింది. ఐతే మారిటానియా ప్రభుత్వ తీర ప్రాంత గస్తీ దళాలు ఈ బోటులోంచి సముద్రంలో పడిపోయిన 120 మందిని కాపాడి సురక్షితంగా ఒడ్డుకు చేర్చారని కూడా ఐఎంఓ తెలియజేసింది. అక్రమ వలసలు పెరిగిపోతున్నాయని యూరప్ దేశాలలో ఇటీవల పెద్ద గగ్గోలు చెలరేగింది. ప్రభుత్వాలు కూడా ఈ విషయంలో కఠిన చర్యలు తీసుకుంటున్నాయి.



## యువకులకు నాయకత్వం అప్పగించే సమయం ఇదే : బైడెన్



**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్ష పదవికి నవంబరులో జరిగే ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ తరపున తాను మళ్ళీ పోటీ చేయడం లేదని ప్రకటించిన ఆ దేశ అధ్యక్షుడు జో బైడెన్ బుధవారం రాత్రి పొద్దుపోయాక జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. ''ఇది దేశంలో యువతరానికి నాయకత్వాన్ని అప్పగించే సమయం'' అని ఆయన అన్నారు. ఈసారి తాను అధ్యక్ష పదవికి పోటీ చేయడం లేదని ప్రకటించారు. కొత్తతరం నాయకత్వం నీడలో దేశాన్ని ఏకీకృతం చేయాలన్నదే తన లక్ష్యమని ఆయన అన్నారు. కొత్తతరం నాయకురాలు కమలా హారిస్ ఎన్నికల్లో విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ''ఈ అధ్యక్ష పదవిని నేను ఎంతగానో గౌరవిస్తాను, కానీ అంతకంటే ఎక్కువగా నేను నా దేశాన్ని ప్రేమిస్తాను, కొంతమంది దేశాన్ని విభజించి అసూయా ద్వేషాలు పెంచాల ని చూస్తున్నారు, దేశ ప్రజాస్వామ్యాన్ని ఇరకాటంలో పడేస్తున్నారు, ఇప్పుడు దేశ ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడం అన్నింటికంటే ముఖ్యమైన విషయం, అందుకే దేశంలో రాజకీయ నాయకత్వాన్ని యువతరానికి స్వాధీనం చేయడం అత్యుత్తమ మార్గం అని నేను భావించాను, దేశాన్ని ఐక్యం చేయడానికి ఇదే గొప్ప మార్గమని భావించాను'' అని జో బైడెన్ తన ప్రసంగంలో ప్రధానంగా చెప్పారు. కమలాహారిస్‌కు పూర్తి మద్దతు ప్రకటించారు.

## మలావీ దేశ రక్షణకోసం ఐక్యరాజ్యసమితి విరాళాల సేకరణ

**ఐక్యరాజ్యసమితి :** ఆగ్నేయ ఆఫ్రికా దేశం మలావీ లో ప్రజలను రక్షించేందుకు 136 మిలియన్ డాలర్లు విరాళాలు సేకరించాలని ఐక్యరాజ్య సమితి, దాని భాగస్వామ్య భావసారూప్య మిత్ర సంఘాలు నిర్ణయించాయి. మలావీ దేశం తీవ్రమైన కరువుబారిన పడింది. అక్కడి ప్రజలు రోగాలతోబాధపడుతున్నారు.

30.80 లక్షలమంది ప్రజలు ఆ దేశంలో అతి భయంకరమైన కరువు కోరల్లో చిక్కుకుని విలవిలలాడుతున్నారనీ, దేశం లో ఉన్న 50.70 లక్షలమందిలో 25.35 లక్షలమంది ప్రజలు ఆహా ర అభద్రతలో ఉన్నారని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ అధికార ప్రతినిధి స్టీఫెన్ దుజారిక్ గురువారంనాడు చెప్పారు. భయంకరమైన కరువులో చిక్కుకున్న దేశాలుగా ఐక్యరాజ్యసమితి 2023 డిసెంబరులో ప్రకటించిన ఆరు దక్షిణాఫ్రికా దేశాలలో మలావీ కూడా ఒకటి.

# దళితబంధు ప్రస్తావన లేదనడం హాస్యాస్పదం
### మీడియాతో ఇష్టాగోష్టిలో డిప్యూటీ సిఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దళితబంధుకు 2023–24 బడ్జెట్‌లో కేటాయించిన నిధులలో ఒక్క రూపాయి కూడా విడుదల చేయని బిఆర్ఎస్ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దళితబంధు ప్రస్తావన లేదని విమర్శించడం హాస్యాస్పదమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. 'గత ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.17, 700 కోట్లు దళితబంధుకు కేటాయించి ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. దళితుల పట్ల ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించిన మాజీ సిఎం కెసిఆర్ ఈ బడ్జెట్‌లో దళితబంధు ప్రస్తావించలేదని మాట్లాడటం పట్ల నవ్వాలా? ఏడ్వాలో? అర్థం కావడంలేదు. ఎస్‌సి, ఎస్‌టి, సబ్ ప్లాన్ నిధులను గత ప్రభుత్వం మాదిరిగా కాంగ్రెస్ ప్రభుత్వం దారి మళ్లించబోదని, గతంలో మిగిలిపోయిన నిధులను కూడా కలుపుకుని దళిత, గిరిజనులకు సబ్ ప్లాన్ నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేస్తాం' అని ఆయన చెప్పా రు. శాసనసభ లో గురువారం 2024–25 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన అనంతరం అసెంబ్లీ కమిటీ హాల్‌లో మీడియాతో ఇష్టాగోష్ఠి మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్‌పై హాడావిడిగా మాట్లాడిన ప్రతిపక్ష నేత కెసిఆర్ కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణాకు జరిగిన అన్యాయంపై బుధవారం శాసనసభలో జరిగిన చర్చకు ఎందుకు రాలేదని, ఎందుకు కేంద్ర బడ్జెట్‌పై మాట్లాడలేదని ఆయన ప్రశ్నించారు. కేంద్రం ప్రభుత్వం, బిజెపి చెబితే కెసిఆర్ హడావుడిగా సభకు వచ్చారని, వారు చెబితేనే హడావుడిగా కాంగ్రెస్ ప్రభుత్వ బడ్జెట్‌పై మాట్లాడారన్నారు. 'బిఆర్ఎస్ వారు మాకేంటి సమయం ఇచ్చేది? ప్రజలే వారికి విశ్రాంతి తీసుకోమని సమయం ఇచ్చారు. పక్క రాష్ట్రానికి నిధులు ఇస్తున్నారు. ఈ రాష్ట్రానికి మేలు చేయడానికి తెచ్చిందే రాష్ట్ర విభజన చట్టం' అని కెసిఆర్‌పై భట్టి ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పడిన ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం సంక్షేమం అభివృద్ధికి సమభాగంలో నిధులు వెచ్చిస్తూ మేలు కలయికతో ముందుకు తీసుకువెళ్తున్నామన్నారు. ప్రజా ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయం హైదరాబాద్ అభివృద్ధికి ప్రత్యేక ఫోకస్ పెట్టి బడ్జెట్‌లో పెద్దపీట వేశామన్నారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థపై పెద్ద ఎత్తున ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నామని, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటుతో దేశానికి మొత్తం తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలువబోతున్నదన్నారు. హైదరాబాదులో ఏర్పాటు చేయబోతున్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ కూడా తెలంగాణ దేశానికి మార్గదర్శకంగా ఉండనుందని, ఇందుకు కసరత్తు పూర్త యిందని, నిధులు కేటాయించామన్నా రు. ప్రతి నియోజకవర్గంలో మైక్రో స్మాల్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయబోతున్నామని, మహిళలు ఆర్థిక సాధికారత సాధించడానికి మైక్రో స్మాల్ ఇండస్ట్రీలను కేటాయించనున్నా మన్నారు. డ్వాక్రా సంఘాలు ఉత్పత్తి చేసే వస్తువులను మార్కెటింగ్ చేసుకోవడానికి హైదరాబాదులో మూడున్నర ఎకరాలు భూమిని మహిళల కోసం కేటాయించామని, జిల్లాలో కూడా కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

## అన్ని కష్టాలే (మొదటి పేజీ తరువాయి)

అన్నారు. అయినా ప్రభుత్వం ఎక్కడా వెనుకడుగు వేయకుండా రూ.32 వేల కోట్లు రైతుల రుణాలమాఫీ ఇవ్వడం, మొత్తం వ్యవసాయ రంగానికి రూ.72 వేల కోట్లు పైచిలుకు నిధులు కేయించడం రైతాంగం పట్ల ప్రభుత్వానికి ఉన్న సానుకూలతకు అద్దం పడుతున్నదని ఆయన అన్నారు. శాసనసభలో గురువారం ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024–25 వార్షిక బడ్జెట్‌పై ఆయన స్పందిస్తూ గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో ఇందిరమ్మ ఇండ్లను నిర్లక్ష్యం చేసి వాటికి డబ్బులు కేటాయించలేదని, ఈ ప్రభుత్వం పేదల ఇండ్ల నిర్మాణం కోసం ఎన్నికల మానిఫెస్టోలో పెట్టిన హామీలను క్రమ క్రమంగా పూర్తి చేస్తుందనే నమ్మకం ఉన్నదని అన్నారు. అయితే నియోజకవర్గానికి 3500, మొత్తంగా 4 లక్షల 50 వేల ఇండ్ల ఇస్తామని చెప్పడం మంచి పరిణామమే అయినా గత 10 ఏళ్లలో కొత్త ఇళ్ల నిర్మాణాలు లేనందున ఇళ్ల సంఖ్య మరింత పెంచాలని ఆయన కోరారు. విద్యా, వైద్యరంగాలకు మరికొంత కేటాయింపులు పెంచాలని, నిరుద్యోగ సమస్యను నివారించడానికి జాబ్ క్యాలెండర్‌ను త్వరితగతిన విడుదల చేయాలన్నారు. బడ్జెట్ పద్దులపై చర్చ సమయంలో ఈ రెండు రంగాలకు మరిన్ని నిధులను కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరతామని, రానున్న ఏడాది నుంచి విద్య, వైద్య రంగాలకు మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిందేనని ప్రభుత్వంపై ఒత్తిడి తేస్తామన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, హమాలీ లాంటి అసంఘటిత రంగానికి చెందిన వారిని ఆదుకోవడానికి కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. బిఆర్ఎస్ గొర్రెల పథకానికి నిధులు కేటాయించలేదని చెబుతున్నారని, గొర్రెల పథకంలో లబ్ధిదారులకు చేరువ కాకుండా అవినీతిమయం చేశారని, దానికి ప్రత్యామ్నాయం పారదర్శకంగా కొత్త పథకాన్ని పెట్టి లబ్ధిదారులకు అందేవిధంగా చేయాలని ఆయన కోరారు. గత ప్రభుత్వం అప్పుల మీద అప్పులు చేసిందని, అయితే అప్పులు చేయడం తప్పు కాదని, వాటిని ఏ ఏ రంగానికి ఖర్చు చేశారు, తద్వారా సాధించిన ఫలితాలు ఏమిటి అనేది స్పష్టం కావాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు వాటి ఖర్చు వివరాలకు సంబంధించి సభలో స్వల్పకాలిక చర్చ నిర్వహించి శ్వేత పత్రం విడుదల చేయాలని సాంబశివ రావు ప్రభుత్వాన్ని కోరారు.

**కెసిఆర్ ఓపిక పట్టడం మంచిది :** రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఈ దుస్థికి చేరుకోవడానికి మాజీ సిఎం కెసిఆరే కారణమని, బడ్జెట్‌పై ఆయన వ్యాఖ్యలు సరికాదని కూనంనేని సాంబశివ రావు అన్నారు. ప్రభు త్వ వైఫల్యాలపై కెసిఆర్ ప్రజాస్వామ్యబద్ధంగా మాట్లాడం మంచిదని, అలా కాకుండా రాజకీయ లబ్ది కోసం ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేస్తే ప్రభుత్వం వైపు నుంచి అంతకంటే ఎక్కువ రియాక్షన్ ఉంటుందని, అది ఆయనకే మంచికాదని సాంబశివరావు హితువు పలికారు.

## దుక్కుకు మహోదన్ను (మొదటి పేజీ తరువాయి)


మంత్రి దుద్దిళ శ్రీధర్‌బాబు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

బడ్జెట్‌లో మునుపెన్నడూ లేని విధంగా రూ.72,659 కోట్లతో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి రూ.29,816 కోట్లు, నీటి పారుదల రంగానికి రూ.22,301 కోట్లను ప్రతిపాదించారు. ఆరు గ్యారంటీల అమలులో భాగంగా రూ.500 లకే గ్యాస్ సిలిండర్ నిమిత్తం రూ.723 కోట్లు, గృహజ్యోతి పథకానికి రూ.2418 కోట్లు ప్రతిపాదించారు. హైదరాబాద్ నగరాభివృద్ధికి ఎన్నడూ లేని విధంగా భారీ ఎత్తున రూ.10 వేల కోట్లను ప్రతిపాదించింది.

ప్రతి నియోజక వర్గంలో 3500 ఇళ్ల చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 4,50,000 ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల వరకు సహకారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నిజాం షుగర్స్ తిరిగి ప్రారంభిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. భూమి లేని రైతు కూలీల ఆర్థిక, జీవన స్థితిగతులను మెరుగుపర్చేందుకు నిరుపేద కూలీలకు సంవత్సరానికి రూ.12 వేలను అందించే బృహత్తర కార్యక్రమాన్ని ఈ సంవత్సరంలోనే ప్రారంభించనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది.

2023–24 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర జిఎస్‌డిపి ప్రస్తుత ధరల ఆధారంగా రూ.14,63,963 కోట్లు, గత సంవత్సరంతో పోలిస్తే 11.9 శాతం వృద్ధి రేటు నమోదైంది. జాతీయ స్థాయిలో ఈ వృద్ధి రేటు 9.1 శాతంగా ఉన్నట్లు బడ్జెట్ ప్రసంగం వెల్లడించింది. 2023–24 సంవత్సరంలో ప్రస్తుత ధరల ప్రకారం రాష్ట్ర తలసరి ఆదాయంరూ.3,47,299 ఉండగా, జాతీయ







తలసరి ఆదాయం రూ.1,83,236గా ఉన్నది. రాష్ట్రంలో సన్నరకం వరి ధాన్యాల సాగును ప్రొత్సహించేందుకు 33 రకాల వరి ధాన్యాలను గుర్తించి, వాటిని పండించిన రైతుకు క్వింటాకు రూ.500ల బోనస్ చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**ఇప్పటి వరకు వివిధపథకాలకు రూ. 34.579 కోట్లు ఖర్చు**

ప్రభుత్వం ఏర్పడిన తరువాత రూ 35,118 కోట్ల రుణాలు తీసుకోగా, గత ప్రభుత్వం చేసిన రుణాలలో అసలు, వడ్డీలతో కలిపి రూ. 42,892 కోట్ల బకాయిలను చెల్లించారు.తమ ప్రభుత్వం తీసుకున్న రుణాల కంటే రూ. 7,774 కోట్లు ఎక్కువగా రుణాలు ఈ కొద్ది నెలల్లోనే చెల్లించడం తమ చిత్తశుద్ధి అర్థ మవుతుందని భట్టి విక్రమార్క అన్నారు. డిసెంబర్ నుండి నేటివరకు రూ. 34,579 కోట్లను వివిధ పథకాలకు ఖర్చు చేశామని, ఈ పథకాలలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత కరెంట్, రైతు భరోసా, బియ్యంపై సబ్సిడీలు, చేయూత. సంక్షేమంతో పాటు మూలధన వ్యయానికి కూడా అదనంగా రూ. 19,456 కోట్లు ఖర్చు చేశారు. పిఎస్‌సిని సమూల ం గా ప్రక్షాళన చేసి, వారికి కావాల్సిన నిధులను,మౌలిక వసతులను సమకూర్చామని, పోలీసు, వైద్య,ఇతర రంగాలలో ఇప్పటికే 31,768 ఉద్యోగ నియామక పత్రాలను అందచేశామని వివరించారు.

**ఆరోగ్యశ్రీ వైద్యఖర్చుల పరిమితి రూ.10లక్షలకు పెంపు**

ఆరోగ్యశ్రీ పథకం కింద అర్హులైన వారందరికీ వైద్య ఖర్చుల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామన్నారు. మహాలక్ష్మి పథకం కింద రూ. 500 లకే గ్యాస్ సిలిండర్లను అర్హులైన వారందరికి సరఫరా చేస్తున్నామని, నెలకు 200 యూనిట్ల విద్యుత్‌ను అర్హులైన వినియోగదారులకు ఉచితంగా ఇస్తున్నామని, ఈ పథకాలన్నీ తమ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే తాము ఇచ్చిన హామీలకు అనుగుణంగా అమలుపరిచామని వివరించారు.

**గతంతో పోలిస్తే వృద్ధిరేపు 11.9 శాతం**

2023–24 సంవత్సరానికి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 3.2 శాతం అభివృద్ధి చెందింది.ఇదే కాలానికి భారత దేశ ఆర్థిక రంగం 7.6 శాతం, తెలంగాణ 7.4 శాతంగా వృద్ధిని నమోదైంది.

గత సంవత్సరంలో తెలంగాణ వృద్ధిరేటు జాతీయ వృద్ధి రేటు కంటే తక్కువగా ఉన్నది. 202324 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర స్థూల రాష్ట్ర, దేశీయ ఉత్పత్తి ప్రస్తుత ధరల ఆధారంగా లెక్కిస్తే రూ.14,63,963కోట్లు. గత సంవత్సరంతో పోలిస్తే 11.9 శాతం వృద్ధి రేటు నమోదైంది. జాతీయ స్థాయిలో ఈ వృద్ధి రేటు 9.1 శాతం ఉన్నది.




## భారీ బడ్జెట్ హర్షణీయం : చాడ



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.3 లక్షల కోట్లతో 2024–25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం హర్షణీయమని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. రాష్ట్రానికి అప్పులు ఉన్నా వివిధ రంగాలకు మంచి కేటాయింపులు చేయడం సానుకూల పరిణామమని ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. సర్వే నెంబర్ వారిగా సమగ్ర సర్వే చేస్తేనే ధరణిలో ఉన్న లొసుగులు సరిదిద్దవచ్చని అనుభవపూర్వకమైన అభిప్రాయాన్ని తెలియజేస్తున్నట్లు ఆయన తెలిపారు. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని చాడ వెంకట్‌రెడ్డి కోరారు. అదే విధంగా వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలలో సేవలందిస్తున్న వర్కర్ల పాత బకాయిలు చెల్లించాలని, వారి దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్లు మహిళలకు రూ. 2500 ఆర్థిక సహాయానికి నిధులు కేటాయించాలని ఆయన సూచించారు. గత ప్రభుత్వంలో అమలవుతున్న చేనేత పథకాలను పునరుద్ధరిస్తూనే, వాటికి కావాల్సిన నిధులు విడుదల చేసి కార్మికులను ఆదుకోవాలని, కులవృత్తుల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని చాడ వెంకటరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

## ఇది వాస్తవిక బడ్జెట్ : కాంగ్రెస్ ఎమ్మెల్యేలు



ప్రజాపక్షం/హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పైసా అభివృద్ధి, సంక్షేమం కోసం వెచ్చిస్తూ పూర్తి వాస్తవిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని పలువురు కాంగ్రెస్ ఎంఎల్‌ఎలు తెలిపారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం బడ్జెట్ లెక్కలు కేవలం కాగితాలకు మాత్రమే పరిమితమయ్యాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వసనీయత బడ్జెట్‌ను పెడితే బిఆర్‌ఎస్ నేతలకు మింగుడు పడక విమర్శలు చేస్తున్నారని వారు ధ్వజమెత్తారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎంఎల్‌ఎలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, లక్ష్మీ కాంతరావు, సంజీవరెడ్డి, వంశీ కృష్ణ, మట్ట రాగమయి, రామోహ్మన్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. ఈ రంగం, ఆ రంగం అంటూ లేకుండా ప్రతి రంగానికి ప్రభుత్వం నిధులను కేటాయించిందని కాంగ్రెస్ ఎంఎల్‌ఎలు చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ అరాచక పాలనతో రాష్ట్రాన్ని ఆగమాగం చేస్తే ప్రజలు తగ్గిన బుద్ధి చెప్పినా ఆయనకు ఇంకా జ్ఞానోదయం కల్గలేదని ఎద్దేవా చేశారు.

### ఇష్టంలేని పెళ్లి కొడుకులా అసెంబ్లీకి కెసిఆర్ : యెన్నం

మాజీ ముఖ్యమంత్రి ఇష్టంలేని పెళ్లి కొడుకు మాదిరిగా అసెంబ్లీకి వచ్చి కూర్చున్నారు తప్పితే కనీసం బడ్జెట్ పుస్తకంలో ఒక పేజీని కూడా తిరుగేయకుండానే బడ్జెట్‌పై విమర్శలు చేయడం ఆయన అజ్ఞానికి నిదర్శనమని ఎంఎల్‌ఎ యెన్నం శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. ప్రజాస్వామ్యం చాల గొప్పదని, తాను అధికారంలో ఉన్నప్పుడు ఎత్తివేయాలనుకున్న మీడియా పాయింట్ వద్దకే ఆయన వచ్చి మాట్లాడేలా చేసిందన్నారు.

### కెసిఆర్ జైలుకు వెళ్లడం ఖాయం : వంశీ కృష్ణ

ఇంతకాలంలో ఆకాశంలో విహరించి కెసిఆర్ చివరికి నేలకు దిగి అసెంబ్లీ మీడియాపాయింట్ మెట్లు ఎక్కారని, అదేవిధంగా త్వరలోనే కోర్టు బోను ఎక్కబోతున్నారని కాంగ్రెస్ ఎంఎల్‌ఎ వంశీకృష్ణ తెలిపారు. అక్కడి నుంచి ఆయన జైలుకు కూడా వెళ్లడం ఖాయమని జోస్యం చెప్పారు. పదేళ్ల పరిపాలనా కాలంలో ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయని కెసిఆర్ తెలంగాణకు తాను కాపలా కుక్కలా ఉంటానని, దళితుడే తొలి ముఖ్యమంత్రి అని 108 అబద్ధాలు చెప్పారన్నారు.

## సాగుకు భేషైన బడ్జెట్ : రైతుసంఘం




ప్రజాపక్షం/హైదరాబాద్ : వ్యవసాయ రంగానికి రాష్ట్ర బడ్జెట్లో సింహ భాగాన్ని కేటాయించటం, అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికీ సముచితంగా నిధుల కేటాయింపుపై తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు బాగం హేమంతరావు, ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన కటాఫ్ తేదీ ప్రకారం రైతుల పంట రుణాలన్నింటిని మాఫీ చేస్తామని బడ్జెట్ ప్రసంగంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించడం సంతోషకరమన్నారు. ఎస్‌ఎల్‌బి సి మినిట్స్ ప్రకారం అవుట్ స్టాండింగ్ లోన్స్ ఉన్న చిన్న, సన్న కారు రైతులందరికీ, రీ షెడ్యూల్ చేయబడిన పంట రుణాలను మాఫీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, రైతులందరినీ రుణ విముక్తులను చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం విజ్ఞప్తి చేస్తుందని తెలిపారు. రైతు భరోసా వాస్తవ సాగుదారులందరికీ రైతులకు, కౌలు రైతులకు వర్తింపచేయాలని, 15 ఎకరాల వరకు పరిమితిని ఖరారు చేసి అమలు చేయాలని ఈ బడ్జెట్ సమావేశాలలోనే పూర్తి నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు. అదేవిధంగా ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం కౌలు రైతులకు రైతు భరోసా వర్తింప చేయాలని, ఇందుకు 0–11 కౌలు రైతుల చట్టం ప్రకారం గుర్తించిన కౌలు రైతులు దరఖాస్తు చేసుకోవడానికి రెండు వారాలు గడువు ఇచ్చి వారందరికీ రైతు భరోసాను వర్తింపచేయాలని భాగం హేమంతరావు, పశ్యపద్మ కోరారు.

## హైదరాబాద్‌కు భారీ కేటాయింపు శుభపరిణామం

సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఇటి. నరసింహ



ప్రజాపక్షం/హైదరాబాద్: హైదరాబాద్ మహానగర సమగ్రాభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు కేటాయించడంపై సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, పాతబస్తీ మెట్రో రైల్ జెఎసి నేత ఇటి.నరసింహ హర్షం వ్యక్తం చేశారు. ఇందులో శంషాబాద్ విమానాశ్రయం వరకు మెట్రో రైల్ విస్తరణకు రూ.100 కోట్లు, మూసి రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్‌కు రూ. 1500 కోట్లు, రీజినల్ రింగ్ రోడ్ ప్రాజెక్ట్ కు రూ.1525 కోట్లు, ఔటర్ రింగ్ రోడ్ కు రూ.200 కోట్లు, హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్ట్ కు రూ. 500 కోట్లు, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్‌కు రూ. 3,385 కోట్లు, హైడ్రాకు రూ. 200 కోట్లు కేటాయించడంతోపాటు హైదరాబాద్ పాతబస్తీ మెట్రో రైల్ విస్తరణకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించడం శుభ పరిణామం అని తెలిపారు. కేటాయించిన నిధులను వెంటనే విడుదల చేసి పూర్తి స్థాయిలో సద్వినియోగం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డిని కోరారు. మెట్రో రైల్ నిధులను తక్షణమే విడుదల చేసి, యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి, ఏడాదిలోపు పూర్తి చేసి, పాతబస్తీ ప్రజలకు మెట్రో రైల్ సేవలను అందుబాటులోకి తీసుకరావాలని ఇటి. నరసింహ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు.

# బడ్జెట్‌లో భారీ ఆదాయ లక్ష్యం

ఆబ్కారీ నుంచి రూ.42వేల కోట్లు
భూముల ద్వారా రూ.24,000 కోట్లు
పెట్రోలు వ్యాట్ – రూ.16,850
స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ - రూ.18,228 కోట్లు




| | |
|---|---|
| పన్ను రాబడి | : రూ.1,38,181 కోట్లు |
| పన్నేతర రాబడి | : రూ.35,208 కోట్లు |
| కేంద్ర పన్నుల్లో వాటా | : రూ.26,216 కోట్లు |
| కేంద్రం గ్రాంట్లు | : రూ.21,636 కోట్లు |

ప్రజాపక్షం / హైదరాబాద్ : బడ్జెట్‌లో రాష్ట్ర స్వంత ఆదాయ వనరులపైన రాష్ట్ర ప్రభుత్వం బాగా ఆధారపడింది. మొత్తం రూ.2.91 లక్షల కోట్ల బడ్జెట్‌లో 2024–25 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ రాబడిని రూ.2.21 లక్షల కోట్లు లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చే రాష్ట్ర పన్నుల వాటా రూ.26,216 కోట్లు, గ్రాంట్ ఇన్ ఎయిడ్‌లు రూ.21,636 కోట్లు పోగా, మిగతా రూ. 1.73 లక్షల కోట్లు రాష్ట్ర స్వీయ ఆధార వనరుల నుంచి సమకూర్చుకోవాల్సింది. ఇందులో పన్ను రాబడి రూ.1.38 లక్షల కోట్లు కాగా, పన్నేతర రాబడి రూ.35,208 కోట్లు సాధించాలని రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ లక్ష్యంగా పెట్టుకుంది.

**రాబడి సాధించేది ఇలా..**

పన్నుల రాబడి కింద ఆబ్కారీ శాఖ నుండి రూ. 42,409 కోట్లు లక్ష్యంగా నిర్దేశించుకుంది. అలాగే పెట్రోలు, డీజిల్ వ్యాట్ ద్వారా రూ.16,850 కోట్లు సమకూర్చుకోవాలని భావిస్తోంది. పన్నేతర రాబడిలో ఖనిజాల తవ్వకం, ఇసుక ఫీజుల ద్వారా రూ.6,587 కోట్లు సాధించాలని అంచనా. ఇందులో ఇసుక ద్వారా రూ.1320 కోట్లు వస్తుందని భావిస్తున్నారు. కాగా, భూములు విక్రయం ద్వారా రూ.24వేల కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. అందులో భూములు, ఆస్తుల అమ్మకం ద్వారా రూ.6,500 కోట్లు, ఓపెన్ ప్లాట్ల అమ్మకం ద్వారా రూ.3,500 కోట్లు, అదనపు వనరుల సమీకరణ ద్వారా రూ.14వేల కోట్లు సాధించాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే, గత ప్రభుత్వం మాదిరిగా భూములను అమ్మి ఇతర ఖర్చులకు వినియోగించనట్లుగా కాకుండా, వినూత్న తరహాలో వినియోగించాలని యోచిస్తుంది. భూముల విలువను మార్కెట్ ధరలకు అనుగుణంగా పెంచి రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఫీజుల కింద రూ.18,228 కోట్లు లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే భూముల విలువ పెంపకంపై ప్రభుత్వం అధ్యయనం చేస్తోంది.

# మహానగరానికి వరాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్ర రాజధాని గ్రేటర్ హైదరాబాద్‌పై బడ్జెట్‌లో ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. అభివృద్ధి, మౌలిక సౌకర్యాల కల్పన కోసం గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి హైదరాబాద్‌కు రూ.10 వేల కోట్లు కేటాయించింది.జిహెచ్‌ఎంసి పరిధిలో మౌలిక వసతుల కల్పనకు రూ.3065 కోట్లు, హెచ్‌ఎండిఎకు రూ.500 కోట్లు, తాగునీరు, మురుగునీటి వ్యవస్థను మెరుగుపర్చడానికి జలమండలికి రూ.3385 కోట్లను ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించింది. అలాగే ఇటీవల ప్రభుత్వ ఆస్తులు, భూములు పరిరక్షణతో పాటు విపత్తుల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన 'హైడ్రా'కు కూడా ప్రత్యేకంగా రూ.200 కోట్లను కేటాయించడం గమనార్హం.


**మెట్రో విస్తరణకు ప్రాధాన్యం :** మెట్రో రైలు రెండో దశ విస్తరణలో భాగంగా ఎయిర్‌పోర్టు వరకు మెట్రో విస్తరణకు రూ.100 కోట్లు, హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు రూ.500 కోట్లు, పాతబస్తీలో మెట్రో విస్తరణకు రూ.500 కోట్లు, మల్టీ మోడల్ సబ్ అర్బన్ రైలు ట్రాన్స్‌పోర్టు సిస్టమ్ కోసం రూ.50 కోట్లతో పాటు ఒఆర్‌ఆర్ అభివృద్ధి కోసం రూ.200 కోట్ల నిధులను కేటాయించింది.

**'మూసీ' వెంట అభివృద్ధి:** మూసీ నది ప్రక్షాళనకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని పదే పదే చెబుతూ ఈసారి బడ్జెట్‌లో మూసీ రివర్ ఫ్రంట్ డెవప్‌మెంట్ ప్రాజెక్టు కోసం రూ.1500 కోట్లు కేటాయించింది. ఆ నిధులతో మూసీనది తీర ప్రాంత పర్యావరణ వ్యవస్థను పునరుద్ధరించాలని భావిస్తోంది.

**ట్రిపుల్ ఆర్ అనుసంధానం.. :** ఉత్తర ప్రాంతాల్లోని 158.6 కిలోమీటర్ల పొడవున్న సంగారెడ్డితుప్రాన్ గజ్వేల్ చౌటుప్పల్ రోడ్డును, దక్షిణ ప్రాంతంలోని 189 కిలోమీటర్ల పొడవున్న చౌటుప్పల్ షాద్‌నగర్ సంగారెడ్డి రోడ్డును జాతీయ రహదారులుగా ప్రకటించడానికి వీలుగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రతిపాదించింది. అలాగే ఆర్‌ఆర్‌ఆర్‌ను హైదరాబాద్ నగర ఉత్తర, దక్షిణ ప్రాంతాలనూ, తూర్పు పశ్చిమ ప్రాంతాలనూ కలుపుతూ జాతీయ రహదారులతో అనుసంధానం చేయాలని ప్రభుత్వం అంచనావేస్తోంది. ప్రాథమిక అంచనాల ప్రకారం ఆర్‌ఆర్‌అర్ ఉత్తర ప్రాంతం అభివృద్ధికి రూ.13,522 కోట్లు, దక్షిణ ప్రాంతాభివృద్ధికి రూ.12,980 కోట్ల ఖర్చు అవుతాయని ప్రభుత్వం ప్రతిపాదించింది.

# బడ్జెట్‌లో సాగుకు సింహభాగం

**రూ. 72,659 కోట్లు కేటాయింపు**



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగం సింహ భాగం నిధులను దక్కించుకుంది. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలకు కలిపి మొత్తం రూ.72,659 కోట్లను ప్రభుత్వం ప్రతిపాదించింది. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం వ్యవసాయం, సహకార శాఖకు గత 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ. 28,594 కోట్లను కేటాయించగా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రంగానికి 2024–25 బడ్జెట్‌లో రూ.49,383 కోట్ల ప్రతిపాదించింది. మొత్తంగా వ్యవసాయ రంగానికి రూ.72, 659 కోట్లు ప్రతిపాదించగా, ఇందులో రైతు రుణమాఫీకి రూ.26,000 కోట్లు, రైతు భరోసాకు రూ.15,075 కోట్లు, వ్యవసాయ కూలీలకు రైతు భరోసా రూ.1200 కోట్లు, రైతు బీమాకు రూ.1,589 కోట్లు, పంటల బీమాకు రూ.1,300 కోట్లు, వరి పంట బోనస్‌కు రూ.1,800 కోట్లు, విద్యుత్ సబ్సిడీకి రూ.11,500 కోట్లు, నీటిపారుదలకు రూ.10,829 కోట్లు, ఇతర పథకాలకు రూ.3,366 కోట్లు చొప్పున ప్రభుత్వం ప్రతిపాదించి వ్యవసాయ శాఖకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చింది.

## అప్పులు రూ.7.29 లక్షల కోట్లు

ప్రజాపక్షం/ హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర అప్పులు రూ.7.29లక్షల కోట్లకు చేరుకోనున్నాయి. గత ప్రభుత్వ హయాంలో రూ.6.71 లక్షల కోట్ల అప్పులకు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరో రూ. 57,112 కోట్లు చేరనున్నాయి. దీంతో 2025 మార్చి 31 నాటికి రాష్ట్ర రుణాలు రూ.7.29 లక్షల కోట్లకు చేరనుంది. ఇందులో బడ్జెట్ పరిధిలోని రుణాలు రూ.4.51లక్షల కోట్లు కా గా, మిగతావి గత ప్రభుత్వ హయాంలో వి విధ కార్పొరేషన్‌లకు ప్రభుత్వ గ్యారెంటీతో చేసిన అప్పులు. ఆ అప్పులే 2023 మార్చి 31 నాటికి సుమారు రూ.3.10 లక్షల కోట్లు ఉన్నాయి.

## ట్రాన్స్ కో, డిస్కంలకు రూ.16,410 కోట్లు



ప్రజాపక్షం / హైదరాబాద్ : విద్యుత్ శాఖకు ప్రభుత్వం సరిపడా నిధులను కేటాయించింది. మరీ ముఖ్యంగా ట్రాన్స్‌కో, డిస్కంలకు రూ. 16,410 కోట్లు కేటాయిస్తూ ప్రతిపాదించింది. తద్వారా వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలోని వినియోగదారులతో పాటు, అన్ని వర్గాల వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును నిరంతరాయంగా అందించాలని ప్రభుత్వం యోచిస్తోంది. రోజుకు 24 గంటలు నిరంతరాయ విద్యుత్‌ను అందించడంతో పాటు, విద్యుత్ సరఫరా విషయంలో చొరవ తీసుకుంటోంది. శరవేగంగా పెరుగుతున్న రాష్ట్ర విద్యుత్ డిమాండు దృష్టిలో పెట్టుకుని ట్రాన్స్ మిషన్ నష్టాలు తగ్గించి నెట్ వర్క్ బలోపేతం చేయడంలో భాగంగా, ఈ ఆర్థిక సంవత్సరంలో 11 కొత్త ఎక్స్ ట్రా హై టెన్షన్ సబ్ స్టేషన్ల నిర్మాణం, 31 ఎక్స్ ట్రా హై ఓల్టేజ్ పవర్ ట్రాన్స్ ఫార్మర్ల సామర్థ్య పెంపు కోసం రూ. 3,017 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. రాష్ట్రంలో భౌగోళిక అనుకూలతలు గల ప్రదేశాలలో స్టోరేజ్ ప్లాంటులను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపిన ప్రభుత్వం కాలుష్య నివారణ చర్యల్లో భాగంగా విద్యుత్ వాహనాలనూ ప్రోత్సహిస్తోంది. ప్రస్తుతమున్న 450 విద్యుత్ వాహనాల చార్జింగ్ స్టేషన్లు ఉండగా, అదనంగా గ్రేటర్ హైదరాబాదులో 100 స్టేషన్లను ఏర్పాటు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోనుంది. ప్రజలకు చార్జింగ్ సౌకర్యాలను సులభంగా అందుబాటులోనికి తీసుకురావడానికి టిజిఈవి మొబైల్ యాప్ ను ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్ర విద్యుత్ వినియోగ అవసరాల దృష్ట్యా 2030 సంవత్సరం వరకు కావలసిన విద్యుత్ ఉత్పత్తికి తగిన ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంటోంది. వీటితో పాటు పర్యావరణాన్ని పరిరక్షిస్తూ సుస్థిర అభివృద్ధిని సాధించడం ప్రస్తుత ప్రభుత్వ ధ్యేయంగా చెబుతోంది. తదనుగుణంగా నూతన విద్యుత్ విధానంలో సౌరశక్తి రంగానికి ప్రాధాన్యతనిస్తూ, భవిష్యత్తులో కాలుష్యరహిత విద్యుత్ సాధనలో అగ్రగామిగా నిలవడానికి కృషి చేయబోతున్నట్లు పేర్కొంటోంది.

## శాఖల వారీగా బడ్జెట్ ప్రతిపాదనలు 2024-25

| | |
|---|---|
| హోంశాఖ | రూ.9,564 కోట్లు |
| పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి | రూ.29,816 కోట్లు |
| ఆర్ అండ్ బి శాఖ | రూ.5,790 కోట్లు |
| నీటి పారుదల శాఖ | రూ. 22,301 కోట్లు |
| వ్యవసాయం | రూ.72,659 కోట్లు |
| విద్యారంగం | రూ.21,292 కోట్లు |
| వైద్యం, ఆరోగ్యం | రూ. 11,468 కోట్లు |
| ట్రాన్స్ కో, డిస్కంలు | రూ.16,410 కోట్లు |
| అడవులు, పర్యావరణం | రూ.1,064 కోట్లు |
| స్త్రీ, శిశు సంక్షేమం | రూ.2,736 కోట్లు |
| ఎస్‌సి సంక్షేమం | రూ.33,124 కోట్లు |
| ఎస్‌టి సంక్షేమం | రూ.17,056 కోట్లు |
| బీసీ సంక్షేమం | రూ.9,200 కోట్లు |
| మైనార్టీ సంక్షేమం | రూ.3,003 కోట్లు |
| పరిశ్రమల శాఖ | రూ. 2,762 కోట్లు |
| ఐటీ రంగం | రూ.774 కోట్లు |
| ఉద్యానవనం | రూ.737 కోట్లు |
| పశుసంవర్థకం | రూ.1,980 కోట్లు |
| ప్రజాపంపిణీ | రూ.3,836 కోట్లు |
| ఐటీఐల ఆధునీకరణ | రూ.300 కోట్లు |
| రూ.500 గ్యాస్ సిలిండర్ పథకం | రూ.723 కోట్లు |
| గృహజ్యోతి పథకం | రూ.2,418 కోట్లు |
| **హైదరాబాద్ నగరానికి ప్రతిపాదనలు** | |
| హైదరాబాద్ నగర అభివృద్ధి | రూ.10 వేల కోట్లు |
| జిహెచ్‌ఎంసిలో మౌలిక వసతుల కల్పన | రూ.3,065 కోట్లు |
| హెచ్‌ఎండిఎలో మౌలిక వసతుల కల్పన | రూ.500 కోట్లు |
| హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స | రూ.3,385 కోట్లు |
| హైడ్రా సంస్థ | రూ.200 కోట్లు |
| విమానాశ్రయం వరకు మెట్రో విస్తరణ | రూ. 100 కోట్లు |
| ఔటర్ రింగ్ రోడ్డు | రూ. 200 కోట్లు |
| హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు | రూ.500 కోట్లు |
| పాతబస్తీ మెట్రో విస్తరణ | రూ.500 కోట్లు |
| మల్టీ మోడల్ సబర్బన్ రైల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ | రూ.50 కోట్లు |
| మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు | రూ.1500 కోట్లు |
| ఐటిఐల ఆధునీకరణ | రూ.300 కోట్లు |

## హోంశాఖకు రూ.9564 కోట్లు

హైదరాబాద్ కమిషనరేట్‌కు రూ.121 కోట్లు పెంపు
సైబరాబాద్, రాచకొండకు తగ్గింపు
హోంగార్డ్ విభాగానికి గత ఏడాది నిల్ ఈ సారి రూ.50 కోట్లు

ప్రజపక్షం/హైదరాబాద్: ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మల్లు గురువారం శాసన సభలో ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రతిపాదిత బడ్జెట్‌లో పోలీసు శాఖకు రూ.9564 కోట్లు ప్రతిపాదించారు. గత ఏడాది 2023–24 ఏడాదిలో పోలీసు శాఖకు రూ.9845 కోట్లు కేటాయించగా ఈ సారి రూ.281 కోట్లు తగ్గించారు. హైదరాబాద్ పోలీసు కమిషనరేట్‌కు మాత్రం భారీగా నిధులు పెంచారు. గత ఏడాది రూ.155.65 కోట్లు కేటాయించగా ఈ సారి రూ.276.44 కోట్లకు పెంచారు. అయితే సైబరాబాద్, రాచకొండల కమిషనరేట్లకు ఈ సారి బడ్జెట్‌లో కోత విధించారు. సైబారాబాద్‌కు గత ఏడాది రూ.24.58 కోట్లు కేటాయింపులు చేయగా ఈ సారి తగ్గిస్తూ రూ.20 కోట్లు ప్రతిపాదించారు. ఇక రాచకొండకు గతంలో రూ.25.48 కోట్లు కేటాయించగా ఈ సారి భారీగా తగ్గిస్తూ రూ.9.40 కోట్లు ప్రతిపాదించారు. బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌కు మాత్రం గత ఏడాది మాదిరిగానే యదావిధిగా రూ.20 కోట్లు ప్రతిపాదించారు. మావోయిస్టుల కదలికలపై నిరంతరం పనిచేస్తున్న గ్రేహౌండ్స్‌కు నిధులు తగ్గించారు. గత ఏడాది రూ.3.17 కోట్లు కేటాయించగా ఈ సారి రూ.1.94 కోట్లు మాత్రమే ప్రతిపాదించారు. నిఘా విభాగానికి వస్తే బడ్జెట్‌లో కోత పెట్టారు. గత ఏడాది రూ.197.93 కోట్లు ఖర్చు చేయగా ఈ సారి రూ.108.70 కోట్లు మాత్రమే ప్రతిపాదించారు. గత ఏడాది జైళ్ల శాఖకు రూ.35.73 కోట్లు కేటాయించగా ఈ సారి రూ.16.78 కోట్లు మాత్రమే ప్రతిపాదించారు.



## పరిశ్రమల శాఖకు పెరగనున్న నిధులు

గత ఏడాది కంటే ఈ సారికి రూ.1,313 కోట్లకుపైగా అధికంగా నిధుల కేటాయింపు



ప్రజాపక్షం / హైదరాబాద్ : పరిశ్రమల శాఖ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తూ బడ్జెట్‌లో నిధులను ప్రతిపాదించింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో పరిశ్రమల శాఖకు రూ. 1449 కోట్లను గత ప్రభుత్వం కేటాయించగా, ఆ నిధులను మరింతగా పెంచుతూ ప్రతిపాదించింది. ఈ మేరకు 202425 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.2762 కోట్లు ప్రతిపాదిస్తూ నిర్ణయం తీసుకున్నారు. తద్వారా గత ఏడాది కంటే ఈ సారికి రూ.1,313 కోట్లకు పైగా అధికంగా నిధులు ప్రతిపాదించారు. తెలంగాణ, కృత్రిమ మేధో పరిజ్ఞాన రంగంలో ఎంతో ప్రగతిని సాధించిందని ఈ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి, హైదరాబాద్ ను ఈ రంగంలో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు పేర్కొంది. రాజధాని హైదరాబాద్ నగరం, భవిష్యత్తులో ఏ.ఐ కంప్యూటర్ పరికరాలతో అత్యాధునిక కృత్రిమ మేధో పరిజ్ఞాన పరిశోధక కేంద్రంగా రూపొందించనున్నట్లు తెలిపింది.

## సాగునీటి పారుదల రంగానికి రూ. 22,301 కోట్లు

ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రాధాన్యత నిచ్చిన సర్కారు



ప్రజాపక్షం / హైదరాబాద్ : సాగునీటి రంగానికి ప్రభుత్వం భారీగానే నిధులు కేటాయించింది. ఈ క్రమంలో సాగునీటి పారుదల రంగానికి రూ. 22,301 కోట్లను ప్రతిపాదిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నిర్వహణ పద్దు కింద రూ. 11,47,264.46 లక్షలను, ప్రగతి పద్దు కింద రూ. 10687,84.5 లక్షలను ప్రతిపాదించారు. ఈ మొత్తం కలిపి రూ. 1,254142 లక్షలు కానుంది. ఇరిగేషన్ శాఖకు గత ప్రభుత్వం కంటే కూడా ఈ సారి భారీగానే నిధులను కేటాయించారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న కాలాన్నీ తీసుకుంటే ఇరిగేషన్ శాఖకు 2020–21లో రూ.3,607 కోట్లు, 2021–22లో రూ.6,424 కోట్లు, 2022–23లో రూ. 9,277 కోట్లు, 2023–24లో రూ.9,381 కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ మొత్తాన్ని పెంచుతూ 2024–25లో 10,829 కోట్లు కేటాయించడం ద్వారా ప్రాజెక్టుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యతను ఇచ్చిం ది. కాళేశ్వరం, సీతారామ ఎత్తిపోతల, వరద కాలువ , దేవాదుల, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులకు తీసుకున్న రుణాల్లో కొన్నింటికి అసలు తిరిగి చెల్లింపు ప్రారంభమైంది. అటు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీరు ఇచ్చే ప్రాజెక్టులకు బడ్జెట్‌లో ప్రాధాన్యతను ఇచ్చి నిధులను కేటాయించారు. ప్రభుత్వానికి ఇప్పటికే ప్రాధాన్య ప్రాజెక్టుల్లో శ్రీశైలం ఎడమ గడ్డ కాలువ, డిండి, కోయిల్ సాగర్, బీమా, నెట్టెంపాడు, కల్వకుర్తి, దేవాదుల, సీతారామ ఎత్తిపోతల, చిన్న కాళేశ్వరం, మోదికుంట వాగు, పాలెంవాగు, లోయర్ పెన్ గంగా, ఎల్లంపల్లి, శ్రీరాంసాగర్ రెండో దశ తదితర ప్రాజెక్టులను దశల వారీగా అభివృద్ధి చేయనున్నారు.

## బిసి సంక్షేమానికి రెట్టింపు నిధులు

ప్రజాపక్షం/హైదరాబాద్ : నిరుపేదల కడుపు నింపుతున్న ప్రజా పంపిణీ వ్యవస్థకు ప్రభుత్వం మరింత చేయూతను ఇచ్చింది. బడ్జెట్‌లో పౌర సరఫరాల శాఖకు ప్రభుత్వం రూ.3836 కోట్లను ప్రతిపాదించింది. తద్వారా ఖరీఫ్, రబీ సీజన్‌లో రైతుల నుంచి ధాన్యం కోనుగోలు చేసిన వెంటనే నిధులు చెల్లించేందుకు మార్గం సుగమం చేసింది. గత రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లు చేసిన వెంటనే రూ.10,556 కోట్లను రైతుల ఖాతాల్లో పౌరసరఫరాల శాఖ జమ చేసింది. బిసి సంక్షేమానికి గత ప్రభుత్వంతో పోల్చితే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది నిధులను రెట్టింపు చేసింది. 2023–24 ఆర్థిక సంవత్సంలో అప్పటి ప్రభుత్వం బిసిలకు కేవలం రూ. 4వేల కోట్లను కేటాయిస్తే 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.9200 కోట్లను ప్రతిపాదించింది. మైనార్టీ సంక్షేమానికి సైతం కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దపీట వేసింది. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం గత బడ్జెట్‌లో రూ.1,793 కోట్లు కేటాయించగా, 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.3003 కోట్ల ప్రతిపాదించింది. ఎస్‌సిల సంక్షేమానికి సంబంధించి ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం నిధులను భారీగా పెంచింది. రూ.33,124 కోట్లను ప్రతిపాదించింది. ఎస్‌సిల సంక్షేమంలో భాగంగా గతంలో దళిత బందు అమలు చేసిన బిఆర్‌ఎస్ ప్రభుత్వం గత బడ్జెట్ లో కేవలం రూ.2,265 కోట్లు కేటాయించగా, 2024–25 ఆర్థిక సంవ్సరానికి సంబంధించి కాంగ్రెస్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేవలం వారి సంక్షేమానికే రూ.7,638 కోట్లను ప్రతిపాదించారు. మొత్తంగా రూ.33,124కోట్లను ప్రతిపాదించారు. ఎస్‌టిల సంక్షేమానికి గత ప్రభుత్వంతో పోల్చితే భారీనే నిధులను కేటాయించింది. ఎస్‌టిల కోసం ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.17,056 కోట్లను ప్రతిపాదించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో గత ప్రభుత్వం 2,361 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ. 3,969 కోట్లను ప్రతిపాదించారు. మొత్తం ఎస్‌టి అభివృద్ధికి గాను 17,056 కోట్లను ప్రతిపాదించారు. మహిళా శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమానికి ఈ ఏడాది బడ్జెట్‌లో రూ. 2,736 కోట్లను ప్రతిపాదించారు. గత ఏడాదితో పోల్చితే రూ.961 కోట్లు అదనం. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.1775 కోట్లును కేటాయించగా, 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2,736 కోట్లను ప్రతిపాదించింది.

ప్రజాపక్షం
శుక్రవారం, జులై 26

## రైతులపట్ల తగని నిర్లక్ష్యం

వ్యవసాయోత్పత్తులకు కనీస మద్దతు ధరకు లీగల్ గ్యారంటీ కోరుతూ మూడేళ్లపైబడి ఎడతెగని ఆందోళన చేస్తున్న దేశ రైతాంగానికి 2024–25 కేంద్రబడ్జెట్ కూడా మొండి చేయి చూపింది. మూడు కార్పొరేట్ అనుకూల వ్యవసాయ చట్టాలను – రైతుల సుదీర్ఘ ఆందోళన నేపథ్యంలో – 2021, నవంబర్ 19న ఉపసంహరించుకుంటున్నట్లు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రకటించినపుడు రైతుల డిమాండ్లను పరిశీలిస్తామని వాగ్దానం చేశారు. కాని ఇంతవరకు సానుకూల చర్య కాదు కదా, స్పందన కూడా లేదు. పంజాబ్, హర్యానా రైతులు సంవత్సరం పైబడి ఆందోళన చేస్తుండగా హర్యానా ప్రభుత్వం న్యూఢిల్లీ జాతీయ రహదారిపై పంజాబ్–హర్యానాలను కలిపే శంభు జంక్షన్ వద్ద అవరోధాలు ఏర్పాటు చేసి రైతుల ప్రయాణాన్ని నిరోధించింది. రైతులపై పోలీసు జులుం సాగిస్తోంది. దీనిపై అప్పీలును గతవారం అనుమతించిన హైకోర్టు అడ్డంకులు తొలగించాలని ఆదేశించింది. ఈ ఆదేశాన్ని హర్యానా ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. బుధవారం దాన్ని విచారించిన ధర్మాసనం, కేంద్రప్రభుత్వం – రైతుల మధ్య ఉన్న 'విశ్వాస లోటును' పరిష్కరించేందుకు "తటస్థుల" కమిటీని వేస్తామని సూచించింది. దీనిపై రెండు రాష్ట్రప్రభుత్వాల అభిప్రాయం తీసుకునేందుకు వారం రోజుల గడువు ఇస్తూ తదుపరి విచారణను ఆగస్టు 2కు వాయిదా వేసింది. ఇదిలావుండగా, ఆందోళనకు నాయకత్వం వహిస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం)బడ్జెట్‌ను నిరసిస్తూ ఆ ప్రతులు తగలబెట్టాలని నిర్ణయించింది. కాగా అందులోని చిన్న గ్రూపు నాయకులు కొందరు బుధవారం ప్రతిపక్షనాయకుడు రాహుల్‌గాంధీని కలిసి కనీస మద్దతు ధరకు చట్టబద్ధ గ్యారంటీ కోరుతున్న తమ డిమాండ్‌కు మద్దతు కోరారు. తాము అనుకూలంగానే ఉన్నామని, ఇండి కూటమి నాయకులతో చర్చిస్తామని, పార్లమెంటులో లేవనెత్తుతామని ఆయన హామీ ఇచ్చారు. ఎంఎస్‌పి రైతుల హక్కు అని ఆయన అన్నారు.

ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం పార్లమెంటుకు సమర్పించిన 2024–25 వార్షిక బడ్జెట్‌లో రైతుల ఆదాయాన్ని రెట్టింపుచేసే దిశలో ఎంఎస్‌పి పెంపుతున్నామన్నారు. కాని వ్యవసాయ పంటలకు ఎంఎస్‌పిని స్వామినాథన్ సిఫారసు ప్రకారం వ్యవసాయ వ్యయం ప్లస్ 50 శాతం సూత్రం (సి2+) ప్రకారం నిర్ణయిస్తున్నట్లు చెప్పలేదు. ఎంఎస్‌పికి లీగల్ గ్యారంటీపై రైతులకు ప్రధానమంత్రి ఇచ్చిన హామీని ప్రస్తావించలేదు. వ్యవసాయరంగానికి కేటాయింపు 4.5శాతం పెంచుతున్నట్లు (రూ.1,32,469.86కోట్లు)గొప్పగా చెప్పారు. పప్పుదినుసులు, నూనెగింజల్లో స్వయంసమృద్ధి సాధనకుగాను వాటి ఉత్పత్తి, స్టోరేజి, మార్కెటింగ్ పటిష్టం చేస్తామన్నారు. మన దేశం ప్రస్తుతం తన పప్పుదినుసుల అవసరాల్లో 15శాతం, వార్షిక వంటనూనెల వినియోగంలో 56శాతం దిగుమతి చేసుకుంటున్నది. పప్పుదినుసులు, నూనెగింజల ఉత్పత్తికి ప్రోత్సాహం గురించి మాట్లాడటం ఏప్పటినుంచో జరుగుతోంది. కాని ఆచరణాత్మక చర్యలు తగినంతగా లేవు. వాటి ఉత్పత్తికి రైతులు ఉత్సాహం చూపాలంటే ఉత్పత్తి సేకరణకు గ్యారంటీ కావాలి. వ్యవసాయ కార్మికులకు చెల్లింపు, రుణం తిరిగి చెల్లింపు, మళ్లీ విత్తులకి చేతిలో నాలుగు డబ్బులు ఉండేట్లు సి2 ప్రాతిపదికన ఎంఎస్‌పి నిర్ణయించాలి.

2019 ఎన్నికలకు ముందు, అప్పటికి బడ్జెట్ కేటాయింపు లేకున్నా, తదుపరి బడ్జెట్ లో సర్దుబాటు ప్రాతిపదికపై కేంద్రప్రభుత్వం 'ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్' పేరుతో చిన్న– సన్నకారు రైతులకు వ్యవసాయ పెట్టుబడికిగాను ఒక్కొక్కరికి రూ.6వేల చొప్పున సహాయంగా ఇస్తున్న మొత్తాన్ని కూడా ఈ బడ్జెట్‌లో పెంపుచేయలేదు. మిగతా అన్ని రంగాలకు వర్తించే ద్రవ్యోల్బణ ప్రభావం నుంచి రైతులకు మినహాయింపు లేదు కదా. ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు, కూలీ వగైరా ఖర్చులన్నీ ఏటా పెరుగుతూనే ఉన్నాయి కదా! వాటికి పరిహారం లేదా? ఎంఎస్‌పిలో పెంపుదల ద్రవ్యోల్బణం మేరకు కూడా ఉండటం లేదు. పైగా ఎరువులు, పురుగు మందులు వగైరాలపై సబ్సిడీలకు కోత పెట్టారు ఆర్థికమంత్రి. అందువల్ల నోటితో నవ్వుతూ నొసటితో వెక్కిరించినట్లు గా ఉంది రైతులపట్ల కేంద్రప్రభుత్వ వైఖరి. పైగా ప్రభుత్వరంగంలో అద్భుతమైన వ్యవసాయ పరిశోధనా సంస్థలుండగా వాటిలోకి బహుళజాతి కార్పొరేషన్లకు, ప్రైవేటు సంస్థల ప్రవేశాన్ని మోదీ ప్రభుత్వం అనుమతిస్తున్నది. ప్రతిష్టాత్మకమైన ఐసిఏఆర్‌తో బేయర్, అమెజాన్ వంటి విదేశీ కంపెనీలతో అవగాహన ఒప్పందాలు 2023 లోనే మొదలైనాయి. అటువంటి పరిశోధనకు ప్రైవేటు కంపెనీలకు నిధులిస్తామని ఆర్థికమంత్రి చెప్పారు. బడ్జెట్‌లో చెప్పిన నవ ప్రాధాన్యతల్లో ఒకటైన "నవతరం సంస్కరణలకు" ఇది ఆరంభమన్నమాట!

# ముంచుకొస్తున్న ఆహార సంక్షోభం!

ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో ఆహార సంక్షోభం ముంచుకొస్తున్నది. సోమాలియా, కాంగో, ఇథియోపియా, రువాండా వంటి దేశాలు ఇప్పటికే ఆకలితో అల్లాడిపోతున్నాయి. 2030 నాటికి ఆకలి కేకల్లో ఆసియాను అధిగమించి, కరువు ఖండంగా ఆఫ్రికా మొదటి స్థానంలో నిలవనుంది. ఐక్యరాజ్య సమితి (యుఎన్) నివేదికను అనుసరించి ఆహార భద్రత లేకపోవడం పలు సమస్యలకు దారి తీస్తుంది. ముఖ్యంగా పోషకాహార లోపం, శిశు మరణాలు వంటి దారుణాలకు కారణమవుతున్నది. ఆహార సంక్షోభం ఇంతగా పెరుగుతున్నప్పటికీ, ప్రపంచ దేశాలు, ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాలు స్పందించక పోవడం దారుణం. వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాలు, యుద్ధాలు, ఆర్థిక పరమైన ఒడిదుడుకులు వంటి అంశాలు ప్రపంచ ఆహార వ్యవస్థను ప్రభావితం చేస్తున్నాయి. తినడానికి తగినంత ఆహారం లేకుండా, పోషకాహార లోపంతో బాధపడుతున్న వారు ఇప్పటికీ ఆఫ్రికాలో అత్యధికంగా 20.4 శాతం మంది ఉన్నారు. గత ఏడాది ఆసియాలో 384.5 మిలియన్ల మంది ఆకలితో అల్లాడుతుంటే, ఆఫ్రికాలో ఈ సంఖ్య 298.4 మిలియన్లు. అయితే, అంతర్యుద్ధాల నుంచి అతివృష్టి , అనావృష్టి వరకూ అనేకానేక అంశాలు ఆఫ్రికాలో ఆకలి కేకలను పెంచుతున్నాయి. కరువు అక్కడ నిత్యకృత్యమైంది. పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, ఆకలి సమస్య ఆఫ్రికాలో పెరగడం ఆందోళన కలిగించే విషయమైతే, క్రమంగా యావత్ ప్రపంచాన్ని చుట్టుముడుతుందనే హెచ్చరికలు మరో కీలకాంశం. వెంటనే స్పందించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోకపోతే, పరిస్థితి మరింత దిగజారుతుందని వ్యవసాయాభివృద్ధికి అంతర్జాతీయ నిధి (ఇఫాడ్) అధ్యక్షుడు అల్వారో లారియో ఆందోళన వ్యక్తం చేశాడు. కొన్ని దేశాల్లో జనాభా పెరుగుదల కూడా ఆహార సమస్యను పెంచిపోషిస్తున్నది. స్థానిక ఉత్పత్తి, పంటల వైవిధ్యం, ఎరువుల వాడకం, ప్రభుత్వ పెట్టుబడులు తదితర అంశాలపై ఆసియా కొంత మెరుగైన నిర్ణయాలను తీసుకుంటుండగా, ఆఫ్రికా శరవేగంగా పతనమవుతున్నది. ప్రస్తుత పోకడల్లో మార్పు రాకపోతే, మరో ఆరేళ్లలో సుమారు 600 మిలియన్ల మంది ఆఫ్రికా ప్రజలు ఆకలితో లేదా పోషకాహార లోపంతో బాధపడుతూ ఉంటారు. ఒకప్పుడు ఆసియాను వేధించిన పరిస్థితులే ఇప్పుడు ఆఫ్రికాలో కనిపిస్తున్నాయి. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో కొద్దికాలంగా స్తబ్ధత నెలకొందని, దీని వల్ల భవిష్యత్తులో, ఆఫ్రికా ఖండంలోని దాదాపు అన్ని దేశాల్లోనూ కరువు పరిస్థితులు తప్పకపోవచ్చని ఈస్టర్న్ ఆఫ్రికా ఫార్మర్స్ ఫెడరేషన్ (ఇఎఎఫ్ఎఫ్) అధ్యక్షురాలు ఎలిజబెత్ సిమల్లా అంటున్నారు. తూర్పు ఆఫ్రికా ప్రాంతంలో సుమారు 25 మిలియన్ల మంది ఆహార ఉత్పత్తిదారులకు ఇఎఎఫ్ఎఫ్ సంస్థ ప్రాతినిథ్యం వహిస్తున్నది. కాగా, ఆఫ్రికా ఖండంలో చిన్న కమతాలు ఎక్కువ. సుమారుగా 3.3 కోట్ల కమతాలు ఉన్నట్టుట అంచనా.



ఆఫ్రికా ఖండంలో జరుగుతున్న ఉత్పత్తిలో 70 శాతం వరకూ ఈ చిన్న లేదా సూక్ష్మ కమతాల నుంచే వస్తున్నది. అధునాతన వ్యవసాయ విధానాలను అమలు చేయడానికి, ఉత్పత్తిని పెంచేందుకు సరికొత్త శాస్త్రసాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడానికి చిన్నకమతాలు అడ్డుగా ఉంటున్నాయి. అందుకే, ఊహించిన స్థాయిలో ఉత్పత్తి జరగడం లేదు. క్రమంగా పతనమవుతున్న వ్యవసాయోత్పత్తులు సహజంగానే కరువు పరిస్థితులను సృష్టిస్తున్నాయి. ఆఫ్రికా దేశాలు గాఢ నిద్ర నుంచి, అంతులేని నిర్లక్ష్యం నుంచి ఇకనైనా మేలుకోకపోతే, రాబోయే రోజుల్లో ఆకలి చావులు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్యానికి ప్రకృతి వైపరీత్యాలు కూడా జత కలుస్తున్నాయి. వాతావరణ సంక్షోభమే ప్రకృతి ప్రకోపాలకు కారణమవుతున్నది. అతివృష్టి, అనావృష్టి ఆహార ఉత్పత్తులను దెబ్బతీస్తున్నాయి. ఫలితంగా, ఆహార భద్రతపై నీలినీడలు తప్పడం లేదు. వాతావరణంలో చోటు చేసుకుంటున్న విపరీతమైన మార్పులు ఆహారోత్పత్తిని గణనీయంగా తగ్గిస్తున్నాయని ఆఫ్రికా వ్యవసాయ సాంకేతిక నిపుణుల బృందం చీఫ్ డయానా ఒన్యాంగో తేల్చిచెప్పింది. తూర్పు ఆఫ్రికాలో సుమారు నాలుగు సంవత్సరాలుగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, సకాలంలో వర్షాలు పడకపోవడం కరువుకు కారణమవుతున్నదని ఆమె అంటున్నారు. అంతేగాక, రైతులకు వైవిధ్యభరితంగా సహాయపడే సమాచారం లభించడం లేదని, చాలామంది రైతుల్లో ఆధునిక వ్యవసాయంపై సరైన అవగాహన కూడా లేదని ఆయన అభిప్రాయం. వాతావరణ పరిస్థితులను గమనించి, మార్పులకు అనుగుణంగా, స్థితిస్థాపకంగా ఉండడానికి సహాయపడే ఉత్తమ పంటలను వేయాల్సిన అవసరాన్ని ఆమె ప్రస్తావించారు. ఒన్యాంగో పేర్కొన్న అంశాలే ప్రధానంగా ఆఫ్రికాను ఆకలి ఖండంగా మార్చేస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాల్లో రైతులు ఇప్పటికీ సాంప్రదాయ సేద్య విధానాలనే అనుసరిస్తున్నారు. భూగర్భ జలాలు ఇంకిపోవడం, నదులు, కాలువలు ఎండిపోవడం ఇటీవల కాలంలో ఎక్కువైంది. వాతావరణంతోపాటు సాగునీటి లభ్యతను కూడా దృష్టిలో ఉంచుకొని, అధునాతన వ్యవసాయ విధానాలను అనుసరించడం అత్యవసరం. కానీ, అధిక శాతం మంది రైతుల్లో సరైన అవగాహన లేదు. శాస్త్రీయ పరిజ్ఞానం లేదు. వారిని అన్ని విధాలుగా చైతన్యవంతులను చేయాల్సిన బాధ్యతను ప్రభుత్వాలు ఏనాడో విస్మరించాయి. మితిమీరిన పారిశ్రామికీకరణ, పట్టణీకరణ వ్యవసాయదారులను వలస కూలీలుగా మార్చేస్తున్నాయి. వ్యవసాయ భూములు బీడులుగా మారుతుండగా, ఉత్పత్తి క్షీణిస్తున్నది. పండిన పంటలకు గిట్టుబాటు ధర లేకపోడం, మధ్యదళారుల చేతిలో అన్నదాత చిక్కుకుపోవడం వ్యావసాయాన్ని దారుణంగా దెబ్బతీస్తున్న తరుణంలో, ఆహార లభ్యత తగ్గుతున్నది. ఆకలి పెరుగుతున్నది. ఆహార భద్రత అటకెక్కింది. కరువు దుష్ఫలితాలన్నీ వెనుకబడిన లేదా పేద దేశాలను ఆవరిస్తున్నాయి. ఆఫ్రికాలో ప్రతి నలుగురు పిల్లలల్లో కనీసం ఒకరు పోషకాహారం లేని కారణంగా అనారోగ్యం పాలవుతున్నారని, కోలుకోలేని రీతిలో వారి ఆరోగ్యం దెబ్బతిని క్రమంగా మృత్యు ఒడిలోకి జారిపోతున్నారని యుఎన్ నివేదిక పేర్కొంది. తరచు అంతర్యుద్ధాలతో దేశాలు నలిగిపోవడం కూడా ఆహార భద్రతకు ముప్పు వాటిల్లుతున్నదని ఈ నివేదిక స్పష్టం చేసింది. ఇథియోపియాలోని పలు ప్రాంతాల్లో రైతులు తమతమ వ్యవసాయ క్షేత్రాల్లోకి వెళ్లి, పనులు చేసుకోలని పరిస్థితులు నెలకొన్నాయి. అశాంతి, ఘర్షణలు, మారణహోమాలు, ఆధిపత్య పోరాటాలు ఏ స్థాయిలో వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తున్నదో చెప్పడాని ఇథియోపియా ఓ ఉదాహరణ. తీవ్రమైన పేదరికం సైతం అంతర్యుద్ధాలకు దారితీస్తున్నది. ఫలితంగా అశాంతి నెలకొంటుంది. భయానక వాతావరణంలో రైతులు వ్యవసాయ పనులు కొనసాగించడం సాధ్యం కావడం లేదు. దీనితో వ్యవసాయోత్పత్తులు తగ్గుతాయి. ఫలితంగా కరువు నెలకొంటుంది. కరువు మళ్లీ అంతర్యుద్ధాలకు ఆజ్యం పోస్తుంది. ఈ విషవలయాన్ని ఛేదించడానికి ప్రగతిశీల, నిర్ణయాత్మకమైన విధానాలు అవసరం. కానీ, అమెరికా వంటి దేశాలు అంతర్యుద్ధాలను, వివిధ దేశాల మధ్య యుద్ధాలను పెంచిపోషిస్తున్నందున, వ్యవసాయం దారుణంగా కుంటుతున్నది. ప్రపంచ ఆహార వ్యవస్థను నాశనం చేస్తున్న విధానాలను ఈ దేశాలు మానుకోవడం లేదు. పేద దేశాల్లో ఆకలి కేకలు తప్పడం లేదు.

**మినహాయింపు లేదు...**

కరువు పరిస్థితులు మన దేశంలో ఆఫ్రికా దేశాల స్థాయిలో లేకపోయినప్పటికీ, పూర్తిగా మినహాయించడానికి కూడా వీల్లేదు. ప్రపంచ ఆకలి సూచీ (గ్లోబల్ హంగర్ ఇండెక్స్/ జిహెచ్ఐ) నివేదికను అనుసరించి, మొత్తం 125 దేశాలకుగాను మన దేశం 111వ స్థానంలో ఉన్నదనే విషయం తెలిసిందే. ఈ విషయంలో పాకిస్తాన్, బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక వంటి దేశాలు కూడా మన కంటే మెరుగ్గా ఉన్నాయన్న వాస్తవాన్ని భారతీయులు సులభంగా జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రపంచంలోనే అత్యంత పెద్ద ఆర్థిక వ్యవస్థల జాబితాలో మూడో స్థానానికి చేరుకోవడమే లక్ష్యమంటూ ప్రతిసారీ ప్రకటనలు గుప్పిస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గత పదేళ్ల కాలంలో సాధించింది శూన్యమనే చెప్పాలి. ప్రపంచ, ప్రాంతీయ, జాతీయ స్థాయిల్లో ఆకలి తీవ్రతను గుర్తించడానికి, కొలవడానికి జిహెచ్ఐ ఒక సాధనం. ఈ సూచీ '0'గా ఉంటే, ఆకలి సమస్య లేదని లేదా నామమాత్రంగా ఉందని అర్థం. ఈ సంఖ్య పెరుగుతున్న కొద్దీ పరిస్థితి అధ్వాన్నంగా మారుతున్నట్టు గ్రహించాలి. 100 ర్యాంకులు దాటి ఉంటే, ఆకలి సమస్య దారుణంగా ఉందని అర్థం చేసుకోవాలి. ఆహార సమస్య అదేది కేవలం కరువును మాత్రమే ప్రాతిపదికగా తీసుకొని ఇచ్చే నివేదిక కాదు. పౌష్టికాహారం, నాణ్యమైన ఆహారం వంటి కోణాలను కూడా పరిగణలోకి తీసుకొని లెక్కిస్తారు. అందరికీ సురక్షితమైన, సరిపడా ఆహారాన్ని అందించడం ప్రభుత్వ కర్తవ్యం. కానీ, మోదీ సర్కారు వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న కారణంగా, సమస్యలు పెరుగుతునే ఉన్నాయి. మన దేశంలో ఆకలి సూచీ 2015 లో 29.2కాగా, 2023 నాటికి స్వల్పంగా తగ్గి, 28.7 శాతానికి చేరింది. కానీ, ఇది కూడా ప్రమాదకరమైన పరిస్థితిగానే పేర్కొంటారు. వాతావరణ మార్పులు, కొవిడ్ మహమ్మారి సృష్టించిన ఆర్థిక విధ్వంసం వంటి అనేక అంశాలు పరిస్థితులు దిగజారడానికి కారణం. అయితే, మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యవసాయ వ్యతిరేక విధానాలు కూడా సమస్యను పెంచిపోషిస్తున్నాయి. రైతు ఆయాదాన్ని రెట్టింపు చేస్తామంటూ పెట్టిన గడువు ఏనాడో తీరిపోయింది. రెట్టింపుమాట ఎలావున్నా, ప్రాథమిక సమస్యలు తీరడం లేదు. ఇచ్చిన హామీలకు అతీగతీ లేదు. ఇవే విధానాలు కొనసాగితే, మన దేశం కూడా దక్షిణాఫ్రికా దేశాల జాబితాలో చేరడం ఖాయం.

ఎస్వీయార్



### కారణాలు అనేకం

మన దేశంలో ఆకలి కేకలు పెరగడానికి ఎన్నో కారణాలు ఉన్నాయి. సామాజిక, ఆర్థిక అసమానతలను ప్రధానంగా పేర్కోవాలి. వేళ్లానుకుంటున్న పేదరికం నుంచి ప్రజలను తప్పించడానికి ప్రభుత్వ పరంగా జరుగుతున్న కృషి దాదాపు శూన్యం. దేశంలో పోషకాహార, ఆరోగ్య సంరక్షణ సేవలు సక్రమంగా అమలు కావడం లేదు. దేశంలో, 'హిడెడ్ హంగర్' (కనిపించని ఆకలి)గా పేర్కొనే సూక్ష్మ పోషక లోపం విపరీతంగా ఉందని యుఎన్ నివేదికలు తేల్చిచెప్తున్నాయి. ఈ సమస్యను అధిగమించడానికి వ్యూహాత్మక విధానాలను కేంద్రం అమలు చేయడం లేదన్న విమర్శలున్నాయి. అసమర్థమైన వ్యవసాయ విధానాలు, అస్తవ్యస్తమైన ఆహార పంపిణీ భారత్‌లో ఆకలి సమస్యను పెంచుతున్నాయి. వాతావరణ మార్పులు కూడా సమస్య తీవ్రతను పెంచుతున్నాయి. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టపోతే భారత్ మరో సోమాలియాగా మారుతుంది.

# తెలివిగా తదుపరి సంస్కరణలకు కేంద్ర బడ్జెట్

గ్యాన్ పాథక్

తాజా లోక్‌సభ ఎన్నికల ఫలితాల నుండి పాఠాలు నేర్చుకొన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2024–25 కేంద్ర బడ్జెట్‌లో నవ ప్రాధాన్యతాంశాల పేరుతో తెలివిగా తదుపరి తరం ఆర్థిక సంస్కరణలను ముందుకు తీసుకెళ్ళారు. ఇతర ఎనిమిది ప్రాధానత్య రంగాలలో మూడు రంగాలు ప్రధాని రేంద్ర మోదీ, బిజెపికి వ్యతిరేకంగా ఉన్న రైతులు, నిరుద్యోగులు, గడిచిన పదేళ్ళలో అభివృద్ధి నమూనా నుండి దూరం చేయబడిన బాధిత ప్రజలు ఉన్నారు. వారి వ్యతిరేక ఓటుతో మోదీ, బిజెపిలకు కళ్ళెం వేయబడి, లోక్‌సభలో 240 స్థానాలకే పరిమితం చేయబడింది.

తదుపరి తరం ఆర్థిక సంస్కరణలను కొనసాగించేందుకు మోదీ ప్రభుత్వానికి విస్తృత ప్రజా మద్దతు అవసరం. అందుకే కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయం, ఉద్యోగాలు, సమ్మిళిత అభివృద్ధి అనే మూడింటికి అధిక ప్రాధాన్యత ఇవ్వబడింది. ఇతర ఐదు ప్రాధాన్యతా రంగాలేమిటంటే తయారీరంగం, సేవలు, పట్టణాభివృద్ధి, ఇందన, మౌలిక సదుపాయాలు, నవీనత్వం ఆర్ అండ్ బి; అలాగే ఈ ఏడాది బడ్జెట్ ఇతివృత్తం ఐదు అంశాలపై సాదింది – ఉద్యోగాలు, నైపుణ్యతలు, ఎంఎస్ఎంఇలు, మధ్య తరగతి వర్గం.

తీవ్రమైన ఉద్యోగ సంక్షోభంలో ఉన్న దేశంలో ఉద్యోగాల సృష్టిపై బడ్జెట్ దృష్టి సారించినట్లు అర్థమవుతుంది. పని చేసే తీరు మారుతున్న నేపథ్యంలో నైపుణ్య స్థాయిలతో సంబంధం లేకుండా శ్రామికులందరిపై ఈ ప్రభావం ఉంటుందని ఆర్థిక సర్వే 2023–24 నివేదిక హెచ్చరించింది. ఉద్యోగాల సృష్టి, శ్రామికశక్తిలో పెద్ద ఎత్తున మహిళా భాగస్వామ్యాన్ని ప్రోత్సహించటం కోసం, మహిళల నేతృత్వంలోని యూనిట్‌లకు అవసరమైన మద్దతు ప్రకటించారు. అలాగే హాస్టళ్ళ ఏర్పాటు, మహిళా ప్రత్యేక పథకాల కోసం భాగస్వామ్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.ఎంఎస్ఎంఇలకు క్రెడిట్ గ్యారెంటీ పథకాన్ని విస్తరించారు. ముద్ర కింద తరుణ్ కేటగిరిలో రుణాలు తిరిగి చెల్లించిన వారికి తిరిగి రుణాన్ని ఇచ్చే పరమితిని రూ.10 లక్షల నుండి రూ.20 లక్షలకు పెంచారు.

క్యాపెక్స్ (మూలధన వ్యయం) పెంపు ద్వారా భారీగా ఉద్యోగాలు వస్తాయని భావిస్తున్నారు. కానీ, గతంలో క్యాపెక్స్ పెంచినప్పటికీ ఆశించిన స్థాయిలో ఉద్యోగాల సృష్టి జరగలేదు. ఇందుకు కఠిన శ్రమ అవసరమైన రంగాలలో పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం కారణం. పేదరికం, అసమానత్వాన్ని రూపుమాపేందుకు ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజనను వచ్చే ఐదేళ్ళ కాలానికి 80 కోట్ల మందికి విస్తరించారు. ఇది పాత పథకమే తప్ప కొత్తది కాదు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద 3 కోట్ల అదనపు అందుబాటు ధరలో ఉండే గృహాలను ప్రకటించారు. ఇది ప్రజా సంక్షేమం కోసమని ప్రకటించినప్పటికీ పారిశ్రామిక రంగానికి కూడా ఊతమిస్తుంది. ఈ పథకానికి రూ.10 లక్షల కోట్లు కేటాయించారు. కేంద్ర ప్రభుత్వం అందులో రూ.2 లక్షల కోట్లు అందజేస్తుంది. మహిళ నేతృత్వంలో అభివృద్ధి కోసం బడ్జెట్‌లో మహిళలు, ఆడపిల్లలకు రూ.3 లక్షల కోట్లు కేటాయించారు. గిరిజనుల సామాజిక ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు బడ్జెట్‌లో ప్రధాన మంత్రి జనజాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్ పథకాన్ని ప్రకటించి, సంతృప్త స్థాయిలో గిరిజన గూడేలలో అమలు చేయనున్నారు. ఈ పథకం 63 వేల గ్రామాలలోని 5 కోట్ల గిరిజనులకు లబ్ది చేకూరుస్తుంది.

# 14 గంటల పనిదినాన్ని విరమించుకోవాలి



ఎస్.బాల్‌రాజ్
ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
8074246685

తెలంగాణప్రభుత్వం విడుదల చేసిన జి.ఒ.నెం.5 తేది: 07.06.2024ను తీసుకొచ్చి సాఫ్ట్‌వేర్ కంపెనీలలో పనిచేస్తున్న ఉద్యోగులకు షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు 1988 చట్టం సబ్‌సెక్షన్ నెం.20/1988 మినహాయింపు ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ ఎనేబుల్డ్ సర్వీసెస్ (టిఇఇఎస్) ప్రకారం 4 సంవత్సరాల వరకు ఐ.టి. ఇండస్ట్రీలో పనిచేస్తున్న ఉద్యోగ కార్మికులకు షాప్స్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ 1988 ప్రకారం వారానికి 48 గంటల పని దినం ప్రకారం వారానికి ఒక రోజు వారాంతపు సెలవు ఇవ్వాలని, యాజమాన్యాలు గతంలో బాలికలు, మహిళలు సూర్యోదయం కంటె ముందు సూర్యు డు అస్తమించిన తర్వాత ఏ పరిశ్రమలో వ్యాపార సంస్థలో పనిచేయరాదనే నిబంధనను తుంగలో తొక్కి ఐ.టి.ఇండస్ట్రీలో పనిచేస్తున్న మహిళలను యాజమాన్యాలు నియమించుకోవచ్చని నైట్ షిఫ్ట్ పనులు చేయించుకునేలా యాజమాన్యాలకు మినహాయింపు ఇవ్వటం, పనిచేస్తున్న ఐ.టి. ఉద్యోగులకు గుర్తింపు కార్డులు, ఇతర సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయాలని, గుర్తించిన సెలవు దినాలను ప్రకటించి సెలవుతో కూడిన వేతనాలను చెల్లించే ప్రొవిజన్ సబ్‌సెక్షన్ (2)ఆఫ్ సెక్షన్ 31ఆఫ్ ది తెలంగాణ షాప్స్ ఎస్టాబ్లిష్‌మెంట్ 1988 ముందస్తుగా సెలవు దినాలను ప్రకటించాలని ఈ యాక్టు ప్రకారం పనిచేస్తున్న ప్రతి సంస్థ డ్రైవర్లకు గుర్తింపు కార్డులు ఇచ్చి వారి డ్రైవింగ్ లైసెన్స్, ఫోటో, పూర్తి చిరునామ టెలిఫోన్ నెంబర్, మొబైల్ నెంబర్ మొదలగునవి యాజమాన్యాలు సేకరించాలని చట్టం నిర్దేశిస్తుం ది.

పై నిబంధనలను పై చట్టం ప్రకారం ఐ.టి. పరిశ్రమలలో పనిచేస్తున్న ఉద్యోగులకు వర్తించవని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జి.ఓ.నెం. 5 ను కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో లాగా బెంగుళూరు ఐ.టి.పరిశ్రమలలో అమలు చేసేందుకు శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టి ఐ.టి. పరిశ్రమలలో పనిచేస్తున్న ఉద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయి. దీనిలో భాగంగా కర్నాటక ప్రభుత్వం ఐ.టి. ఉద్యోగుల పనిగం.ల ను 14 గంటల వరకు పెంచుతుంది. కర్నాటక ప్రభుత్వం శాసన సభలు బిల్లును ప్రవేశపెడుతూ 12 నుండి 14గంటలకు పని గంటలు పెంచుతూ నిర్ణయించటం, అధికార పార్టీ కార్మిక శాఖామాత్యులు, ఉద్యోగ కార్మికుల శ్రేయోభిలాషులు వ్యతిరేకించటంతో బిల్లును అబేయన్స్‌లో పెట్టటం జరిగింది.

చట్టం ప్రకారం వారానికి 48 గంటలు, రోజుకు 8 గంటలు పనిగంటలు మించరాదని చట్టాలు ఘోషిస్తు న్నా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జి.ఒ.ను కర్నాటక ప్రభుత్వ కార్మిక శాఖ మంత్రి పనిగంటలు 8 నుండి 14 గంటలు పెంచు తూ అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టగా మెజార్టీ సభ్యులు వ్యతిరేకించటంతో కర్నాటక రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధి రామయ్య అబేయన్స్‌లో పెట్టారు.

ఐ.టి.పరిశ్రమల అసోసియేషన్ లు ప్రధానంగా నాస్‌కం సంస్థలు కూడా వ్యతిరేకించటం కూడా హర్షించ తగ్గ పరిణామమే. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దొడ్డి దారిన తీసుకువచ్చి అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు దేశవ్యాపితంగా అమలు చేసేందుకు చేసిన ప్రయత్నానికి గండిపడుతున్నప్పటికి వారానికి 48 గంటలు పని దినము అమలుకే మెజార్టీ ఐటి పరిశ్రమల ఉద్యోగు లు, ప్రభుత్వాలు కృతనిశ్చయంతో ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం బిజెపి పాలిత ప్రాంతాలలో వారానికి 48 గంటల నుండి 70 గంటల పనివారంగా చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. భారతదేశంలోని బిజెపి పాలిత ప్రభుత్వాలు అదే విధంగా బిజెపిని వ్యతిరేకించే కాంగ్రెస్ ప్రభుత్వాలు కూడా రోజుకు 14 గంటల పనిదినం అమలు చేసేందుకు ప్రయత్నిం చటంతో ఐటి ఉద్యోగుల పై మానసిక భారం, అనారోగ్య సమస్యలకు గురిచేయటం, రోజుకు రెండు షిఫ్టుల ద్వారా అదనపు పనిభారం మోప డం దారుణం. పోరాడి సాధించుకున్న 8గంటల పనిదినం చట్టాలను అంతర్జాతీయ కార్మికుల చట్టాలను రద్దుచేసే అధికారం భారతదేశ ప్రభుత్వాలకు లేదు. ప్రపంచవ్యాపితంగా పనిగంటలను 8 నుండి 6 గంటలకు తగ్గించి, వారానికి 5 రోజుల పనిదినాన్ని అమలు చేస్తూ ఉద్యోగ కార్మికులు ఉత్సాహపూరితంగా, సంపూర్ణ విశ్రాంతి, ఆరోగ్యంగా పనిచేస్తారు. కాని భారతదేశంలో 8 నుండి 12 గంటల పనిదినాన్ని అమలు చేసి మరింత ఆర్థిక పరిస్థితిని దిగజారేలా చేయటం శుద్ధతప్పు. పని గంటలను పెంచుటకు వ్యతిరేకిస్తూ హైశ్య దేశఉపాధ్యక్షులు బిపిన్ చంద్ర పెండియాల తన అభిప్రాయం చెపుతూ ఒకవేళ పని గంటలు పెంచుతూ నిర్ణయం తీసుకుంటే బెంగుళూర్ ఐటి కారిడార్ కుప్పకూలి ఆర్థిక పరిస్థితి దిగజారుతుందని హెచ్చరించారంటే ఎంత ప్రమాదకరమో అవగాహన చేసుకోవచ్చు.

మాజీ ఐటి ప్రొపెషనల్ ఫౌండర్ చైర్మన్ కిరణ్ చంద్ర ఐటి పరిశ్రమలలో పనిచేస్తున్న ఉద్యోగ కార్మికు ల జీవితాలతో క్రూరంగా ప్రవర్తించేలా చేయడమే పనిగంటలు పెంచటం అవుతుంది అన్నారు. పనిగంటలు పెంచుతూ భారం మోపడంతో న్యాయపరమైన చిక్కులు ఎదురవుతాయి. కార్మిక చట్టాలను రాజ్యాంగ హక్కులను కాపాడకుండా కార్మికులపై ఉద్యోగులపై మానసిక ఒత్తిడికి గురిచేయడం సరికాదు. కృష్ణా విజ్, వైస్ ప్రెసిడెంట్ "టియ్‌లిస్' ప్రకారం పని గంటలు పెంచి పనిభారం పెంచే ఉద్దేశ్యం ప్రకారం ఐ.టి. ఉత్పత్తులను పెంచే ఆలోచనతో యాజమాన్యాలు మరియు ప్రభుత్వాలు చేసే ఉద్యోగ కార్మిక వ్యతిరేక విధానాల వల్ల వారి ఆవేశానికి యాజమాన్యా లు బలికాక తప్పదు. కావున ప్రభుత్వాలు, యజమాన్యాలు తస్మాత్ జాగ్రత్త.

# ఎలక్ట్రానిక్స్ రంగంలో ఘనమైన లక్ష్యం

ఎలక్ట్రానిక్స్ రంగంలో భారత్‌ను అగ్రగామిగా నిలపాలన్న ఘనమైన లక్ష్యాన్ని నీతి ఆయోగ్ సిద్ధం చేసింది. 2030 నాటికి ప్రపంచం ఎలక్ట్రానిక్స్ లావాదేవీల్లో సింహభాగాన్ని అందుకునే దిశగా వ్యూహరచన చేసింది. తద్వారా, ప్రస్తుతం 100 బిలియన్ డాలర్లుగా ఉన్న భారత ఎలక్ట్రానిక్స్ రంగాన్ని 500 బిలియన్ డాలర్లకు పెంచాలన్నది నీతి ఆయోగ్ ఆలోచన. ప్రస్తుతం మన దేశంలో ఎలక్ట్రానిక్స్ రంగంలో తుది అసెంబ్లింగ్‌కు ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నది. చిప్స్ నుంచి మదర్‌బోర్డు వరకూ వివిధ పరికరాలను తెప్పించుకొని, వాటిని అసెంబుల్ చేస్తున్నది. సాఫ్ట్‌వేర్ రంగంలో మెరుగైన ప్రతిభ కనబరుస్తున్నది. బ్రాండ్లు, డిజైన్ సంస్థలు మన దేశంలోని ఎలక్ట్రానిక్ తయారీ సేవలు (ఇఎంఎస్) కంపెనీలకు అసెంబ్లింగ్, టెస్టింగ్, ప్యాకింగ్ పనులను ఎక్కువగా ఇస్తున్నాయి. అవుట్ సోర్సింగ్ విధానంలో ఈ కాంట్రాక్టులను భారత కంపెనీలు పొందుతున్నాయి. ఇటీవల కాలంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత ఎలక్ట్రానిక్స్ రంగం గత ఏడాది చివరి నాటికి 155 బిలియన్ డాలర్లకు చేరింది. 2016–17 ఆర్థిక సంవత్సరంలో ఇది కేవలం 48 బిలియన్ డాలర్లు. ప్రధానంగా మొబైల్ ఫోన్ల ద్వారా భారత ఎలక్ట్రానిక్స్ సేవా రంగం విస్తరించడం గమనార్హం. ఇది ఇప్పుడు మొత్తం ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తిలో 43 శాతంగా ఉంది. ఇలావుంటే, స్మార్ట్‌ఫోన్ల కోసం దిగుమతులపై ఆధారపడకుండా ఉండేందుకు దేశంలో వివిధ మొబైల్ తయారీ కంపెనీలను ప్రోత్సహించింది. ప్రస్తుతం ప్రపంచ ఎలక్ట్రానిక్స్ మార్కెట్‌పై 4.3 ట్రలియన్ విలువైన లావాదేవీలతో చైనా అగ్రస్థానాన్ని ఆక్రమించింది. తైవాన్, అమెరికా, దక్షిణ కొరియా, వియత్నాం, మలేసియా వంటి దేశాలు ఆ తర్వాతి స్థానాల్లో నిలుస్తున్నాయి. భారత్‌ను కూడా అదే జాబితాలో, ముందు వరుసలో ఉంచాలని నీతి ఆయోగ్ లక్ష్యంగా ఎంచుకుంది. ఈ క్రమంలోనే, రక్షణ విభాగం మినహా, మిగతా అన్ని విభాగాల్లోనూ ఎలక్ట్రానిక్ కంపెనీల్లో వంద శాతం విదేశీ సంస్థాగత పెట్టుబడులు (ఎఫ్‌డిఐ)ను అనుమతించాలని నిర్ణయించింది. డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ విషయంలో, ఆటోమేటిక్ మార్గం ద్వారా 49 శాతం వరకూ ఎఫ్‌డిఐని అనుమతిస్తారు. ఒకవేళ ఇంతకంటే ఎక్కువ మొత్తం పెట్టుబడులు పెట్టాలంటే, ముందుగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి. రక్షణ విభాగాన్ని మినహాయిస్తే, మరే ఇతర రంగంలోనూ ఇలాంటి పరిమితులు లేవు. ఎలక్ట్రానిక్స్ రంగంలో నైపుణ్యాన్ని పెంచే విషయంలో ప్రపంచ దేశాలకు కేంద్రంగా భారత్‌ను నిలపాలని కూడా నీతి ఆయోగ్ లక్ష్యంగా ఎంచుకుంది. ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, ఐటి హార్డ్‌వేర్ ఉత్పత్తిని భారీగా పెంచడానికి ఉత్పత్తితో ముడివడిన ప్రోత్సాహకాలను ప్రకటించింది. ఎలక్ట్రానిక్ విడి భాగాలు, సెమీకండక్టర్ల తయారీని ప్రోత్సహించేందుకు ఎస్‌పిఇసిఎస్ పథకాన్ని అమలు చేస్తున్నది. దేశంలో స్థిరమైన సెమీకండక్టర్, ప్రదర్శన పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో 10 బిలియన్ డాలర్ల ప్రోత్సాహక వ్యయంతో సెమికాన్ ఇండియా ప్రోగ్రామ్ ప్రారంభమైంది. డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, దశలవారీ తయారీ కార్యక్రమం, ఎలక్ట్రానిక్ క్లస్టర్ తయారీ పథకం, ఎలక్ట్రానిక్స్ డెవలప్మెంట్ ఫండ్ మొదలైన ఇతర పథకాలు ఈ రంగం వృద్ధికి తోడ్పడేందుకు మొదలయ్యాయి. ఈ అంశాలు సానుకూల వాతావరణాన్ని సూచిస్తున్నప్పటికీ, కొన్ని ప్రతికూల పరిస్థితులు కూడా లేకపోలేదు. వాటిలో మొదటిది అధిక దిగుమతి సుంకాల సమస్య. దీని వల్ల ఇన్‌పుట్ భాగాల ధరలు పెరుగుతాయి. అధిక ఖర్చుతో కూడిన ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీ ధరలకు అమ్మడం కష్టమవుతుంది. వివిధ రకాల సర్‌చార్జిలు మన దేశంలో 5, 10, 15, 20 శాతంగా ఉన్నాయి. అనేక ఉప పన్నులు వీటికి జత కలుస్తున్నాయి. దీనితో ఉత్పత్తి ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయి. అధిక ఫైనాన్సింగ్ వ్యయం కారణంగా, అధిక మూలధన వ్యయం అనివార్యమవుతున్నది. మన దేశంలో ఇది 9 నుంచి 13 శాతం కాగా, ఈ వ్యయం చైనాలో 4 శాతం, మలేసియాలో 3.5 శాతం, మెక్సికోలో 2.7 శాతం మాత్రమే. మౌలిక సదుపాయాల లేమి, నైపుణ్యం కొరత వంటి సమస్యలు కూడా ఎలక్ట్రానిక్స్ రంగంలో భారత్‌ను వేధిస్తున్నాయి. సరైన వసతలు లేకుండా లక్ష్యాలను సిద్ధం చేయడం, ఆర్భాటంగా ప్రకటించడం వల్ల ప్రయోజనం ఏమిటో నీతి ఆయోగ్‌కే తెలియాలి.



## మెరుగైన వైద్య సేవలు అందించాలి



ప్రజాపక్షం/సూర్యాపేట: కంటి సమస్యతో లయన్స్ క్లబ్ ఐ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్ చార్జ్ రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రం జమ్మిగడ్డలోని లయన్స్ కంటి ఆసుపత్రిని పరిశీలించారు. ఆసుపత్రిలో కంటి సమస్యతో వచ్చే రోగులను తమ సమస్యలు, ఆసుపత్రిలో అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి నిర్వహకులు దామోదర్ రెడ్డిని శాలువాలతో సన్మానించారు. ఆయన వెంట ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, రాష్ట్ర నాయకులు కొప్పుల వేణారెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త మీలా మాహాదేవ్, లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ దోసపాటి గోపాల్, చివ్వెంల మండల పార్టీ అధ్యక్షులు ధరావత్ వీరన్న నాయక్, చిలుముల శ్రీనివాస్ రెడ్డి, మద్రు హనుమంతరావు, డాక్టర్ క్రాంతి, మేనేజర్ మల్లికార్జున్ ఉన్నారు.

## బడ్జెట్‌లో ప్రజల ఆశలపై నీళ్లు

### టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి దామెర సత్యం

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: రాష్ట్ర బడ్జెట్ ప్రజల ఆశల మీద నీళ్లు జల్లినట్లు ఉందని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి దామెర సత్యం అన్నారు. ఈ బడ్జెట్ ఏవర్గానికి న్యాయం జరిగేలా లేదన్నారు. ఐటిరంగానికి, పారిశ్రామిక రంగాల మీద పాలసీలు లేవన్నారు. రైతు భరోసా పథకం మీద అనేక ఆంక్షలు పెట్టినట్లు ఉందన్నారు. రైతులను వృత్తి కార్మికులను బడ్జెట్ వంచించిందన్నారు. పేదవర్గాలకు సంబంధించిన పాలసీ లేదని, దళిత వర్గానికి సంబంధించిన ఏ ఒక్క పాలసీ ప్రకటించలేదన్నారు. ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందన్నారు. బడ్జెట్ సిరిసిల్ల జేఎన్‌టియు బిల్డిం గ్, గల్ఫ్ వెళ్లిన కార్మికుల ఊసేలేదన్నారు. వారి సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు.వస్త్రోత్పత్తి, ఆహారశుద్ధి పరిశ్రమల స్థాపన ప్రస్తావన లేదన్నారు.బడ్జెట్ పూర్తిగా అంకెల గారడీగా కొన్ని రంగాలకే ప్రాధాన్యత ఇచ్చినట్లు ఉందన్నారు. మహిళలకు ఉద్యోగ జీవన ఉపాధి కల్పన ఊసే లేదన్నారు.

## సమస్యలు పరిష్కరిస్తాం

### భువనగిరి మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు



ప్రజాపక్షం/భువనగిరిరూరల్: భువనగిరి పట్టణలోని జూనియర్ కాలేజీలో గల సమస్యలను త్వరగా పూర్తి చేస్తాం అని భువనగిరి మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణని మున్సిపల్ చైర్మన్ పరిశీలించారు. కాలేజీ గ్రౌండ్‌లో సమస్యలపై కళాశాల ప్రిన్సిపాల్‌ని అడిగి తెలుసుకన్నారు. తోరలో అన్ని సమస్యలను పరిష్కరిస్తమాని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## 16 పైసలు కూడా తీసుకురాకపోవడం సిగ్గుచేటు

### ఎస్‌సి కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్

ప్రజాపక్షం / హుజురాబాద్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలం గాణకు చాలా అన్యాయం జరిగిందని, బిజెపి, కాంగ్రెస్ తరుపున గెలిచిన ఎంపీలు 16 మంది కనీసం 16పైసలు కూడా తెలంగాణకు తీసుకురాకపోవడం సిగ్గు చేటని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ అన్నారు. కేంద్ర బడ్జెట్ సందర్భంగా గురువారం బండ శ్రీనివాస్ తన కార్యాలయంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అప్పటి ముఖ్యమంత్రి కేసిఆర్ రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వానికి భయకుండా తెలంగాణకు రావాల్సిన నిధులు వచ్చేలాగా పోరాటం చేశారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజలను మభ్యపెట్టి గెలిచిన ఎంపిలు తెలంగాణకు బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయింపు చేయించకపోవడంపై ప్రజలు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని గుర్తించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మంత్రులు, ఎంపిలతో కలిసి ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద దర్నా చేయాలని, ఈ ధర్నాకు బిఆర్ఎస్ పార్టీ కూడా పూర్తి మద్దతు తెలుపుతుందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ బడ్జెట్‌లో ఆరు గ్యారంటీలపై స్పందించి పూర్థిస్థాయిలో ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## మైనార్టీ గురుకుల సొసైటీలో అన్యాయాలు, అక్రమాలు

### తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు




ప్రజాపక్షం/దేవరకొండ: సీనియార్టీ లిస్ట్‌లో ప్రమోషన్‌లలో ముందున్న డిపార్ట్‌మెంట్ టెస్ట్ పాస్ కాలేదని ప్రమోషన్ ఇవ్వకపోవడంతో ఉపాధ్యాయులు ఆందోళనలో పడ్డారు. మైనార్టీ గురు కుల పాఠశాలలో అన్ని సబ్జెక్టులలో ఇదే పరిస్థితి నెలకొంది. సీనియార్టీ లిస్ట్ ప్రకారం ప్రమోషన్ కలిపించి, డిపార్ట్‌మెంట్ టెస్ట్ పాస్ కాకుంటే కొద్ది రోజులు సమయం ఇస్తే పాస్ అవ్వడానికి అవకాశం ఉందని, కానీ ఉపాధ్యాయుల సమస్యను పట్టించుకోకుండా తమ ఇష్టారాజ్యంగా ప్రధాన కార్యాలయం వ్యవరిస్తున్నారు. తమ గోడును చెపుకోవడానికి హెచ్ ఆఫీస్‌కి వెళితే దాదాపు 6 గంటలు నిలబెట్టారని ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం స్పందించి న్యాయం జరిగే విధంగా చూడాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

## నాటుసారా స్థావరాలపై దాడులు

### ముగ్గురిపై కేసు నమోదు

ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం : నాటు సారా తయారీ కేంద్రాలపై ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి బెల్లం పానకాని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం కొర్ర తండా, బోటిమీది తండా, కడప గండి తండాలలో ఎక్సైజ్, స్థానిక పోలీసులు సంయుక్తంగా నాటుసార తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడులలో ముగ్గురు వ్యక్తుల నుండి 10 కేజీల బెల్లం, 400 లీటర్ల బెల్లం పానకాన్ని స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా నాటు సారా తయారీకి ఉపయోగించే ప్లాస్టిక్ డ్రమ్ములు, పాత్రలను ధ్వంసం చేసి కొర్ర దశరథ, కరెంటోతూ జాను, వాంకుడోతూ శ్రీను అనే ముగ్గురు వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. అనంతరం తండాలలో నాటుసారా నిర్మూలన పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ దాడులలో రామన్నపేట ఎక్సైస్ సీఐ బాలాజీ నాయక్, ఎస్ఐ ఎన్.శంకర్, యాదాద్రి భువనగిరి జిల్లా టాస్క్ ఫోర్స్ సిఐ బి.రాధాకృష్ణ, నారాయణపురం ఎస్ఐ జే.జగన్, మోత్కూరు, భువనగిరి,ఆలేరు ఎక్సైజ్ బృందాలతో పాటు నియోజకవర్గ ఎన్ఫోర్స్మెంట్ బృందం తదితరులుపాల్గొన్నారు.

# రైతుల జీవితాలతో చెలగాటం

**పది లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకున్న మేడిగడ్డ**

**కాళేశ్వరంతోనే దేశానికి తెలంగాణ ధాన్య భాండాగారం**

**కెసిఆర్‌ను బద్నాం చేసే కుట్ర వట్టిదేనని తేలింది**

**ఎండిపోతున్న అన్ని రిజర్వాయర్లను నింపాలి**

**బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కెటిఆర్**



ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధి : రాజకీయ ప్రయోజనాల కోసమే కాంగ్రెస్‌లోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతుల జీవితాలతో చెలగాటమాడిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కెటిఆర్ దుయ్యబట్టారు. కరీంనగర్‌లోని ఎల్ఎండిని సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మేడిగడ్డలో జరిగిన చిన్న సంఘటనను భూతద్దంలో చూపి కాళేశ్వరంను విఫల ప్రాజెక్టు అని చూపే ప్రయత్నం చేశారన్నారు. ఎనిమిది నెలలుగా రేవంత్ ప్రభుత్వం లక్షలాది మంది రైతుల జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు.వందల టిఎంసిల నీళ్లను ఒడిసి పట్టేందుకే కెసిఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టార న్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద మల్టీ స్టేజ్ లిఫ్ట్‌ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరమని పేర్కొన్నారు. కాళేశ్వరం కారణంగానే దేశానికే తెలంగాణ ధాన్య భాండాగారంగా మారిందన్నారు. పంజాబ్, హర్యానాను తలదన్ని నీటి సమృద్ధిని సాధించడంలో వ్యవసాయ విస్తరణ జరిగిందన్నారు. సరిగ్గా గతేడాది ఇదే రోజు ఎల్ఎండిలో 12 టిఎంసీలకు పైగా నీళ్లు ఉండేవన్నారు. పంపింగ్ సరైన సమయంలో చేసి ఎల్ఎండి పూర్తి కెపాసిటీని నింపి రైతులకు భరోసా ఇచ్చామని గుర్తు చేశారు. మేడిగడ్డ వద్ద లక్షల క్యూసెక్కుల నీళ్లు కిందికి వృధా పోతుంటే ప్రభుత్వం పట్టించు కోవడం లేదన్నారు. అందుకే నీటి పంపింగ్‌పై ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకే కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు బయలుదేరామన్నారు. ఎండిపోతున్న ఎల్ఎండి, మిడ్‌మానేరు, ఎల్లంపల్లి , ఎస్సారెస్పీ సహా అన్ని రిజర్వాయర్లను నింపాలని కోరారు. ఎండుతున్న రిజర్వాయర్లు, మండుతున్న రైతుల గుండెల పరిస్థితిని ఈ శాసనసభ సమావేశాల్లోనే ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకే మా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చామని తెలిపారు. నీటి పంపింగ్ ఎందుకు చేయడం లేదంటూ రైతుల పక్షాన నిలదీస్తామన్నారు. పది లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకుని మేడిగడ్డ ఠీవిగా నిలబడిందన్నారు. ఆయన వెంట ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి, మల్లారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, తదితర బిఆర్ఎస్ నేతల బృందం పాల్గొన్నారు.

## నీట్ నుంచి వైదొలుగుతున్నట్లు ప్రభుత్వం తీర్మానించాలి

### సిఎంకు రేవంత్‌కు మాజీ ఎంపి వినోద్‌కుమార్ విజ్ఞప్తి



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : నీట్ పరీక్ష నుంచి వైదొలుగుతున్న తెలంగాణ ప్రభుత్వం శాసనసభలో తీర్మాణం చేయాలని మాజీ ఎంపి బోయినపల్లి వినోద్‌కుమార్ సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. వైద్య విద్య కోర్సులు చదువుకోవాలని ఆశపడే విద్యార్థులకు నీట్ పరీక్ష రాయాలనే నిబంధనను సుప్రీం కోర్టు 20 17లో ఆదేశాలు ఇచ్చిందని, నీట్ పరీక్ష ఒక ఎం ట్రెన్స్ మాత్రమేనని, ఇటీవల నీట్ పేపర్ లీకేజీతో ఒక అపనమ్మకం ఏర్పడిందనిపేర్కొన్నారు.పరీక్షతో లాభంకంటే ఎక్కువ నష్టం ఉందన్నారు. తెలంగాణలో మొత్తం 54 మెడికల్ కళాశాలలు ఉం డగా ఇందులో 27 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, 23 ప్రైవేట్ మెడికల్ కళాశాలలు, 4మైనార్టీ మెడికల్ కళాశలాలు ఉన్నాయన్నారు. దేశంలో 706 మాత్రమే మెడికల్‌కళాశాలలున్నాయని,దేశవ్యాప్తంగా లక్షఎంబిబిఎస్ సీట్లు ఉండగా ఇందులో దాదాపు 10 శాతం తెలంగాణలో 8265 మం ది విద్యార్థులు వైద్య విద్యను చదువుతున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష రాయడం ద్వారా నష్టం ఉందని, తెలంగాణలో పిజి సీట్ల సంఖ్య ఎక్కువ ఉందని, నీట్ నుంచి వైదొలిగితేనే విద్యార్థులకు న్యాయం జరుగుతుందన్నారు. నీట్ నుం చి వైదొలుగుతున్నట్లు మొన్న తమిళనాడు, నిన్న పశ్చిమబెంగాల్, కర్ణాటక రాష్ట్రాలు వారి శాసనసభల్లో ప్రభుత్వాలు తీర్మాణాలు చేయడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రం సైతం శాసనసభల్లో నీట్ నుంచి వైదొలుగుతున్నట్లు తీర్మాణం చేయాలని కోరారు. తెలంగాణ వైద్య విద్యార్థులకు నష్టం జరగకుండా ఉండాలంటే తెలంగాణ రాష్ట్రం వైదొలగాలని కోరారు.

## ప్రతి ఎకరాకు సాగునీరు

### మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి



ప్రజాపక్షం/సూర్యాపేటరూరల్: ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని రత్నాపురం ఎడమ కాల్వకు నకిరేకల్, మిర్యాలగూడెం శాసన సభ్యులు వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డిలతో కలిసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూసీ ఆయకట్టు రైతులకు ఇబ్బంది లేకుండా ఖరీఫ్ సీజన్ లో చివరి భూమి వరకు సాగు నీరు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ వానాకాలంలో ప్రాజెక్టు కింద 35 వేల ఎకరాల వరకు పంట భూములు సాగు అవుతాయన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిస్తే వచ్చే రబీకి కూడా పుష్కలంగా సాగుకు నీరు అందుతుందన్నారు. హైద్రాబాద్ లో కురిసిన వర్షాలతో మూసీ ప్రాజెక్టుకు 4 టీఎంసీల నీరు ప్రాజెక్టులో వచ్చే చేరుతుందన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కోట్ల రూపాయల నిధులతో మూసీ ఎడమ కాల్వ మరమ్మతు చేయించినట్లు గుర్తు చేశారు. క్రషర్ గేట్లను రిపేర్ చేసినట్లు చెప్పారు. మూసీ ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిద్దేందుకు కృషి చేస్తామన్నారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, రాష్ట్ర నాయకులు కొప్పుల వేణారెడ్డి, సూర్యాపేట మండల పార్టీ అధ్యక్షులు కోతి గోపాల్ రెడ్డి, సూర్యాపేట మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కెరేణి శ్రీనివాస్, మూసీ ప్రాజెక్టు అధికారులు పాల్గొన్నారు.

## కళ్ళకు గంతలు కట్టుకుని నిరసన



ప్రజాపక్షం/నల్లగొండటౌన్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో బిసిలకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ బిసిలకు జనాభా దామాషా ప్రకారం 40 వేల కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర బిసి యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ముందు కళ్ళకు నల్ల గంతలు కట్టుకుని నిరసన ప్రదర్శన వ్యక్తం చేశారు.అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు.సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోలు దీపెందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మొత్తం 2,91,159 లక్షల కోట్ల బడ్జెట్లో 65 శాతానికి పైగా ఉన్న బిసిలకు కేవలం 9,200 కోట్లు కేటాయించి బిసిలకు తీరని అన్యాయం చేశారన్నారు. ప్రభుత్వం మారితే బిసిల బ్రతుకులు మారుతాయని ఆశించినా ఫలితం శూన్యంగా మారిందన్నారు.ఈ కార్యక్రమంలో బిసి యువజన సంఘం జిల్లా కార్యదర్శి యలిజాల వెంకటేశ్వర్లు, బోళ్ల నాగరాజు, వనం వెంకటేశ్వర్లు, యలిజాల రమేష్, బట్టు శ్రీశైలం, రవీందర్, విజయ్, పాల్గొన్నారు.


## అక్రమ రవాణాలను అడ్డుకోవాలి

### జిల్లా ఎస్‌పి సన్‌ప్రీత్‌సింగ్



ప్రజాపక్షం/హుజూర్‌నగర్ : అక్రమ రవాణాలను అడ్డుకోవాలి జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సన్‌ప్రీత్‌సింగ్ మొదటి సారిగా నియోజకవర్గంలోని హుజూర్‌నగర్,మఠంపల్లి, గరిడేపల్లి,నేరేడుచర్ల పోలీస్‌స్టేషన్లను పరిశీలించి మట్టపల్లి బ్రిడ్జి ఉన్న అంతరాష్ట్ర చెక్‌పోస్టును సందర్శించి సరిహద్దు వెంట ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పోలీస్టేషన్ల నందు పరిసరాలను పరిశీలించి నేరప్రవృత్తిని తెలిపే మ్యాప్‌లు, భౌగిళిక స్థితిగతులు,సరిహద్దు పరిస్థితులు,నేర వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్టేషన్లలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, సిబ్బందిని సమర్థవంతంగా ఉపయోగించాలని కోరారు.డయల్ 100 ఫిర్యాదులపై వేగంగా స్పందించాలని ఆదేశించారు.హుజూర్‌నగర్ సర్కిల్‌కు ఆంధ్ర సరిహద్దు ప్రాంతం కృష్ణా పరివాహాక ప్రాంతం ఉన్నందున పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.చెక్‌పోస్టుల వద్ద వాహానాలనుక్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. అక్రమ రవాణాలను అడ్డుకోవాలని అధికారులు సమన్వయంతో పనిచేయాలని,నేరాల నివారణ,అసాంఘీ క కార్యక్రమాల నియంత్రణలో సమాచారం ఒకరికి ఒకరు సహకరించుకుని టీమ్ వర్క్ తో కేసులను పరిష్కరించాలన్నారు. డ్రంక్ డ్రైవ్ తనిఖీలు,కార్డన్‌సెర్చ్‌లునిర్వహించాలని,పోలీస్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదు దారులకు కనీస సౌకర్యాలు కల్పి ంచి వారితో మర్యాదగా ప్రవర్తించి సహాయ సహకారాలు అందించాలని సూచించారు.పాత నేరస్తులపై,గంజాయి సంబంధిత కేసుల్లో ఉన్న నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. గంజాయి మూలాలు లేకుండా నివారించడానికి కృషి చేయాలని కోరా రు. కార్యక్రమంలో కోదాడ డియస్పీ శ్రీధర్‌రెడ్డి, సిఐ చరమందరాజు, ఎస్ఐ ముత్తయ్య, ఆయా స్టే షన్‌ల ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యారంగం పట్ల కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు



ప్రజాపక్షం/భువనగిరి: విద్యారంగం పట్ల కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ తెలిపారు. గురువారం భువనగిరిలో ఎఐఎస్ఎఫ్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విభజన హామీచట్టం ప్రకారం తెలంగాణకి రావాల్సిన విద్యాసంస్థలను కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 7.3% ప్రవేశపె ట్టడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. కేంద్రమంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. బీజేపీ ప్రభుత్వం విద్య కాషాయీకరణ చేసే విధంగా కుట్ర చేస్తుందని చెప్పారు. నూతన జాతీయ విద్యావిధానం ద్వారా విద్య కార్పోరేటీకరణ, కాషాయీకరణ చేసే విధంగా అడుగులు వేయడం శోచనీయమన్నారు. విభజన హామీలో ఉన్న ట్రిపుల్ ఐటీ, జిల్లాకొక కేంద్రీయ విశ్వ విద్యాలయం, జిల్లాకొక నవోదయ పాఠశాల, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయకు ండా బడ్జెట్ పెట్టడం తెలంగాణ విద్యారంగంపై బీజేపీ ప్రభుత్వం తన కుట్రను వెల్లడించిందన్నారు. విద్యను పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నదని, దేశంలో ఉన్న యూనివర్సిటీలను అభివృద్ధి చేయకుండా దేశంలోకి విదేశీ యూని వర్సిటీలను ఆహ్వానిస్తూ ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేయడానికి కుట్రలు పన్ను తున్నారన్నారు. తక్షణమే కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగానికి అధిక నిధులు కేటాయిం చకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**ఖమ్మంఅర్బన్ :** విద్యా రంగం పట్ల కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విభజన హామీ చట్టం ప్రకారం తెలంగాణకు కేటాయించాల్సిన విద్యా సంస్థలను కేటాయించకుండా అలసత్వం ప్రదర్శిస్తుందని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మ ణ్ తెలిపారు. గురువారం ఎఐఎస్ఎఫ్ ఖమ్మంజిల్లా సమితి ఆధ్వర్యంలో బడ్జెట్ కేటాయింపులకు నిరసనగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎదురుగా బడ్జెట్ పత్రాలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మడుపల్లి లక్ష్మ ణ్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యా రంగానికి అధిక నిధులు కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. బిజెపి ప్రభుత్వం విద్య కాషాయికరణ చేసేవిధంగా కుట్ర చేస్తుందన్నారు. నూతన జాతీయ విద్యావిధానం ద్వారా విద్య కార్పొరేటీకరణ, కాషాయికరణ చేసేవిధంగా అడుగులు వేయడం శోచనీయమన్నారు. తెలంగాణ రాష్ట్ర విభజన హామీల్లో ఉన్న విద్యా సంస్థలను కేటాయించకుండా మోడీ ప్రభుత్వం తెలంగాణ పట్ల వివక్ష చూపిస్తుందన్నారు. బడ్జెట్‌లో యూనివర్సిటీల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించకపోవడం ఎంత వరకు సమాంజసమన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నాగులమీరా, సహాయ కార్యదర్శి శివానాయక్, నాయకులు ప్రతాప్, రోహిత్, రాకేష్ తదితరులు తదితరులు పాల్గొన్నారు.




## సాగర్ ఎడమ కాలువకు నీటి విడుదల నిలిపివేత

**శ్రీశైలం నుంచి ఇన్ ఫ్లో..క్రమంగా పెరుగుతున్న నీటిమట్టం**



ప్రజాపక్షం/నందికొండ : తాగునీటి అవసరాల నిమిత్తం నాగార్జునసాగర్ ప్రాజెక్టు అధికారులు ఈ నెల 19న నాగార్జునసాగర్ ఎడమ కాలువకు విడుదల చేసిన నీటిని గురువారం నిలిపివేశారు. గత శుక్రవారం నుండి గురువారం వరకు 2000 క్యూసెక్కు లనీటిని తాగునీటి అవసరాల నిమిత్తం1.5 టీఎంసిలను విడుదల చేయటం గమనార్హం. నాగార్జునసాగర్ ప్రాజెక్టు కు శ్రీశైలం నుంచి 6500 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వచ్చి చేరుతుండటంతో బుధవారం సాయంత్రానికి 503.50 అడుగులుగా ఉన్న నీటిమట్టం శుక్రవారం సాయంత్రానికి 504.10 అడుగులకు చేరుకుంది.

**✻ సాగర్ రిజర్వాయర్ సమాచారం...** నాగార్జునసాగర్ రిజర్వాయర్ పూర్తి స్థాయి గరిష్ట నీటిమట్టం 590 అడుగులు కాగా ఇది 312.50 టి ఎంసిలకు సమానం. ప్రస్తుత నీటిమట్టం 504.10అడుగులు ఉండగా ఇది 121.8709 టి.ఎం.సి ల కు సమానం. అయితే నాగార్జునసాగర్ కుడి కాలువ ద్వారా 5700క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో గా విడుదల అవుతుండగా, రిజర్వాయర్ కు 6500 క్యూసెక్కుల నీరు ఇన్ఫ్లోగా వచ్చి చేరుతుంది. అదేవిధంగా ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి ఎటువంటి విద్యుత్తు ఉత్పత్తి జరగడం లేదు.

## సాగునీటి ప్రాజెక్టు పూర్తి చేయాలి



ప్రజాపక్షం/(నల్లగొండ) నకిరేకల్ : నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేసే ఎస్ఎల్‌బిసి సొరంగ మార్గాన్ని పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడింగ్ శ్రవణ్ కుమార్ డిమాండ్ చేశారు. సిపిఐ కేతేపల్లి, నకిరేకల్ మండలాల కౌన్సిల్ సభ్యుల సమావేశం వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగింది./ఈ సమావేశానికి శ్రవణ్ కుమార్ హాజరై మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలు గడుస్తున్నా పాలకుల నిర్లక్ష్యం మూలంగా ఎస్ఎల్‌బిసి సోరం గం నేటి వరకుపూర్తి కాకపోవడం మూలంగా నకిరేకల్ ప్రాంతానికి సాగునీరు సౌకర్యం లేక భూములు బీడు భూములుగానే ఉండడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. మూసి ప్రాజెక్టు మరమ్మతులు చేసి మూసి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలని ఆయన కోరారు. ప్రభుత్వ విద్యారంగానికి వైద్య రంగానికి రెట్టింపు నిధులు చేపట్టి పేదలకు విద్య వైద్య సౌకర్యాలను మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు ఈ సమావేశంలో నకిరేకల్ మండల కార్యదర్శి గౌను లక్ష్మి నరసయ్య, కేతపల్లి మండల కన్వీనర్ జాడి రాజు, నాయకులు అనంతరెడ్డి, సిరిపెంగి మల్లయ్య. మెరుగు రమేష్, జల్ల దశరథ పాల్గొన్నారు.

## గ్రామ సంఘ సహాయకుల సమస్యలు పరిష్కరించాలి

### కనీస వేతన చట్టం అమలు చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

### ఎఐటియుసి డిమాండ్



ప్రజాపక్షం/దేవరకొండ: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లో ఎన్నో ఏళ్ల నుండి పని చేస్తున్నటువంటి వీవోఏల పరిస్థితి అగమ్య గోచరంగా ఉందని, ప్రభుత్వాలు మారినా గ్రామ సంఘ సహాయకుల బతుకులు మారడం లేదన్నారు. గురువారం దేవరకొండలో ఎఐటియుసిలో చేరిన గ్రామ సంఘ నాయకులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్య క్ష, ప్రధాన కార్యదర్శి నూనె రామస్వామి, పల్లా దేవేందర్‌రెడ్డిలు పాల్గొని మాట్లాడుతూ గ్రామస్థాయిలో మహిళలతో సంఘాలను ఏర్పాటు చేసి వారితో సమావేశాలు ఏర్పాటు చేసి పొదుపు సం ఘాల ఏర్పాటుకు పాటు పడి మహిళలను ఆర్థికం గా బలోపేతం చేయుటలో క్రియాశీల పాత్ర పోషిస్తున్నటువంటి వివోఏల బ్రతుకులు ఆర్థికంగా దిగజారిపోయాయని, వారు చేస్తున్న పనికి వారికి వచ్చే జీతానికి పొంతన లేకుండా పోయిందన్నారు. గ్రా మాల్లో వివోఏలదే కీలక పాత్ర ఉంటుందని అదనంగా ఆన్‌లైన్ పనులు కూడా అప్పుడెప్పుడం జరుగుతుందని, ఆన్‌లైన్ పనులు ప్రభు త్వం చేపించుకుంటుందని కానీ వారికి ఎటువంటి ఫోన్లు, రీచార్జ్‌లుగాని, టిఏ, డిఏలు ఇచ్చిన దాఖలాలు లేవన్నా రు. వారి సొంత డబ్బులతో రిచార్జ్‌లు చేయించుకొని ఆన్‌లైన్ పనులు చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. గ్రామస్థాయిలో కష్టపడి పనిచేస్తున్న వారికి తక్కువ జీతాలతో కుటుంబాలు భారంగా మారిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లు సమాన పనికి సమాన వేతనం అనే చట్టాన్ని రూపొందించారు. కానీ ఈ చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తుంగలో తొక్కే ప్రయత్నం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఉద్యమాలు చేసి హక్కులను కాపాడుకుంటామని అ న్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు, కోశాధికారివెంకట్‌రాములు, నగేష్, బద్రు, కృష్ణమ్మ, మల్లీశ్వరీ, వెంకటేష్, శంకర్, వెంక టేష్, దశరథ, వెంకటయ్య, లక్ష్మ ణ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల నూతన కమిటిని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కలగోని నగేష్, ఉపాధ్యక్షులుగా బద్రు, జంగమ్మ, ప్రధాన కార్యదర్శిగా కృష్ణమ్మ, సహాయ కార్యదర్శిగా దశరథ, మల్లేశ్వరి, వెంకటయ్య, కోశాధికారిగా చెన్నయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## ఇందిరమ్మ రాజ్యంలోనే భరోసా



**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్రంలోని రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దేశానికేఆదర్శమనిఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. తెలంగాణ అసెంబ్లీలో గురువారం రైతులకు అండగా నిలబడే బడ్జెట్ ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి రాష్ట్ర రైతాంగం, రైతుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రాఘవరెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ.72వేల659కోట్లు కేటాయించినందుకు ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. గతంలో పదేళ్ల ప్రభుత్వం నడిపిన కేసీఆర్ ధరణి వంటి వాటితో రైతాంగం హక్కులను కాలరాసిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వంది అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ అధికారంలో ఉన్న సమయంలో లక్ష రుణమాఫీ చెప్పి మాటలకే పరిమితమైనా కేసీఆర్, కేటీఆర్ సన్నాయి నొక్కులు నొక్కడం వారికే చెల్లిందన్నారు. ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం అంటే ఇందిరమ్మ రాజ్యంలోనే రైతుకు భరోసా అని మరోసారి నిరూపితమైందన్నారు. ఇప్పటికే రూ.లక్ష లోపు రుణాలను మాఫీ చేసిన విషయం కనుల ముందు ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంకు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రివర్గంకు తెలంగాణ ప్రజలు, రైతాంగం ఆశీర్వదించాలన్నారు.

## ఎఐటియుసిలో చేరికలు



**ప్రజాపక్షం / కొండాపూర్ :** సంగారెడ్డి జిల్లా ఎంఎల్‌హెచ్‌పి కార్యవర్గం ఎన్నిక గురువారం నాడు జరిగింది. గురువారం సంగారెడ్డి ఎంఎల్‌హెచ్‌పిలు ఏఐటియుసీలో చేరి నూతన కమిటీని ఎన్నుకున్నారు. నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్ పిలకు నెలకు రూ. 41 వేల జీతాన్ని ప్రభుత్వం చెల్లించాలని ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు నీరుడు సాయిలు అన్నారు.

## పెండింగ్ దరఖాస్తులపై ఆరా



**ప్రజాపక్షం/టేక్మాల్:** మండల కేంద్రమైనలోని ప్రభుత్వ కార్యాలయాలను గురువారం మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆకస్మిక తనిఖీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్ లో ఉన్న ధరణి, కళ్యాణ లక్ష్మి, మీ సేవకు సంబంధించిన పెండింగ్ అప్లికేషన్లను సమీక్షించి వాటి స్థితిగతులను తెలుసుకున్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రజా పాలన కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం మీ సేవ కేంద్రాలను తనకి చేసిన ఆయన నిర్వాహకులను తగు సూచనలనిచ్చారు ప్రస్తుతం కురుస్తున్న వర్షాల పట్ల, సీజనల్ వ్యాధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండి ముందస్తు జాగ్రత్త చర్యలను చేపట్టాలనిసూచించారు. మెదక్ జిల్లా ఈడిఎం సందీప్, డిఎం శశికాంత్, తహసీల్దార్ కృష్ణ ఎంపీడీవో రియాజుద్దీన్ డిప్యూటీ తహసీల్దార్ కిషోర్ ఉన్నారు.

## నూతన తహసీల్దార్‌గా నాగేశ్వరచారి

**ప్రజాపక్షం/తరిగొప్పుల:** నూతన తహసీల్దార్‌గా నాగేశ్వరాచారి గురువారం నాడు బాధ్యతలను స్వీకరించారు. ఆయన భువనగిరి కలెక్టరేట్‌లో సూపరిండెంట్‌గా పనిచేసి బదిలీపై మండలానికి రావడం జరిగింది. ఈ సందర్భంగా తహశిల్దార్ నాగేశ్వరాచారి మాట్లాడుతూ ప్రజలు సమస్యలు ఏమైనా ఉంటే నేరుగా కలిసి పరిష్కరించుకోవాల్సిందిగా తెలిపారు. నూతన తహశిల్దార్‌కు రెవెన్యూ సిబ్బంది, తదితరులు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

## భూ సమస్యలు పరిష్కరిస్తా

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** మండల తహసీల్దార్‌గా బాశెట్టి హరిప్రసాద్ గురువారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా నల్గొండ జిల్లా నుండి జఫర్‌గడ్‌కు బదిలీ అయిన ఆంజనేయులు బదిలీపై నల్గొండ జిల్లాకు వెళ్లడంతో డిప్యూటీ తహశిల్దార్‌గా పనిచేస్తున్న హరిప్రసాద్‌ను తహశిల్దార్‌గా నియమించడంతో వారు పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు తహశిల్దార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తహశిల్దార్ మాట్లాడుతూ భూ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తెలిపారు.

## ట్రాక్టర్ కింద పడి యువ రైతు మృతి

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** పొలం దున్నుతున్న క్రమంలో ప్రమాద వశాత్తు ట్రాక్టర్ కేజీవీల్ క్రింద జారీ పడిపోయిన సంఘటనలో ఓ యువ రైతు మృతి చెందిన సంఘటన సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం లింగారెడ్డిపల్లి గ్రామంలో గురువారం జరిగింది. ఈ సంఘటనకు సంబందించి గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కొమురవెల్లి సత్యం(32) అనే యువ రైతు తన ట్రాక్టర్‌తో బురద పొలం దున్నుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఒడ్డు పక్కనే ఉన్న నీటి పైపును సరిచేసేందుకు అక్కడనే ట్రాక్టర్ నిలిపి క్రిందికి దిగి పైపును సరి చేసిన అనంతరం ట్రాక్టర్ పైకి ఎక్కుతున్న సమయంలో కాలు జారి ట్రాక్టర్ టైర్ కిందపడిపోయాడు. ట్రాక్టర్ ముందుకు కదలడంతో రైతు సత్యం పై నుండి టైర్ వెళ్లడంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. రైతులు ట్రాక్టర్ కేజీవీల్ కింద ఇరుకున్న రైతును 108లో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య లావణ్యతో పాటు ఓ కుమారుడు, కుమార్తే ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ చంద్ర మోహన్ కేసునమోదు చేసుకోని శవ పంచనామా నిర్వహించారు.

## ప్రేమికుడి మృతితో ప్రియురాలు ఆత్మహత్య

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** ప్రేమికుని మృతిని తట్టుకో లేక ఓ అవివాహిత ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జగదేవ్‌పూర్ మండల పరిధిలోని లింగారెడ్డిపల్లిలో గురువారం జరిగింది. పోలీసులు వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చిక్కుడు జ్యోతి(22) హైదరాబాద్‌లో ప్రయివేటు ఉద్యోగం చేస్తుంది. తొలి ఏకాదశి పండుగకు స్వ గ్రామమైన లింగారెడ్డిపల్లికి వచ్చి వారం రోజులుగా గ్రామంలోనే ఉంటుంది. కాగా అదే గ్రామానికి చెందిన కొమురెల్లి సత్యంతో గత కొంతకాలంగా ప్రేమలో పడింది. తనను ప్రేమించిన వ్యక్తి గురువారం ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందగా అతని మృతిని తట్టుకోలేక ఇంట్లోఇనుప రాడుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్టు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.

## రుణమాఫీపై ఫిర్యాదులు స్వీకరణ

**ప్రజాపక్షం/వెంకటాపూర్:**రుణమాఫీపై సందేహాలుంటే రైతు వేదికలో ఏఈఓలకు ఫిర్యాదు చేయాలని ఏడిఏ శ్రీపాల్ అన్నారు. గురువారం ఏవో కళ్యాణితో కలిసి ఆయన మాట్లాడారు.మండల వ్యాప్తంగా 2001 మంది రైతులకు లక్షలోపు తొలి విడత రుణమాఫీ జరిగిందని, మాఫీపై సందేహాలుంటే పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డులతో సంప్రదించాలన్నారు.

# 200రోజులు ఉపాధి కల్పించండి

తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. బాలమల్లేష్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రతి కార్మికుడికి ఏడాదిలో 200రోజులు పని దినాలు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.బాలమల్లేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఎం.వెంకటేష్ అధ్యక్షతన వికారాబాద్ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం, అఖిలభారత యువజన సమాఖ్య జనరల్ బాడీ సమావేశం పరిగిలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన బాలమల్లేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ కూలీలకు పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతుంటే కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నిర్వీర్యంచేసేందుకు కుట్రలు చేస్తోందని, దీనిని వ్యవసాయ కార్మిక సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని పేర్కొన్నారు. అదిలాబాద్ లాంటి జిల్లా మొదలుకొని అనేక జిల్లాలలో పని ప్రదేశాలలో ఫోటోలు తీసి రెండుసార్లు అప్లోడ్ చేయడంలాంటి నిబంధనలు తీసుకువచ్చి వ్యవసాయ కూలీలు పనిచేస్తున్నప్పుడు వారికి సక్రమంగా సమయానికి వేతనాలు చెల్లించకపోవడం వల్ల వారికి అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తక్షణమే పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఆయనడిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు తెల్ల రేషన్ కార్డు ఇవ్వాలని, ఉండడానికి పేదలకు ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్, ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీమన్, పరిగి డివిజన్ కార్యదర్శి పేరు పీర్ మహ్మద్, మండల కార్యదర్శి వెంకటేష్, చీమల బిచ్చన్న, రామచంద్రయ్య, జంగయ్య, చంద్రయ్య, యాదయ్య, రాములు, అబ్దుల్లా, రవి నాయక్, నర్సింలు, సురేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేటలో బిఆర్ఎస్‌కు షాక్

కాంగ్రెస్‌లో చేరిన మరో ఇద్దరు కౌన్సిలర్లు



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** బిఆర్ఎస్ పార్టీ పురిటిగడ్డ సిద్దిపేటలో బిఆర్ఎస్ పార్టీకి షాక్ తగిలింది. సిద్దిపేట మున్సిపల్ పరిధిలో 43 వార్డులుండగా బిఆర్ఎస్ పార్టీ 36 స్థానాలు విజయం సాధించగా, బిజెపి నుండి ఒకరు, ఎంఐఎం నుండి ఒకరు, విజయం సాధించగా, ఐదు స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. కాంగ్రెస్ పార్టీ ఒక్క స్థానంలో విజయం సాధించలేదు. మున్సిపల్ చైర్మన్‌గా కడవేర్గు మంజుల రాజనర్సు ఎన్నికైనారు. గత కొంత కాలంగా మున్సిపల్ చైర్మన్ భర్త, మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు వ్యవహార శైలితో కౌన్సిలర్లు విబేదిస్తూ వస్తున్నారు. ఇటీవల చైర్మన్ భర్త వ్యవహారశైలి నచ్చక కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ముగ్గురు కౌన్సిలర్లు సాకి భాగ్యలక్ష్మి ఆనంద్, శ్రీదేవిబుచ్చిరెడ్డి, రియాజ్‌లు కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా గురవారం మాజీ ఎంఎల్‌ఏ మైనంపల్లి హన్మంత్‌రావు నివాసంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సారెడ్డి సమక్షంలో ఇద్దరు కౌన్సిలర్లు ఆలకుంట కవిత, పూర్ణిమ ఎల్లంలు కాంగ్రెస్‌లో పార్టీలో చేరారు. విలాగైన మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం ప్రవేశపెట్టి నెగ్గి మున్సిపల్ పీఠంలో కాంగ్రెస్ జెండా ఎగిరేయడమే లక్ష్యమని కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లు చెపుతున్నారు. మరికొంత మంది కౌన్సిలర్లు సైతం కాంగ్రెస్ వైపు చూస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పూజల హరికృష్ణ, చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, ముత్యాల బుచ్చిరెడ్డి, రియాజ్, సాకి ఆనంద్, ఆలకుంట మహేందర్, అత్తుఇమామ్ పాల్గొన్నారు.

# కార్మికుల హక్కులు హరించారు



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** గత బిఆర్ఎస్ ప్రభు త్వం అన్ని రంగాల్లో కార్మికులను ఇబ్బందులు పెట్టిందని ఎఐటియుసిజిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.అజయ్ సారధిరెడ్డి, రేషపల్లి నవీన్ అన్నారు. నాడు కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వాలు కార్మిక చట్టాలను కాలరాస్తూ కార్మికుల హక్కులను హరించిందన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయుసి అనుబంధం) కార్మిక సంఘాల సం యుక్త సమావేశం భవన నిర్మాణకార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శంకర్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా ఏఐటీయుసి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.అజయ్ సారధి రెడ్డి, రేషపల్లి నవీన్ మాట్లాడారు. సాధారణంగా మరణిస్తే 5 లక్షలు, పనిచేస్తూ మరణిస్తే 10 లక్షల వరకు ప్రభుత్వాలు పెంచాలని, ప్రసూతి, సాధారణ ప్రమాదాలకు 50 వేల డబ్బులు పెంచాలని రేపు చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఇందిరా పార్కు దగ్గర జరుగుతున్న భారీ బహిరంగ సభలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వేలాది మంది హైదరాబాద్‌కు తరలి వెళ్లి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.కొత్తగా వచ్చిన రేవంత్ రెడ్డి సర్కార్ కార్మికులకు అన్ని విధాలుగా ఆదుకొని హెల్త్ కార్డులు మంజూరు చేసి ప్రమాద భీమా పెంచేందుకు కృషి చేయాలన్నారు. జానీ, కూరాకుల పాల్, పాష, బోడ రవి, గుళగట్టు శ్రీనివాస్, బొమ్మెర సురేష్, రాములు, బొమ్మెర మధు, కనకరాజు, చారి, పెరుగు కుమార్, వెలుగు శ్రావణ్, మేక వీరన్న, ఆబోతు అశోక్, జలగం ప్రవీణ్ పాల్గొన్నారు.

# రైతు రుణాలు రెన్యువల్ చేయాలి

జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధిః** రుణాలు మాఫీ పొందిన రైతులకు వెంటనే రుణాలు రెన్యువల్ చేయాలని కలెక్టర్ వల్లూరి క్రాంతి కోరారు. లీడ్ బ్యాంక్ మేనేజర్, వివిధ బ్యాంకుల కంట్రోలింగ్ ఆఫీసర్స్‌తో కలెక్టర్ వల్లూరి క్రాంతి గురువారం పంట ఋణాల మాఫీ 2024 ఫేస్ 1 అమలు తీరుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎపిజివిబి, ఎస్‌బిఐ, కెనరాబ్యాంక్ లలో అత్యధికంగా రైతులు పంట ఋణాలు మాఫీ పొంది ఉన్నారని వీరికి వెంటనే ఋణాలు రిన్యువల్ చేయాలని కలెక్టర్ సూచించారు. రైతులకు వ్యవసాయ అవసరాల నిమిత్తం పంట ఋణ మాఫీ డబ్బులు వాడుకునే విధంగా వెంటనే చెల్లించాలని సూచించారు. పంట ఋణ మాఫీ డబ్బులు బ్యాంకులలో అధికారులు ఇతర లోన్‌ల క్రింద జమ చేసుకోకుండా పంట ఋణాలు సకాలంలో చెల్లించి రైతులకు ఉపయోగ పడేలా చూడాలని కోరినారు. పంట ఋణాలు రిన్యువల్స్ 23 రోజులలో పూర్తి చేయాలని తెలియజేశారు. రైతులను బ్యాంకుల చుట్టూ తిప్పుకోకుండా వారికి వెంటనే ఋణమాఫీ జరిగిన విషయాన్ని తెలియజేస్తూ తిరిగి పంట ఋణాలను రిన్యువల్ చేసి వారికి వ్యవసాయ ఖర్చుల నిమిత్తము డబ్బులు అందేలా చూడాలని ఇందులో ఏలాంటి జాప్యం జరగడానికి వీలు లేదని తెలిపారు. ఇందులో జిల్లా వ్యవసాయ అధికారి తదితరులు పాల్గొన్నారు.

# తరగతి గదుల్లోనే విద్యార్థుల భవితవ్యం

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** తరగతి గదుల్లో విద్యార్థుల భవితవ్యం రూపుదిద్దుకుంటుందని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన జరగాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మండలంలో పర్యటించిన కలెక్టర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 11 లక్షల రూపాయల నిధులతో చేపట్టిన కిచెన్ షెడ్ నిర్మాణం, బాలికల మరుగుదొడ్ల నిర్మాణ పనులను పరిశీలించి త్వరిత గతిన పూర్తిచేయాలని ఆదేశించారు. 6వ తరగతి విద్యార్థులతో మాట్లాడి పలు ప్రశ్నలు వేసి సమాదానాలు రాబట్టారు. వంట గదిని పరిశీలించి వెళ్లి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మరమ్మతుల పనులను వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అకస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న జూనియర్ కళాశాల భవన నిర్మాణం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వంట గదిని పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తెలిపారు. పదవ తరగతి గదిని పరిశీలించి విద్యార్థినులతో ఇంగ్లీష్ పాఠాలు చదివించారు.

**అప్రమత్తంగా ఉండాలి**

సీజనల్ వ్యాధులు ప్రబలితే తక్షణమే వైద్యాధికారుల దృష్టికి తేవాలని, విద్యార్థులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఫార్మసి, ల్యాబ్, లేబర్ రూమ్, క్యాజువలిటిని పరిశీలించి ఆసుపత్రి లో అందిస్తున్న వైద్య సేవల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మందులుఅందుబాటులోఉంచాలని సూచించారు.

## అంగన్వాడీలను ఆధునీకరించాలి



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** అంగన్వాడి కేంద్రాలను పూర్వ ప్రాథమిక విద్యానిలయాలుగా ఆధునీకరించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్‌తో కలిసి అంగన్వాడి కేంద్రాలలో పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకుగాను వసతుల కల్పనపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 695 అంగన్వాడి కేంద్రాలలో మౌళిక సదుపాయాలు కల్పించాలన్నారు. విద్యుత్ సరఫరా, లైట్‌లు, ఫ్యాన్లు, ప్రహారీగోడ, తాగునీరు, పంపులు, ట్యాంక్‌లు, మరుగుదొడ్లు పనులన్నీ నాణ్యతతో చేపట్టాలని ఆదేశించారు. పిల్లలకు నాణ్యమైన ప్రీ ప్రైమరీ విద్యను అందించాలని సూచించారు.

# శాంతిభద్రతల పరిరక్షణలో అలసత్వం తగదు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** శాంతి భద్రతల పరిక్షణలో అలసత్వానికి అవకాశం ఇవ్వకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్సై లతో ఎస్పి నేర సమీక్షా సమావేశం నిర్వహించి, వివిధ పోలిసు స్టేషన్ లో ఉన్న పెండింగ్ కేసుల పురోగతిని అడిగి తెలుసుకుని, సత్వర కేసుల చేధనకు మార్గనిర్దేశం చేశారు. అనంతరం ఎస్పి మాట్లాడుతూ, అండర్ ఇన్వెస్టిగేషన్లో ఉన్న కేసులను త్వరగా డిస్పోజల్ చేయాలన్నారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేయాలన్నారు. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండడంతో పాటు పూర్తి కేసును పారదర్శకంగా ఇన్వెస్టిగేషన్ చేయాలన్నారు. నేర చేధన కంటే, నేర నివారణ చాలా ముఖ్యమని ఎస్పి తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో అలసత్వానికి తావివ్వొద్దని, పోలీస్ స్టేషన్ లలో బాధితులు ఇచ్చే ఫిర్యాదుల ఆధారంగా ఎంక్వైరీ చేసి చట్ట పరిధిలో వెంటనే కేసులు నమోదు చేసి వేగంగా సమస్య పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రతి నేరస్థునికి శిక్ష పడేలా కేసులను పక్కా ఆధారాలతో నమోదు చేయాలని సూచించారు. ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో ముఖ్యమైన ప్రాంతాల్లో ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాల విక్రయాలతో పాటు రవాణా, అమ్మకాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎస్పి కిరణ్ ఖరే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు సంపత్ రావు, రామ్మోహన్ రెడ్డి, నారాయణ నాయక్, సుభాష్ బాబు, జిల్లా పరిధి లోని సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# త్వరలో డబుల్‌బెడ్‌రూమ్ కాలనీలో సిసి రోడ్డు




మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్


**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** త్వరలోనే మెదక్ పట్టణంలోని పిల్లికొట్టాల్ డబుల్ బెడ్రూం కాలనీయందు సిసి రోడ్డు నిర్మాణం చేపడ్తానని మెదక్ నియోజక వర్గ ఎమ్మెల్యే డా॥ మైనంపల్లి రోహిత్ అన్నారు. గురువారం ఆటోమెటిక్ క్లోరినేషన్ ఆన్ లైన్ మానటరింగ్, మున్సిపల్ సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన సురక్షితమైన త్రాగునీటి కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబుల్ బెడ్ రూం నందు త్వరలోనే సిసి రోడ్డు నిర్మాణ పనులు చేపడ్తామని ఆయన హామినిచ్చారు. డబుల్ బెడ్ రూం లలో నివసించే వారిసమస్యలను త్వరలోనే తీర్చుతానని అన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందిస్తున్న అకామ్ సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ చైర్మెన్ తొడుపునూరి చంద్రపాల్, కౌన్సిలర్లు ఆవారి శేఖర్, దాయర లింగం, లక్ష్మినారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు మధుసూదన్ రావు, బొజ్జ పవన్, ఉప్పల రాజేష్, జీవన్ రావ్, రాగి అశోక్, మందుగుల గంగాధర్, దుర్గాప్రసాద్, పరుశురాం, బాని, సంతోష్, గోదల సాయి, నరేష్, సమీ, ఎస్.డి. క్రిష్ణ, లక్ష్మణ్, నాగరాజు, అమీర్,మన్నె సుదర్శన్, పోచేందర్, సంగమేశ్వర్, అశోక్, ఆన్ మోల్ సంస్థ ప్రతినిధులతో పాటు మున్సిపల్ కమీషనర్ జానకి రాంసాగర్ ఉన్నారు.

# రక్షణ కోసం తెలంగాణవైపు చూపు

**ప్రజాపక్షం/ఖమ్మం:** దండకారుణ్యంలో మావోయిస్టులు మునుపెన్నడు లేని రీతిలో అత్యంత గడ్డు పరిస్థితి ఎదుర్కొంటున్నారు. బిజెపిప్రభుత్వంమావోయిస్టు ఏరివేత లక్ష్యంగా సాగిస్తున్న పలు ఆపరేషన్లు ప్రభుత్వ పరంగా సత్ఫలితాలను ఇస్తున్నాయి. ముఖ్యంగాదండకారుణ్యంలోఅడుగడుగునా పోలీస్ క్యాంపులుఏర్పాటు చేయడం, నిరంతర కూంబింగ్‌తో దళాల కదలికలను పసిగట్టి హతమార్చడం చేస్తున్నారు. మూడు నెలల కాలంలో 200మందికిపైగామావోయిస్టులులొంగిపోగా సుమారు 100మంది ఎన్‌కౌంటర్లలో మరణించారన్న సమాచారం ఉంది.దండకారుణ్యంలో ప్రస్తుతం దళాల సంచారానికి, కార్యక్రమాల నిర్వహణకు అవకాశం లేకుండాపోతుంది. రక్షణ కోసం గోదావరి ఇవతలి వైపున తెలంగాణలోని కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లో రక్షణ పొందెందుకు మావోయిస్టులు ప్రయత్నిస్తున్నారు. కొన్ని మావోయిస్టు యాక్షన్ టీములు పైన పేర్కొన్న జిల్లాలోకి ప్రవేశించి రక్షణతో పాటు ఉద్యమాన్నిమళ్లీ నిర్మించేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారని,భద్రు, లచ్చన్న దళ నేతలుగా ఉన్న కొన్ని యాక్షన్ టీములు గడిచిన రెండు నెలలుగా ప్రయత్నిస్తున్నాయని తెలంగాణ పోలీసులకు సైతం సమాచారం ఉంది. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్రల నుంచి వలస వచ్చి అటవీ ప్రాంతాలలో జీవిస్తున్న వలస గుత్తికోయలపైమావోయిస్టు సాయుధ దళాలు ఆధార పడుతున్నాయి. ఎన్‌కౌంటర్ల ద్వారా వరుస ప్రాణనష్టాలకు గురవుతున్న మావోయిస్టులకు భద్రాచలం డివిజన్ కంటే ఇల్లందు, పాల్వంచ, మణుగూరు సబ్ డివిజన్ల అటవీ ప్రాంతాన్ని సురక్షిత ప్రాంతంగా మావోయిస్టులు ఎన్నుకున్నారు. గతంలో ఈ ప్రాంతం మావోయిస్టులకు దన్నుగా నిలిచింది. అప్పటి పీపుల్స్‌వార్ దళాలతో పాటు ప్రజా పంథా, జనశక్తి తదితర పార్టీలకు చెందిన సాయుధ దళాలకుఈ ప్రాంతం అడ్డాగా ఉండేది. ప్రభుత్వ చర్యలతో ఈ ప్రాంతంలో ప్రస్తుతం సాయు ధ దళాల సంచారం లేదు. న్యూడెమోక్రసీలో చీలికలు రావడం సాయుధ దళాల నిర్మాణం లేకపోవడం అనేక మంది దళ నేతలు లొంగిపోవడం లింగన్న లాంటి కొందరు ఎన్‌కౌంటర్‌లో మరణించడం తో సాయుధ దళాల సంచారం పూర్తిగా లేకుండా పోయింది. రెం డేళ్ల క్రితం మణుగూరు అటవీ ప్రాంతంలో మావోయిస్టు దళాల సంచారం పోలీసుల ఎన్‌కౌంటర్‌తో మావోయిస్టుల జాడ బహిర్గతమైంది. గురువారం నాటి ఘటనతో మావోయిస్టులు తెలంగాణ ప్రాంతంలోని అటవీ ప్రాంతంలోకి చొచ్చుకు వస్తున్నారన్న విషయాన్ని నిర్ధారించింది. కొత్తగూడెం ఎస్‌పి రోహిత్ రాజ్ తెలిపిన వివరాల ప్రకారం... 15 మంది నిషేధిత మావోయిస్టు సాయుధులు ఆయుధాలతో అక్రమంగా దామరతోగు, గుండాల, కరకగూడెం, తాడ్వాయి అటవీ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలు చేపడుతున్నారన్నారు. పలువురిని బెదిరించి చందాలు వసూలు చేస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు కూంబింగ్ జరుపుతుండగా 10 గంటల ప్రాంతంలో పోలీసు బలగాలపై మావోయిస్టులు దాడులు జరిపారని పోలీసులు జరిపిన ఎదురు కాల్పుల్లో యూనిఫాం ధరించిన యువకుడు మరణించినట్లు రోహిత్ రాజ్ ధృవీకరించాడు. ఎదురు కాల్పులు జరిగిన ఘటనలో ఎస్ఎల్ఆర్, 303 ఆయుధాలు, మందుగుండు సామాగ్రి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇదిలా ఉండగా తప్పించుకున్న సాయుధుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్‌పి తెలిపారు.

## 28న "నేను నా జీవన ప్రస్థానం" గ్రంథావిష్కరణ

ఆవిష్కరించనున్న మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** ప్రతీ వ్యక్తి తన జీవితంలో ఎన్నో ఒడిదొడుకలను ఎదుర్కొని జీవనం సాగిస్తుంటారు. అనుభవం పండిన వారి జీవితం భావితరాలకు మార్గదర్శకం అవుతుంది. అలాంటి వారి చరిత్ర సామాజిక చరిత్రగా చూడవచ్చు. డాక్టర్ కె. వెంకటి పశు సంవర్ధక శాఖలో సహాయ సంచాలకుడిగా పనిచేసి విశాంత జీవితం గడుపుతున్నారు. అతి పేదరికం నుంచి స్వశక్తితో కష్టపడి ఎందరినో మెప్పించి జీవితంలో పైకి వచ్చారు. విద్యార్థి నాయకుడు, చదువరి, ఉత్తమ ప్రభుత్వ అధికారిగా ప్రభుత్వం నుంచి, ప్రజల నుంచి ప్రశంసలు అందుకున్నారు. అనంతర కాలంలో సామాజిక సేవలు చేశారు. మలి దశ తెలంగాణ ఉద్యమం పోరాటంలో కీలకంగా ఆయన పాల్గొన్నారు. గతంలోనే బీఎస్పీ తరుపున రాజకీయ ప్రవేశం చేసి తన సత్తా చాటుకున్నాడు. సామాజికంగా వక్తగా, నటుడిగా, ఉద్యోగ సంఘం నాయకుడిగా, క్రీడాకారుడిగా, సామాజిక సేవా దురంధుడిగా పేరొందారు. రచయితగా ఇప్పటికే ఏడు గ్రంథాలను రాశారు. అలాగే అభ్యుదయ రచయితల సంఘంలో శాశ్వత సభ్యత్వం పొందారు. ఈనెల 28న డాక్టర్ వెంకటి తన అపారమైన అనుభవాన్ని రంగరించి రాసిన నేను నా జీవన ప్రస్థానం గ్రంథాన్ని హన్మకొండలో ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగణ మీడియా అకాడమీ అధ్యక్షులు కే. శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానుండగా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య, అరసం అధ్యక్ష,కార్యదర్శులు నిధి, పల్లేరు వీరస్వామి తదితరులు హాజరుకానున్నారు.

## విద్య, వైద్యం, వ్యవసాయ రంగానికి కొత్త బడ్జెట్ కేటాయిస్తే బాగుండేది



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ మంచి బడ్జెట్ అని విద్య, వైద్యం, వ్యవసాయ రంగానికి కుటీర, చిన్న పరిశ్రమలకు ఇంకా కొంత బడ్జెట్ కేటాయిస్తే బాగుండేదని జిల్లా సీపీఐ కార్యదర్శి పి.సుధాకర్ తెలిపారు. గురువారం తెలంగాణ అసెంబ్లీలో ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్యపై ప్రభుత్వ ఆస్పత్రులలో సౌకర్యాలు మెరుగుపర్చేందుకు వ్యవసాయ రంగంలో పనిముట్లపై సబ్సిడీలు, రాష్ట్రంలో ఆర్థిక అభివృద్ధి మరింత ముందుకు పోయేందుకు కుటీర, చిన్న పరిశ్రమలకు నిధులు కేటాయించి ఉంటే బాగుండేని తెలిపారు.

## కేంద్రం వంచించినా రాష్ట్రం కరుణించింది



ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధిః కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరుగగా రాష్ట్ర బడ్జెట్ వల్ల ఈ ప్రాంత ప్రజలకు న్యాయం చేకూరిందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌పై ఆయన వ్యాఖ్యానిస్తూ కేంద్ర బడ్జెట్ నిరాశపరచగా రాష్ట్ర బడ్జెట్ సంతోషం కలిగించిందన్నారు. అన్ని వర్గాల ప్రజలను సంతృప్తి కలిగించేలా ఉందని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయం, విద్య, మహిళా, మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేయడం రేవంత్‌రెడ్డి సర్కారు చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఈ బడ్జెట్ పేద ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా ఉందని ఆయన కొనియాడారు. హార్టికల్చర్ కోసం ఈ బడ్జెట్‌లో రూ.737 కోట్లు కేటాయింపు, నకిలీ విత్తనాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవడమే కాకుండా నాణ్యమైన విత్తనాలు అందించేందుకు అవసరమైన చర్యలకు పూనుకోవడం ద్వారా ప్రభుత్వం రైతులకు మేలు చేకూర్చనున్నదని పేర్కొన్నారు. గూడు లేని నిరుపేదలకు సొంతింటి కల సాకారం చేసేలా ఈ బడ్జెట్ రూపకల్పన చేశారని, 2024 2025 ఆర్థిక సంవత్సరంలో ప్రతి నియోజకవర్గంలో 3500 ఇళ్ల చొప్పున మొత్తం రాష్ట్రంలో 4 లక్షల 50 వేల గృహాల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోవడం నిరుపేదలకు వరమని ఆయన పేర్కొన్నారు

## స్వర్ణ ప్రాజెక్టు సందర్శించిన ఎస్పీ



ప్రజాపక్షం/సారంగాపూర్ : నిర్మల్ జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల అన్నారు.గురువారం రోజున సారంగాపూర్ మండలంలోని స్వర్ణ ప్రాజెక్టును ఆమె సందర్శించారు.ప్రాజెక్టులోని నీటి వివరాలను జిల్లా ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.గూట్లు ఎత్తే ముందు ప్రజలకు ముందస్తు సూచనలు ఇవ్వాలన్నారు.ఏలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.ఎస్పీ వెంట సారంగపూర్ ఎస్సై శ్రీకాంత్ అధికారులు పాల్గొన్నారు.

## హుజురాబాద్ ఎసిపి కార్యాలయాన్ని తనిఖీ చేసిన కరీంనగర్ సిపి అభిషేక్ మహంతి



ప్రజాపక్షం /హుజురాబాద్ : కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని హుజురాబాద్ ఏసిపి కార్యాలయాన్ని గురువారం రోజున కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏసిపి కార్యాలయంలో గల పెండింగ్ కేసులపై సమీక్షించారు. వాటికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన వాటిని పూర్తి చేయాలని సూచించారు. విసిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. రౌడీ షీటర్లు, హస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలనాన్నరు. ప్రతి నెల వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ప్రతి నెల వారికి సంబందించిన నూతన సమాచారం, ఎప్పటికప్పుడు సేకరించి నమోదు చేసుకోవాలన్నారు.సైబర్ నేరాల బారిన పడకుండా డివిజన్ పరిధి పోలీస్ స్టేషన్‌లోని అధికారుల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. పెండింగ్ వారెంట్ల అమలు చేయాలన్నారు. అక్రమ ఇసుక రవాణా, పిడిఎస్ బియ్యం, పేకాట స్థావరాలను గుర్తించి ఆడేవారిని పట్టుకోవడం వాటిపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఏసిపి శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## కరెంట్ అన్నా... నీకు వందనం



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : వర్షంలోన కరెంట్ అధికారుల సేవలు ఆగడం లేదు. నిన్నటి నుంచి వర్షం కురుస్తున్న మరమ్మతు సేవలకు మాత్రం బ్రేక్ వేయలేదు. వర్షంలో చేస్తున్న సేవలకు స్థానికులు కరెంట్ అన్న నీకు వందమంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని సివిల్ హాస్పిటల్ 11 కెవి లైన్ విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేపట్టారు. రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షానికి గాంధీచౌక్ బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ వద్ద 11 కెవి డిస్క్ ఫెయిల్ కావటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న విద్యుత్ అధికారులు వర్షం సైతం లెక్క చేయకుండా 11 కెవి డిస్క్ మార్చి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేయటం జరిగింది. డి టు సెక్షన్ విద్యుత్ సిబ్బందిని ఏఈడీ2 సుమితలను ఏడీఈ టౌన్ 2 తోట రాజశేఖర్, ఎం.శ్రీనివాస్, డీఈ నిజామాబాద్ అభినందించారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

ప్రజాపక్షం/గంగాధరః గంగాధర మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని సీనియర్ న్యాయవాది కోలకాని భూమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పడి పదేళ్లవుతున్నా మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేక ప్రతియేటా ఇంటర్ పూర్తి చేసిన అనేక మంది పేద విధ్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. అనేక మార్లు ప్రజాప్రతినిధులను, అధికారులకు విన్నవించిన్నప్పటికీ స్పందన లేదన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు.

# ప్రాధాన్యత రంగాలకు పెరిగిన కేటాయింపులు

**సీతారామ కేటాయింపులపై పెదవి విరుపు**

**విద్య, వైద్య రంగాలకు మరిన్ని కేటాయింపులు జరపాలన్న డిమాండ్స్**

**భట్టి పద్దుపై భిన్న స్వరాలు**



ప్రజాపక్షం/ఖమ్మం: భట్టి పద్దు పై సానుకూలత వ్యక్తమవుతుంది. ఈ పద్దులో కేటాయింపుల ప్రకారం అమలు చేస్తే బాగానే ఉంటుందన్న అభిప్రాయం ప్రజల నుంచి వ్యక్తమవుతుంది. గురువారం శాసన సభలో ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై కొన్ని విమర్శలు వ్యక్తమవుతున్నా మొత్తంగా బడ్జెట్ సంతృప్తి కరమేనన్న వాదన వినిపిస్తుంది. ముఖ్యంగా వ్యవసాయ అనుబంధ రంగాలకు భారీ మొత్తంలో నిధులు కేటాయించడం పట్ల రైతుల్లో ఆనందం వ్యక్తమవుతుంది. గతానికి భిన్నంగా వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ. 72,659 కోట్లు కేటాయించడం అదే సమయంలో నీటి పారుదల శాఖకు రూ.22,301 కోట్లు కేటాయించడం పట్ల రైతుల్లో సానుకూలత వ్యక్తమవుతుంది. బడ్జెట్‌లో పేర్కొన్న విధంగా అన్ని శాఖలకు నిధులు కేటాయించి ఖర్చు చేయగలిగితే మంచి బడ్జెట్‌గా రూపుదిద్దుకునే అవకాశం ఉందన్న వాదన వినిపిస్తుంది. ముఖ్యంగా సంక్షేమ రంగాలకు పెద్దపీట వేశారని మైనార్టీ సంక్షేమానికి రూ.3,003 కోట్లు, ఎస్టి సంక్షేమానికి రూ.17,056, బిసి సంక్షేమానికి రూ.9,200 కోట్లు కేటాయించడం పట్ల ఆయా వర్గాల నుంచి సంతృప్తికర అభిప్రాయం వ్యక్తమవుతుంది. పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధికి రూ.29,816 కోట్లు కేటాయించగా ఈ శాఖకు మరింత బడ్జెట్ కేటాయిస్తే బాగుండేదని గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్న నానుడికి అనుగుణంగా ఈ శాఖకు బడ్జెట్‌లో నిధులు ఎక్కువగా కేటాయిస్తే బాగుండేదన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. విద్య , వైద్య రంగాలకు బడ్జెట్‌లో చేసిన కేటాయింపులు సానుకూలంగా లేవని విద్య, వైద్య రంగాలకు మరిన్ని నిధులు కేటాయించాల్సి ఉందన్న భావన వ్యక్తమవుతుంది. రోడ్లు, భవనాలు, పరిశ్రమల శాఖ, వసతుల కల్పన తదితర శాఖలకు మరిన్ని నిధులు కేటాయించి ప్రాధాన్యతనివ్వాల్సి ఉందని కానీ కేటాయింపులు తక్కువగా ఉన్నాయని మరింతగా పెంచాల్సి ఉందన్నారు. అన్నింటికి మించి రెవెన్యూ లోటు రాష్ట్ర అప్పులు, పెరుగుతున్న తలసరి ఆదాయంలో అంతరాలు రాష్ట్ర ప్రగతికి ఇబ్బందిగా మారనున్నాయి. ఇప్పటికే రాష్ట్ర అప్పులు రూ.6,71,000 కోట్లకు పెరిగిందని భవిష్యత్తులో అప్పులు, వడ్డీలు చెల్లించడానికే ఆదాయ వనరులు సరిపోతాయని అభివృద్ధి కుంటుపడే ప్రమాదం ఉందని ఇకనైనా అప్పులు లేకుండా రాష్ట్ర ఆర్థిక రంగాన్ని పునర్ వ్యవస్థీకరణ చేసేవిధంగా చర్యలు చేపడితే బాగుంటుందని పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క చెప్పినట్లుగా రూ.42వేల కోట్లు బకాయిలు చెల్లిస్తే ఇక భవిష్యత్తు పరిస్థితి ఏమిటన్న ప్రశ్న తలెత్తుతుంది. శాఖలకు కేటాయించిన విధంగా ప్రతి పైసా ఖర్చు అయ్యేవిధంగా చూడాలని గత పాలకుల మాదిరి బడ్జెట్‌లో కేటాయింపులు ఉండి ఖర్చు చేయలేకపోవడం ఇతర రంగాలకు నిధులు మళ్లించడం లాంటిది చేయరాదన్న సూచన ఎక్కువగా వినవస్తుంది. రుణమాఫీ పై గందరగోళం నెలకొందని బడ్జెట్‌లో రూ.31వేల కోట్లు కేటాయించినప్పటికీ పూర్తి స్థాయిలో అర్హత కలిగిన ప్రతి రైతుకు రుణమాఫీ జరిగేవిధంగా ఈ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. సీతారామ ప్రాజెక్టుకు కేటాయింపులపై ఉమ్మడి ఖమ్మంజిల్లా నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతుంది. గత ప్రభుత్వం నిధులు కేటాయించక ప్రాజెక్టు నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతుందని ఆరోపణలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రూ.791 కోట్లు మాత్రమే కేటాయించడం శోచనీయమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే రీతి కేటాయింపులు జరిపితే సీతారామ ప్రాజెక్టు 2030 నాటికి పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. కాంగ్రెస్ హామీల అమలు బడ్జెట్‌లో కేటాయింపుల పైన విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆరు గ్యారెంటీల అమలయ్యే రీతిలో ఈ బడ్జెట్ లేదన్న వాదన వినిపిస్తుంది. గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు తదితర వాటికి కేటాయింపులు సరైన రీతిలో లేవని మరి కొన్ని పథకాల ఊసే లేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

## పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగం కావాలి



ప్రజాపక్షం / ఆసిఫాబాద్ ప్రతినిధి : వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని, చెట్లు లేకపోతే భవిష్యత్తు లో దుర్భర పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తోందని జిల్లా ఎస్పి డివి. శ్రీనివాస్ రావు అన్నారు. గురువారం ఆసిఫాబాద్ జిల్లాలోని కైరిగూడ ఓపెన్ కాస్ట్ ప్రాంతంలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జిల్లా ఫారెస్ట్ అధికారి నీరజ్ కుమార్, గోలేటి జనరల్ మేనేజర్ డి. రవి ప్రసాద్ తో కలిసి ఎస్పి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిని పరిరక్షించుకునేందుకు అందరూ ముందుకు రావాలని, మొక్కలు నాటడం ద్వారా భవిష్యత్తరాలకు మనం మంచి చేసిన వాళ్లమవుతామని పేర్కొన్నారు. పర్యావరణ రక్షణలో ప్రతి ఒక్కరూ భాగం కావాలని, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతవరణాన్ని అందించేందుకు కృషి చేయాలని సూచించారు. చెట్లు, అడవులు లేకపోతే వర్షాలు పడక పంటలు పండక దుర్భర పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు

**కలెక్టర్ కోయ శ్రీహర్ష**



ప్రజాపక్షం/ముత్తారం: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువకునే విద్యార్థులకు అవసరమైన మౌళిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం ముత్తారం మండల కేంద్రంతో పాటు లక్కారం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పోతారం గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటి ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను, పాఠశాలల్లోని టాయిలెట్లు, భోజనశాల, కిచెన్ ఏరియాను ఆయన పరిశీలించారు. పాఠశాలల్లోని తరగతి గదులను తనిఖీ చేసి ప్రాథమిక తరగతుల విద్యార్థుల కనీస విద్యా ప్రమాణాలను కలెక్టర్ పరీక్షించారు. లక్కారం గ్రామంలోని పాఠశాల ప్రహరీ గోడ పాక్షికంగా దెబ్బతినడం గమనించిన కలెక్టర్ వెంటనే మరమ్మత్తులు చేయించాలని సూచించారు. పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. పోతారం జెడ్పీహెచ్ ఎస్ పాఠశాల గ్రౌండ్ లెవలింగ్ చేయాలని, కాంపౌండ్ వాల్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ముత్తారం ఎంపీపీఎస్ పాఠశాల వద్ద కూలిపోయే దశలో నిరుపయోగంగా ఉన్న తరగతి గదులను తొలగించాలని ఆయన అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీపీఓ సతీష్, ఎంపీడీఓ లలిత, ఎంపీఓ వేణుమాధవ్, పీఆర్ అసిస్టెంట్ ఇంజనీర్ వరలక్ష్మి , ఏపీఎం పద్మతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ధరణి దరఖాస్తులకు త్వరితగతిన పరిష్కారం

**కలెక్టర్ అభిలాస అభినవ్**



ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి : ధరణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మండల,డివిజన్ స్థాయి రెవెన్యూ అధికారులతో ధరణి,ప్రభుత్వ స్థలాల రక్షణ,వివిధ దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు.ధరణి దరఖాస్తుల పరిష్కారం,మండలాల వారీగా వివిధ దరఖాస్తులు,ఇప్పటివరకు పరిష్కరించినవి,పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై చర్చించారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,ధరణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.దరఖాస్తుల పరిష్కారానికి క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని అన్నారు.ప్రభుత్వ స్థలాలు అక్రమణకు గురి కాకుండా అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రభుత్వ స్థలాలు చెరువు భూములను కబ్జా చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని,ఆదేశించారు.పాఠశాలలు,కళాశాలలు ప్రారంభమైన దృశ్య విద్యార్థులకు ఆదాయ,కుల,నివాస ధ్రువీకరణ పత్రాలు వెంటనే జారీ చేయాలని,అలాగే జనన,మరణ ధ్రువీకరణ పత్రాలను సకాలంలో అందజేయాలని సూచించారు.ధరణి దరఖాస్తులు,వివిధ మాడ్యూల్స్,సెషన్స్,కోర్టు కేసులు తదితల అంశాలపై కలెక్టర్ అధికారులకు పలు సూచనలు జారీ చేశారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్,నిర్మల్,బైంసా ఆర్డీవోలు రత్నకళ్యాణి,కోమల్ రడ్డిలు,కలెకటరేల్ ఏవో సూర్యారావు,తహసిల్దార్లు,ఈడీఎం నదీం,అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాద బీమా సౌకర్యం అన్ని బ్యాంకుల్లో కల్పించాలి:అఫ్రోజ్ ఖాన్



ప్రజాపక్షం/శ్రీరాంపూర్ : సింగరేణి వ్యాప్తంగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 30 లక్షల ప్రమాద బీమా అందేలా సింగరేణి సి అండ్ ఎండి ఎన్ బలరాం హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకుతో ఒప్పందం చేసుకున్నారని, మిగతా అన్ని బ్యాంకులతో ఈ ఒప్పందం చేసుకోవాలని కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్ డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ లోని సివిల్ డిపార్ట్‌మెంట్ వద్ద గురువారం విలేకరులతో మాట్లాడుతూ సింగరేణిలో దాదాపు 25 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని, గత 15 సంవత్సరాలుగా కాంట్రాక్టు కార్మికుల జీతాలు పెరుగక చాలీచాలని వేతనాలతో కాలం వెల్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం కోల్ ఇండియాలో మాదిరి కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం ప్రధానంగా కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల సమస్యలను పరిష్కరిస్తూ, వారికి హై పవర్ కమిటీ వేతనాలను అందించాలని లేదా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఒ నం. 22 ప్రకారం వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు.

## కాంట్రాక్ట్ కార్మికుల మరణాలు యాజమాన్య హత్యలే...



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి: ఎన్‌టీపీసీ యాజమాన్యం చేపట్టిన కాంట్రాక్ట్ కార్మికుల మెడికల్ చెకప్‌లు కార్మికుల మరణాలకు దారి తీస్తున్నాయని, కాంట్రాక్ట్ కార్మికుల మరణాలు యాజమాన్య హత్యలేనని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్, ఎన్టీపీసీ క్యాజువల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు రెడ్డపాక శంకర్‌లు ఆరోపించారు. మెడికల్ చెకప్‌లు కేవలం కార్మికులకేనా యాజమాన్యానికి కూడా ఉన్నాయా ఉండదా అని వారు ప్రశ్నించారు. మెడికల్ చెకప్‌లపేరుతో కార్మికులను మానసికంగా భయభ్రాంతులకు గురి చేస్తూ వారి ప్రాణాలను తీస్తున్నారని, కాంట్రాక్ట్ కార్మికుల ఉసురు ఎన్టీపీసీ యాజమాన్యం తీస్తుందన్నారు, ధనవంతరి ఆస్పత్రితో యాజమాన్యం కుమ్మక్కై మెడికల్ చెకప్‌ల పేరుతో కాంట్రాక్ట్ కార్మికులను తొలగించి వారి స్తానాలను అమ్ముకోవాలని చూస్తున్నారని అన్నారు. యాజమాన్యం హైయ్యర్ మేనేజ్మెంట్లకు చిత్తశుద్ధి ఉంటే ముందుగా యాజమాన్యం హెచ్‌ఆర్ డిపార్ట్‌మెంట్ అధికారులకు తక్షణమే మెడికల్ చెకప్ చేయించాలని వారు డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మికుల మరణాలు యాజమాన్య హత్యలేనని, వెంటనే మెడికల్ చెకప్‌లను రద్దు చేయాలని, లేనిపక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పోరాటాలు, ఆందోళనలు చేస్తామని వారు హెచ్చరించారు.

## భట్టి విక్రమార్క మాటలన్నీ ఉత్తమాటలే...

**అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ**




ప్రజాపక్షం/ నిజామాబాద్ ప్రతినిధి : భట్టి విక్రమార్క మాటలన్ని ఉత్త మాటలేనని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఒక ప్రకటనలో అన్నారు. రాష్ట్ర బడ్జెట్ అనంతరం అసెంబ్లీలోని మీడియా పాయింట్ వద్ద అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రాన్ని బద్నామ్ చేస్తూ నిన్న అసెంబ్లీలో పెట్టిన తీర్మానం వెనుక ఉన్న మతాలబ్ ఏంటో తెలంగాణ ప్రజలకు ఈ రోజు తేటతెల్లమైందని కాంగ్రెస్ అధికారంలోకి రావటానికి ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, ఐదు డిక్లరేషన్లు, 420 హామీల నుండి తప్పించుకునేందుకు రేవంత్ సర్కార్ చేసిన కుట్రలో భాగమే నేడు ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ నిదర్శనమన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఏమి ఇచ్చిందని, నిన్న అసెంబ్లీ చర్చ పెట్టిన కాంగ్రెస్ సర్కార్ చిన్న ఉదాహరణగా ఎఫ్‌సీఐ కింద కేవలం 3 నెలలకు 3561 కోట్ల నిధులు ఇస్తే ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి కేవలం 3836 కోట్లు మాత్రమే ప్రవేశపెట్టిందని గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మర్చిందంటూ మళ్లి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అప్పులపైనే ఆధారపడాల్సి వస్తుందని కేవలం ఒక సంవత్సరానికే దాదాపు 70 వేల కోట్ల అప్పుకు ప్రతిపాదించడం జరిగిందని తెలంగాణలో ఇళ్లు లేని నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్న వారికి కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లలో కారం కొట్టిందని గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో 10 ఏళ్లు మోసం చేస్తే ఇప్పుడు కాంగ్రెస్ ఇందిరమ్మ ఇళ్ల పేరుతో మళ్లీ మోసం చేస్తుందని, స్థలం ఉన్న వారికి 5లక్షలు ఎస్సీ, ఎస్టీ 6 లక్షలు నియోజకవర్గానికి 3500 ఇళ్లు ఇస్తామని దానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎటువంటి స్పష్టత ఇవ్వలేదన్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. నిజాంషుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామన్నారు కానీ దానికి ఎటువంటి నిధులు కేటాయించలేదని, 52 శాతం ఉన్న బీసీలకు 9 వేల కోట్లు ప్రకటించి అన్యాయం చేసిందన్నారు.

## కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : 33 సంవత్సరాల అవిరాళ కృషి, సుదీర్ఘ అనుభవంతో, నాణ్యమైన ఉన్నత విద్యకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలకు యుజిసి ద్వారా స్వయం ప్రతిపత్తి (అటానమస్) హోదా లభించినట్లు కళాశాల ఛైర్మన్ ఎం. నిరంజన్‌రెడ్డి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కోటా అప్పిరెడ్డి లు తెలిపారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఖమ్మం నగరంలో ప్రభుత్వ ఎస్‌ఆర్‌అండ్‌బిజిఎన్‌ఆర్ కళాశాలకు అటానమస్ హోదా ఉందని జిల్లాలో అటానమస్ హోదా సాధించిన ఏకైక ప్రైవేటు డిగ్రీ కళాశాల కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల ఒక్కటేనన్నారు. 1991వ సంవత్సరంలో కళాశాలను ఏర్పాటు చేసి డిగ్రీ స్థాయిలో కంప్యూటర్ సైన్స్ కోర్సులను అందుబాటులోకి తెచ్చామన్నారు. జిల్లాకు ఎంసిఏ కోర్సు, ఒకేషనల్ డిగ్రీ కోర్సులైన బయోటెక్నాలజీ, మైక్రో బయాలజీ, డాటా సైన్స్, బిబిఎ లను కూడా అందుబాటులోకి తెచ్చామన్నారు. తమ కళాశాలలోని వసతులను, విద్యా బోధన పద్ధతులను, పాస్ పర్సంటేజ్, విద్యార్థుల నైపుణ్యాలను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వారి విజయాలను జాతీయ స్థాయిలో రెండు రోజులు జాతీయ స్థాయి ప్రోఫెసర్లచే మదింపు చేసి 2021 సంవత్సరంలో నాక్ గ్రేడ్ సాధించిన మొట్టమొదటి ప్రైవేటు డిగ్రీ కళాశాల కవిత మెమోరియల్ అన్నారు. అటానమస్ హోదా 2024 25 నుండి 2028 29 వరకు ఐదేండ్ల వరకు ఈ హోదా ఉంటుందన్నారు. ఈ హోదా వల్ల పరీక్షల స్వీయ నిర్వహణ, మూల్యాంకనం, త్వరితగతిన ఫలితాలు, కళాశాల స్థాయిలోనే అన్ని అంశాల్లో స్వయం పాలన జరగనుందన్నారు. స్థానిక అవసరాల మేరకు కొత్త కోర్సులు, సిలబస్ మార్పు వంటి అనేక వెసులుబాటు కళాశాలకు లభిస్తాయన్నారు. జాతీయ స్థాయిలో సెమినార్లు, వర్క్‌షాపుల నిర్వహణ, పరిశ్రమలతో ఎంఓయులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింత మెరుగవుతాయన్నారు. అటానమస్ హోదా లభించడం పట్ల కళాశాలలో కేక్ కట్ చేసి టపాసులు కాల్చి సంబురాలు నిర్వహించారు.ఈ సమావేశంలో కళాశాల డైరెక్టర్, అడ్వయిజర్ పన్నాల కృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ డా॥ కెవి రమణారావు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సులోనే ప్రయాణం సురక్షితం డిఎస్‌పి గంగారెడ్డి



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : నిర్మల్ ఆర్టీసీ డిపో లో నిర్వహిస్తున్న ప్రమాద రహిత వారోత్సవాలకు ముఖ్య అతిథిగా నిర్మల్ పోలీస్ డి.ఎస్.పి గంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.డైవర్లు అప్రమత్తంగా ఉంటూ,ధ్యాసంత డైవింగ్ పైనే పెట్టిలని,ప్రమాదాలను నివారించాలని,రోడ్డు సూచనలను పాటించాలని,సిగ్నల్స్ ను పాటించాలని,దేశ చరిత్రలోనే ఆర్టీసీ ఒక బ్రాండ్ ఆర్టీసీ డైవర్లు శిక్షణ పోంది ఉంటారని ప్రయాణికుల నమ్మకమం.డైవర్లు ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని ఏ మాత్రం ఏమరుపాటు వ్యవరించిన భారీ మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని,సెల్ ఫోన్ మాట్లాడుతూ బస్సు నడుపొద్దని ఆయన వివరించారు.డిపో మేనేజర్ ప్రతిమా రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రమాద రహిత వారోత్సవాలు 24 జులై నుండి 30 జులై వరకు నిర్వహిస్తామని డ్రైవర్లు డ్యూటీ కి వెళ్ళేటప్పుడు మంచి కండీషన్ తో బస్సులు అప్పచెప్పాలని మేకానిక్ లకు సూచించారు. వర్షా కాలం తాగు సూచనలు తీసుకొని బస్సులు నడపాలని రోడ్డు పై స్కిడ్ అయ్యే పరిస్థితులు ఉంటాయన్నారు. బస్సులు అప్రమత్తంగా నడపాలని పూర్తి ప్రశాంతతో బస్సులు నడపాలని తను సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఐ.రాజశేఖర్, అసిస్టెంట్ ఇంజనీర్ ఎమ్. నవీన్ కుమార్, మెకానిక్‌లు డ్రైవర్,కండక్టర్ లు పాల్గొన్నారు.

## వ్యవసాయరంగ కేటాయింపులు సంతృప్తికరం

సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్



**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్ర బడ్జెట్‌లో సంక్షేమం, వ్యవసాయ రంగ కేటాయింపులు సంతృప్తికరంగా ఉన్నాయని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. గురువారం శాసనసభలో ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ పై ఆయన స్పందించారు. కేంద్రప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకున్న పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వమే వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. సాగునీటిరంగానికి నిధులు పెంచాల్సి ఉందన్నారు. గృహజ్యోతి, ఉచిత బస్సు, మహిళా శక్తి పథకాలకు నిధులు కేటాయించడం అభినందించదగిన పరిణామమన్నారు. విద్యారంగానికి, ఇందిరమ్మ గృహ నిర్మాణాలకు కేటాయింపులు పెంచాలని ప్రసాద్ కోరారు.

## సబ్సిడీ నిధులు ఖర్చుచేయాలి

సిపిఐ జయశంకర్ జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** రాష్ట్ర బడ్జెట్లో శాఖలకు కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేసే విధంగా ప్రభుత్వం చూడాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ కోరారు. గురువారం రాష్ట్ర బడ్జెట్‌పై ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యరంగాలకు మరింత బడ్జెట్ కేటాయించి ఉంటే బాగుండేదన్నారు. వ్యవసాయ రంగానికి అధిక నిధులు కేటాయించిన ఇంకా వ్యవసాయ ఎరువులపై సబ్సిడీకి మరిన్ని నిధులు కేటాయించి ఉంటే బాగుండేదని, బడ్జెట్ పేదల ఆకాంక్షను నెరవేర్చే విధంగా ఉండాలని కోరారు.

## వ్యవసాయానికి పెద్దపీట హర్షణీయం

సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** రాష్ట్ర బడ్జెట్ వ్యవసాయరంగానికి, రైతులకు మేలు చేసే విధంగా ఉందని, వ్యవసాయ రంగానికి పెద్దపీట వేయడాన్ని హర్షిస్తున్నామని సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలు అమలుపరిచే దిశగా 6 గ్యారంటీ పథకాలకు రాష్ట్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు శుభ సూచికమని, వైద్యరంగానికి పెద్దపీట వేయడం, భూమి లేని నిరుపేదలకు ఆర్థిక సహాయం ఇవ్వడం సంతోషకరమన్నారు. గృహ లక్ష్మి, గృహజ్యోతికి ఇంకా ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉందని, ఎస్సీ ఎస్టీల అభివృద్ధికి బడ్జెట్‌లో తక్కువ కేటాయించడం బాధాకరమన్నారు.

## ఎస్ఎల్‌బిసి పూర్తికి నిధులేవి?

సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/నల్లగొండ :** రాష్ట్రబడ్జెట్‌లో సాగునీటి రంగానికి ప్రాధాన్యత కల్పిస్తూ నిధులు కేటాయించినా, జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులు ఎస్ఎల్‌బిసి సొరంగ మార్గం పూర్తికి ప్రత్యేక నిధులు కేటాయించలేదని సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. శ్రీశైలం సొరంగ మార్గం నక్కలగండి, డిండి ఎత్తిపోతల పథకం, చర్లగూడెం రిజర్వాయర్‌లకు ప్రాధాన్యతనిస్తూ నిధులు పెంచాల్సి ఉందన్నారు. వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ అన్నదాతలకు అండగా ఉన్నప్పటికీ విద్య, వైద్యానికి సరైన నిధులు కేటాయించలేదని, ప్రస్తుత కేటాయించిన బడ్జెట్ నిధులు ప్రజాసంక్షేమం కోసం ఉపయోగించాలని కోరారు.

## పార్టీ బలోపేతానికి కృషి

సిపిఐ జనగాం జిల్లా కార్యదర్శి రాజారెడ్డి




**ప్రజాపక్షం/లింగాలఘనపురం :** కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి కృషిచేయాలని సిపిఐ జనగాం జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని గౌడ కమిటీ హాల్‌లో రావుల సదానందగౌడ్ అధ్యక్షతలో పార్టీ నిర్మాణ విస్తృత సమావేశం కవిడి వెంకటేష్ అధ్యక్షతన జరుగగా ముఖ్య అతిథిగా రాజారెడ్డి హాజరై మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేయడానికి పార్టీ నాయకులు సిద్ధం కావాలన్నారు. అన్ని గ్రామాలలో ప్రజా సమస్యలను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించే దిశగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రజలందరికీ అందేలా కృషి చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న, జిల్లా నాయకులు ఎం.జనార్దన్, సిహెచ్ ఎల్లయ్య, ఎం.కుమార్, బి.అంజయ్య, జి.సిద్దులు, బి.చంద్రశేఖర్, ఉప్పలయ్య, కె.అంజయ్య, జి.వెంకటేష్, జి.సిద్దులు, ఎం.శ్రీను, బి.కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా
# భవిష్యత్ కార్యాచరణ




హామీల అమలులో మోదీ విఫలం

ప్రజల కష్టాలపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించాలి

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభం

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా సమరశీల పోరాటాలకు భారత కమ్యూనిస్టు పార్టీ భవిష్యత్ కార్యాచరణ సిద్ధం చేసిందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. రెండురోజుల పాటు జరగనున్న సిపిఐ ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయ శిక్షణ శిబిరాలను గురువారం కరీంనగర్‌లో చాడ వెంకటరెడ్డి ప్రారంభించారు. శిక్షణ శిబిరాలకు సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అధ్యక్షత వహించారు. శిక్షణ శిబిరాల ప్రారంభ సూచికగా సిపిఐ పతాకాన్ని సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ ఆవిష్కరించారు. శిక్షణ తరగతులకు ముఖ్యఅతిథిగా హాజరై చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ కేంద్రబడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి మోదీ ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందన్నారు. పాలమూరు రంగారెడ్డి జాతీయ హోదా? వెనుకబడిన జిల్లాల పురోగతి? బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే కోచ్ వంటి హామీల అమలులో మోదీ పూర్తిగా విఫలమయ్యారన్నారు. తెలంగాణలో 8మంది బిజెపి ఎంపిలు ఉండి ఏంచేశారని ప్రశ్నించారు. రాష్ట్రంలో బిఆర్‌ఎస్ పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రాజెక్టుల సందర్శనను అడ్డుకొని, ఇప్పుడు వారే ప్రాజెక్టుల పర్యటన చేయడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరునెలలు గడుస్తోందని, ఇచ్చిన హామీల అమలుకు కొట్లాడాలని బిఆర్‌ఎస్ నేతలకు చాడ హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల కష్టాలు తెలుసుకుని పరిష్కరించాలని కోరారు. విద్య, వైద్యం, ఉపాధిలో తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు మినహా, 200 యూనిట్ల ఉచిత కరెంటు, 500 రూపాయలకే గ్యాస్ పథకం పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. రేషన్ కార్డులు, అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, ఇంటిస్థలాలు, పెన్షన్‌ల పెంపు, నిరుద్యోగుల విషయం జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తూనే రైతు భరోసా అమలు చేయాలన్నారు. ధరణి సమస్యలు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలపై నిపుణులతో చర్చించి పరిష్కరించేలా స్పందించాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు. సిపిఐ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు మరింత చేరువయ్యేందుకు, రాజకీయ చైతన్యం కావడానికి పార్టీ ప్రజాసంఘాలను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసుకోవడానికి ఈ రాజకీయ శిక్షణ శిబిరాలు ఉపయోగపడతాయన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం దిశగా సిపిఐ శ్రేణులు పోరాటాలకు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిపిఐ కరీంనగర్, సిద్దిపేట, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, మంద పవన్, గుంటి వేణు, తాండ్ర సదానందం, వెన్న సురేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, గడిపె మల్లేష్, గోషిక మోహన్, కసిరెడ్డి మణికంఠరెడ్డితో పాటు ఐదు జిల్లాలకు చెందిన గ్రామశాఖ కార్యదర్శులు, జిల్లా కౌన్సిల్‌సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.






## ఉపాధి హామీ కార్మికుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నరసింహ్మా




**ప్రజాపక్షం/మునుగోడు :** పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ కార్మికుల బిల్లులను వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొలుగూరి నరసింహ్మా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల సమితి సమావేశం జరిగింది. సమావేశానికి హాజరై నరసింహ్మా మాట్లాడుతూ ఉపాధిహామీ కూలీల సమస్యలపై ఈనెల 29న జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా విజయవంతం చేయాలని కోరారు. ఉపాధిహామీ పథకానికి నిర్వీర్యం చేసేందుకు కేంద్ర బడ్జెట్లో నిధులు కేటాయించలేదని విమర్శించారు. గ్రామీణ మున్సిపాలిటీలలో ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టాలని, ఉపాధి కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించి రోజువారి వేతనం రూ,700 ఇవ్వాలని డిమాండ్ చేశారు. నూతన రేషన్‌కార్డులు, వృద్ధాప్య పెన్షన్లు, వితంతువుల పెన్షన్లు, ఒంటరి మహిళల పెన్షన్ వెంటనే మంజూరు చేయాలన్నారు. ఉప్పునూతల రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం మండల కార్యదర్శి కాయతి వెంకన్న, సిపిఐ మండల కార్యదర్శి చాపల శీను, కె.రాములు, పి.జానయ్య, పి.యాదయ్య, ఆర్.పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగాన్ని విస్మరించిన ప్రభుత్వాలు

కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికే నిధుల కోత

ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు నద్దునూరి అశోక్ స్టాలిన్




**ప్రజాపక్షం/హన్మకొండ టౌన్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించి అరకొర కేటాయింపులు కేటాయించి మొండి చెయ్యి చూపించాయని, విద్యా రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పచెప్పేందుకే బడ్జెట్‌లో నిధుల తగ్గింపని ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు నద్దునూరి అశోక్ స్టాలిన్ విమర్శించారు. గురువారం పట్టణంలోని భీమారం జంక్షన్‌లో ఎఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో రాస్తారోకో చేసి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా అశోక్ స్టాలిన్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో కనీసం 10శాతం, రాష్ట్రబడ్జెట్‌లో కనీసం 30శాతం విద్యారంగానికి కేటాయించాలని అనేక నివేదికలు చెబుతున్నా, బడ్జెట్‌లో విద్యారంగం వాటా ఏయేటికాయేడు కుంచించుకుపోతుందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో యుజిసికి భారీగా నిధులను తగ్గించిందని, కొత్తగా విద్యాసంస్థల కేటాయింపులు లేవని, యూనివర్సిటీల అభివృద్ధికి నిధుల కేటాయింపులు ఇవ్వలేదన్నారు. విద్యార్థులు ఫెలోషిప్, స్కాలర్ షిప్‌ల పెంపు లేదన్నారు. విద్యారంగం స్టేషనరీపై జీఎస్టీ ఎత్తివేయాలన్నారు. విభజన హామీ చట్టం ప్రకారం తెలంగాణలో జిల్లాకో నవోదయ పాఠశాల, కేంద్రీయ విద్యాలయ ఏర్పాటు, కొత్త మెడికల్ కళాశాలల ఏర్పాటు ప్రకటన లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లను సవరించి విద్యాభివృద్ధికి, ప్రభుత్వరంగంలోని పాఠశాల, ఉన్నత విద్య అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బాష బోయిన సంతోష్‌తో పాటు పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.




**మహబూబాబాద్ ప్రతినిధి :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగాన్ని విస్మరించారని నిరసిస్తూ ఎఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో మహబూబాబాద్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తూ బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాగం లోకేష్, వెలుగు శ్రావణ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో విద్యారంగానికి మొండిచెయ్యి చూపించాయని, విద్యాభివృద్ధికి కనీసం కేటాయించాల్సిన నిధులను కేటాయించలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మేక వెంకటేష్, పట్టణ కార్యదర్శి చెలువూరి వికాస్, శ్రావణ్, రంజిత్, క్రాంతి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంక్షేమంపై కేంద్రం వివక్ష

మహిళా సమాఖ్య భువనగిరి జిల్లా కార్యదర్శి జంగమ్మ




**ప్రజాపక్షం/భువనగిరి :** కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో మహిళల సంక్షేమంపై వివక్షత చూపారని మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ ఆరోపించారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా మహిళా సమాఖ్య విస్తృత సమితి సమావేశం సోమన సబిత అధ్యక్షతన భువనగిరిలోని సిపిఐ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా బండి జంగమ్మ మాట్లాడుతూ బడ్జెట్‌లో గ్రామీణ సంక్షేమ పథకాలు కొత్తవి ఏమి ప్రవేశపెట్టలేదని, మహిళా విద్యావంతులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే చర్యలు లేవని చెప్పారు. మహిళా వ్యవసాయ కార్మికులకు జీవిత బీమా లాంటి పథకాలు ప్రవేశ పెట్టవలసిన అవసరం ఉందన్నారు. మహిళలకు కార్పొరేట్ హాస్పిటల్స్‌లో ఉచిత వైద్య సహకారం అందే విధంగా బడ్జెట్ రూపొందించాలన్నారు. మహిళా సంఘాలకు అధికంగా రుణాలు ఇవ్వడానికి కేంద్రం నుంచి అధిక బడ్జెట్ ఇవ్వాలని, వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని కోరారు. మహిళ నిరుపేదలకు ఇంటి నిర్మాణానికి రూ.10లక్షలు ఇవ్వాలని కోరారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి ప్రభుత్వాలు కృషిచేయాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు సోమన సబితా, గుర్రం రాజమణి, మాటూరి జానమ్మ, వడ్లకొండ భారతమ్మ, మునుకుంట్ల నరసమ్మ, కందుల లింగమ్మ, ఆరే పుష్ప, ముసునూరి పూజిత, బైకాని పద్మ, చిప్పల జయమ్మ, పాక సత్తెమ్మ, తుమ్మల జ్యోతి, సరళ, మద్దూరి భాగ్యమ్మ, దండు శాంతమ్మ, మౌనిక పాల్గొన్నారు.

## కౌలురైతులకు రుణమాఫీ చేయాలి

రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డ వెంకటయ్య

**ప్రజాపక్షం/కోదాడ(చిలుకూరు) :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించి తెలంగాణ రాష్ట్రానికి మోదీ ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డ వెంకటయ్య విమర్శించారు. గురువారం చిలుకూరు మండల కేంద్రంలో జరిగిన కౌలు రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయరంగాన్ని నిర్వీర్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు మద్దతు ధర, గ్యారంటీ చట్టంపై బడ్జెట్‌లో ఊసేలేదన్నారు. మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సంపన్నవర్గాలకు మేలు చేసే విధంగా ఉందని దుయ్యబట్టారు. స్వామినాథన్ సిఫారసులకు చట్టబద్ధత కల్పించాలని తమ సంఘం పక్షాన డిమాండ్ చేశారు. కౌలు రైతులకు 2011 చట్టం ప్రకారం గుర్తించి కౌలు కార్డులు ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు కూడా వ్యవసాయ సబ్సిడీ వర్తింపజేయాలన్నారు. కౌలు రైతులకు కూడా రుణమాఫీ, రైతుబీమా సౌకర్యాలు కల్పించాలన్నారు. వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకున్న పరిస్థితుల్లో ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. కొండా వెంకయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో కొండా వెంకన్న, పిల్లుట్ల కనకారావు, ఎలగొండ ప్రభాకర్, బెల్లంకొండ నాగయ్య, గంగిరెడ్డి రవీందర్‌రెడి, నారబోయిన రామయ్య, కొండ వీరమ్మ, గుంజ గురవయ్య, ఎన్.లక్ష్మీనారాయణ, సిరాపురపు పున్నయ్య, గుంజ వెంకటేశ్వర్లు, నల్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## ప్రజాసమస్యల పరిష్కారానికి ఉద్యమాలు

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్




**ప్రజాపక్షం/నూతనకల్ :** ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ పార్టీ శ్రేణులు, ప్రజా సంఘాల బాధ్యులను కోరారు. గురువారం మండల కేంద్రంలో నూతనకల్, మద్దిరాల మండలాల పార్టీ నిర్మాణ, విస్తృత కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటి నుండి నేటి వరకు ఈ ప్రాంతంలో ప్రజాసమస్యలపై సిపిఐ రాజీలేని పోరాటాలు నిర్వహించిందని గుర్తు చేశారు. అమరులైన కమ్యూనిస్టు నాయకుల స్ఫూర్తితో నేటితరం నాయకులు ప్రజా సమస్యలపై ఉద్యమించాలని సూచించారు. తెలంగాణలో నైజాం పరిపాలన జరిగిన అనంతరం ఈ ప్రాంతంలోని జిన్నారెడ్డి భూములను ఆ నాటి నుండి నేటి వరకు సాగు చేస్తున్న రైతులకు ఏలాంటి పట్టాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ రైతులకు పట్టాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించే దిశగా కార్యకర్తలు పనిచేయాలని కోరారు. తొట్ల ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మురగుండ్ల లక్ష్మయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కంబాల శ్రీనివాస్, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, వెంకట్ రెడ్డి, సదానందం తదితలు పాల్గొన్నారు.

## 'టూరిజం' కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



కూనంనేని సాంబశివరావును కలిసిన యూనియన్ నాయకులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** టూరిజం కార్పొరేషన్ లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పక్షాన శాసన సభలో మాట్లాడి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని టూరిజం కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి గురువారం సిపిఐ శాసన సభాపక్ష నాయకులు కూనంనేని సాంబశివరావుని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారి సమస్యలపై విజ్ఞాపనపత్రాన్ని కూనంనేని సాంబశివరావుకు అందజేశారు. వారి సమస్యల పట్ల శాసనసభలో ప్రస్తావన చేస్తానని సాంబశివరావు తెలియజేసినట్లు వారు తెలిపారు. గత 20 సంవత్సరాల నుండి చాలీచాలని వేతనాలతో టూరిజం కార్పొరేషన్ సంస్థలలో కాంటాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో అనేక మంది ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తున్నారని రాజమౌళి అన్నారు. వారికి ప్రభుత్వం నుంచి రావాలని కనీస సదుపాయాలు అందడం లేదని, ఉద్యోగ గ్యారంటీ లేదని ఆయన తెలిపారు. కార్మికుల పక్షాన ఉండి సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా కూనంనేనిని కోరారు. కూనంనేని సాంబశివరావును కలిసిన వారిలో టూరిజం కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ నాయకులు ప్రణీత్, గణేష్, డోలు శీను, క్రాంతి, దిగంబర్, కర్ణాకర్, సాయి తదితరులు ఉన్నారు.

## రాయల్టీ విధించొచ్చు

(మొదటి పేజీ తరువాయి)

నియంత్రణాధికారం, అభివృద్ధి హక్కులుంటాయని తేల్చి చెప్పింది. ఖనిజాలపై పార్లమెంటుకున్న పన్ను విధించే అధికారం అనేది రాష్ట్రాల నియంత్రణాధికారాన్ని తుడిచిపెట్టేస్తోందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని తొమ్మిది మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. గనులు, ఖనిజాల (అభివృద్ధి, నియంత్రణ) చట్టం1957 (ఎంఎండిఆర్) ప్రకారం.. ఖనిజాలపై రాయల్టీని పన్నుగా పేర్కొనవచ్చని, దీనిపై పార్లమెంటుకు గంపగుత్త అధికారముందని మైనింగ్ కంపెనీల తరఫున సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే వాదించారు. దీనిని సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. 1989లో ఇండియా సిమెంట్స్ లిమిటెడ్ వర్సెస్ తమిళనాడు ప్రభుత్వం కేసులో ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం.. రాయల్టీని పన్నుగా గుర్తించవచ్చని తీర్పు చెప్పింది. అయితే 2004లో పశ్చిమబెంగాల్ ప్రభుత్వం వర్సెస్ కేశోరాం ఇండస్ట్రీస్ లిమిటెడ్ కేసులో తీర్పు చెబుతూ.. 1989 నాటి తీర్పులో అచ్చుతప్పులు దొర్లాయని, రాయల్టీ.. పన్ను కాబోదని స్పష్టంచేసింది. దీంతో రెండు విభిన్నమైన తీర్పులు రాగా.. అప్పట్లో ఈ వివాదాన్ని తొమ్మిది మంది సభ్యుల విస్తృత రాజ్యాంగ ధర్మాసనానికి కోర్టు అప్పగించింది. ఈ క్రమంలోనే ఈ ఏడాది ఫిబ్రవరిలో దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం.. మార్చిలో తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా కీలక తీర్పు వెలువరించింది.

## సిబ్బందిని నియమించాలి

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించే పరిస్థితి ఏర్పడిందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో క్లరికల్ స్టాఫ్, సబార్డినేట్ స్టాఫ్, స్వీపర్లను తగిన సంఖ్యలో భర్తీ చేయాలన్నారు. కార్మిక చట్టాల ప్రకారం క్యాజువల్ ఉద్యోగులకు కనీస వేతనాలు, బోనస్‌ను చెల్లించాలని ఆయన కోరారు. ఇండియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎపి, టిఎస్) జనరల్ సెక్రటరీ పి.వి.కృష్ణారావు మాట్లాడుతూ క్లరికల్ సిబ్బంది కొరత కారణంగా బ్యాంక్‌లో దయనీయ పరిస్థితి నెలకొన్నదన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో 494 శాఖలకు 1040 మంది క్లరికల్ సిబ్బంది, 1776 మంది అధికారులు పని చేస్తుండగా, కేవలం 99 మంది సబార్డినేట్ సిబ్బంది పని చేస్తున్నారని, మిగిలిన శాఖలలో తక్కువ వేతనాలతో క్యాజువల్ ఉద్యోగులతో నిర్వహించబడుతున్నాయని వివరించారు. సంతృప్తికరమైన, మెరుగైన కస్టమర్ సేవలను విస్తరించే దృష్ట్యా సిబ్బందిని వెంటనే రిక్రూట్‌మెంట్ చేయాలని, బ్యాంకు శాఖలలో గత 20 నుండి 25 సంవత్సరాలుగా పనిచేస్తున్న క్యాజువల్ ఉద్యోగులను ఖాళీగా పర్మినెంట్ ఉద్యోగాల్లో నియమించాలని డిమాండ్ చేశారు. కనీసం ఒక్క క్లర్క్, సబార్డినేట్, స్వీపర్ల పోస్టులు భర్తీ చేయకుండా యాజమాన్యం కొత్త శాఖలను ప్రారంభించడం విచారకరమని పి.వి.కృష్ణరావు అన్నారు. ఈ ధర్నాకు యూనియన్ అధ్యక్షుడు ఎం.ఎస్.కుమార్ అధ్యక్షత వహించగా, సంయుక్త ప్రధాన కార్యదర్శి జి.నల్లప్ప రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దామరతోగులో పేలిన తూటా

(మొదటి పేజీ తరువాయి)

చాలా కాలంగా మావోయిస్టు సాయుధ దళాల్లో పనిచేస్తున్నాడు. పోలీసులు తెలిపిన ప్రాథమిక సమాచారం ప్రకారం మావోయిస్టు యాక్షన్ టీములు గుండాల అడవుల్లోకి వచ్చాయన్న సమాచారంతో అటు భూపాలపల్లి, ఇటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు కూంబింగ్ చేపట్టారు. గురువారం తెల్లవారు జామున జరిగిన ఎన్‌కౌంటర్‌లో అశోక్ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మావోయిస్టు సాయుధులు ఏడుగురు జిల్లాలో జొరబడినదన్న పక్కా సమాచారంతో తెలంగాణ గ్రేహౌండ్స్ స్పెషల్ పార్టీ నిర్వహించిన ఈ కూంబింగ్ ఆపరేషన్‌లో సాయుధ మావోలు తారసపడి పోలీసులపై కాల్పులు జరపగా పోలీసులు జరిపిన ఎదురు కాల్పుల్లో అశోక్ మృతి చెందాడని సమాచారం. మిగిలిన దళ సభ్యుల కోసం పోలీసులు గుండాల అడవులను జల్లెడ పడుతున్నారు. ఇదిలా ఉండగా ఈ ఎన్‌కౌంటర్ పై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎదురు కాల్పులను ధృవీకరించే ఘటన ఏది ఇక్కడ చోటు చేసుకోలేదని ఎక్కడో పట్టుకొచ్చి ఇక్కడ కాల్చివేశారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మావోయిస్టు కార్యదర్శి ఆజాద్ సైతం ఇదే విషయాన్ని తెలిపారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో కుమ్మకై మావోయిస్టు పార్టీ నిర్మూలనకు పని చేస్తుందని ఆజాద్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఎనిమిది నెలల కాలంలో బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తూ ప్రజల కోసం పనిచేస్తున్న వారిని హతమారుస్తున్నారని ఆజాద్ తెలిపారు. గుండాల మండలం దామరతోగు అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇది రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేసిన హత్య అని దీనికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆజాద్ తెలిపారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State,
Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com

ప్రజాపక్షం
మహానగరి
హైదరాబాద్ – రంగారెడ్డి
ఖమ్మం | శుక్రవారం | 26 జులై, 2024 | 9

## పాతబస్తీ బోనాల ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పాతబస్తీలో ఆదివారం జరుగనున్న మహాంకాళి ఆలయం, లాల్‌దర్వాజ, ఛత్రినాక వార్షిక బోనాల ఉత్సవాల ఏర్పాట్లు, బందోబస్తు చర్యలపై పోలీసు, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు స్వయంగా పరిశీలించి సమీక్షించారు. అదనపు పోలీసు కమిషనర్ విక్రమ్‌సింగ్ మాన్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సమాచార శాఖ కమిషనర్ హనుమంతరావు, సౌత్‌జోన్ డిసిపి స్నేహమెహ్రా, ట్రాఫిక్ డిసిపి వెంకటేశ్వర్లు సమీక్షించిన వారిలో ఉన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా శాంతి భద్రతలు, ట్రాఫిక్, భక్తుల కోసం ప్రత్యేక క్యూ లైన్లు, మెడికల్, బారికేడింగ్, మీడియా పాయింట్, విద్యుత్, నీటి సరఫరా తదితర ఏర్పాట్లపై వీరు సమీక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగు ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖలను వారు ఆదేశించారు.

## గ్రేటర్‌కు భారీగా నిధుల కెటాయింపు

### మేయర్, డిప్యూటీ మేయర్ హర్షం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర బడ్జెట్‌లో గ్రేటర్ హైదరాబాద్‌కు రూ. 10వేల కోట్లు కేటాయించినందుకు నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలకు అన్నిరంగాలలో అభివృద్ధి, సంక్షేమం రెండు సమానంగా బడ్జెట్‌లో కేటాయించడం మంచి పరిమాణం అన్నారు. హైదరాబాద్ మౌలిక సదుపాయాలకు మొత్తం అభివృద్ధికి రూ.10 వేలకోట్లు కేటాయించడం పట్ల హైదరాబాద్ అభివృద్ధికి పెద్ద పీట వేశారన్నారు.

## బడ్జెట్‌లో కోత

### గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్యనాయక్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో గిరిజనులకు కోత విధించారని గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్యనాయక్ పేర్కొన్నారు. ప్రతి తండా గ్రామపంచాయతీకి రూ.కోటి కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివాసి గిరిజనులకు సంపూర్ణమైనటువంటి బడ్జెట్ ను కేటాయించలేదు పాత పద్ధతినే అవలంబించిందన్నారు. ఆదివాసి గిరిజనులకు జనాభా నిష్పత్తి ప్రకారం రూ. 29.119 కోట్లు ఆదివాసి గిరిజనులకు చెందాల్సి ఉందన్నారు. కానీ కేటాయింపుల్లో ఎస్టీ, ఎస్డిఎఫ్ కింద 17.05 కోట్లు మాత్రమే ప్రతిపాదించారని, 500 జనాభా కలిగిన తండాల పంచాయతీలను రెవెన్యూ పంచాయతీల హోదా కల్పిస్తామని ఆర్థిక మంత్రి ప్రసంగంలో పొందుపరచలేదన్నారు. ఇంటిగ్రేటెడ్ గురుకులాల్లో ఒకే దగ్గర ఏర్పాటు చేయడం ప్రభుత్వానికి అభినందనలు కానీ అందులో విద్యార్థుల డిమాండ్ ఉన్నందున సీట్ల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు.

## వర్షాలతో అస్తవ్యస్తమైన జనజీవనం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అకాల వర్షాల కారణంగా జనజీవనం అస్తవ్యస్తమైందని టిడిపి నాయకుడు పి.సాయిబాబా అన్నారు. దోమల్‌గూడ నగర పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వర్షాలతో కష్టాలు పడుతున్న ప్రజలను ఆదుకోవాల్సిన ప్రభుత్వం బాధ్యతను విస్మరించిందన్నారు. చాలా ప్రాంతాలు వరద నీటితో పాటు మురుగునీరుతో ముంపునకు గురవుతున్నాయన్నారు. నగరంలో చాలాచోట్ల చెట్లు కూలిపోవడంతో విద్యుత్‌ను పునరుద్ధరించడం లేదన్నారు. ఇలాంటి పరిస్థితులతో తక్షణం సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోవడం లేదన్నారు. వర్షాలతో కాలుష్యంతో కూడిన సరఫరా అవుతుండటంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. ఏ ఆస్పత్రి చూసిన రోగులతో కిక్కిరిసిపోతున్నాయన్నారు. వ్యాధుల బారిన ప్రజలు పడుతుంటే ఆదుకోవాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తుందన్నారు. ఆరోగ్యశాఖ ప్రజారోగ్యం గురించి పట్టించుకోవడం లేదన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రభుత్వ యంత్రాంగం కదిలి, ప్రజల సమస్యలు పరిష్కరించాలని సాయిబాబా కోరారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజు గౌడ్, ఎస్. ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## రోగాల నివారణకు వ్యాక్సిన్

### కార్పొరేటర్ లచ్చిరెడ్డి



**ప్రజాపక్షం/వనస్థలిపురం :** విద్యార్థులు రోగాలకు గురికాకుండా ఉండడానికి ప్రభుత్వం అందిస్తున్న జపనీస్ ఎన్కెఫలైటిస్ టీకాలు తీసుకోవాలని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. గురువారం డివిజన్‌లోని సాహెబ్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన వ్యాక్సిన్ టీకాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీకాలు తీసుకోవడం ద్వారా డెంగ్యూ, ఎల్లో ఫీవర్, వెస్ట్ వైరస్ సోకకుండా ఉంటుదన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మౌనిక, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు దినేష్, రాధకృష్ణరెడ్డి, రాజ్‌కుమార్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యానికి టీకా తప్పనిసరి

### మండల వైద్యాధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి



**ప్రజాపక్షం/యాచారం :** చిన్నారుల ఆరోగ్యానికి తప్పకుండా వ్యాక్సిన్ వేయించాలని మండల మండల వైద్యాధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి అన్నారు. గురువారం యాచారం మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో, సాంఘింక సంక్షేమ గురుకుల పాఠశాల్లో అంగన్ వాడి కేంద్రాల్లో వ్యాక్సిన్ వేయడం జరిగింది. ఈ సంధర్భంగా డాక్టర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ మొదడు వాపు టీకాను తెలంగాణ ప్రభుత్వం ఈనెల 25 నుండి ఆగస్టు వరకు మండలంలోని అన్నిప్రభుత్వ పాఠశాలల్లో, హాస్టల్స్‌లో, అంగన్‌వాడి కేంద్రాల్లో వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అసుపత్రి సూపర్‌వైజర్స్, ఎఎన్ఎంలు, అశావర్కర్లు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



**ప్రజాపక్షం/నార్సింగి :** నెక్నాంపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలను ఉచితంగా మణికొండ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జితేందర్ మున్సిపల్ చైర్మన్ కస్తూరి గురువారం అందజేశారు. కార్యక్రమానికి మణికొండ మున్సిపాలిటీ చైర్మన్ కస్తూరి నరేందర్ హాజరయ్యారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పురుషోత్తం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నరేష్, ముత్యాలు, కిరణ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు అహమద్ షా ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

# మహాభాగ్యం

## గ్రేటర్ హైదరాబాద్‌కు బడ్జెట్‌లో వరాల జల్లు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర రాజధాని నగరం గ్రేటర్ హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించినట్లుగానే ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్‌లో అగ్రతాంబులం ఇచ్చారు. రాష్ట్రానికి గ్రేటర్ హైదరాబాద్ నగరం నుంచి 60 శాతం ఆదాయం అందుతోంది. అంతపెద్ద మొత్తంలో ఆదాయం సమకూరుస్తున్న హైదరాబాద్‌కు గతంలో ప్రభుత్వాలు కేటాయింపులు జరపలేదు. కేటాయింపులు జరిపినా అరకొరగానే నిధుల విడుదల ఉండేది. అందుకు భిన్నంగా కాంగ్రెస్ ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధికి గతంలో ఎప్పుడూ లేనివిధంగా రూ.10 వేల కోట్లు కేటాయింపులు జరిపింది. నగర పౌరులకు కనీస మౌలిక సౌకర్యాలు కల్పించే జిహెచ్‌ఎంసి, జలమండలి అత్యంత ప్రముఖ్యత కల్పించారు. కాలుష్య కాసారంగా మారిన మూసీ ప్రక్షాళనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇచ్చింది. మూసీకి మహర్ధశ కల్పించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్న ప్రభుత్వం అందుకు అనుగుణంగా బడ్జెట్‌లో సముచిత స్థానం కల్పించింది. రవాణా రంగంలో నగర పౌరుల మన్నలు అందుకున్న మెట్రోరైల్ విస్తరణకు కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. అసంపూర్తిగా మిగిలిన పాతబస్తీ మెట్రో మార్గాన్ని పూర్తి చేయడంతో పాటు కొత్త నగరంలోని ఉప్పల్, నాగోల్, చాంద్రాయగుట్ట నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు మెట్రోరైల్ నిర్మాణానికి బడ్జెట్‌లో గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇక విపత్తుల నిర్వహణకు హైడ్రాను ఏర్పాటు చేసిన ప్రభుత్వం ఈ విభాగానికి కూడా నిధులు కేటాయించింది. ఔటర్‌రింగ్ రోడ్డు పరిధిలో హైడ్రా విపత్తుల నిర్వహణతో పాటు ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు పనిచేయనుంది. హెచ్‌ఎండిఏ పరిధిలో మౌలిక సౌకర్యాల కల్పనకు సైతం ప్రభుత్వం దృష్టిసారించింది. హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగంలో అన్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న చారిత్రాత్మక నగరం హైదరాబాద్‌ను మరింత ప్రణాళికబద్ధంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.

### గ్రేటర్ హైదరాబాద్ హైలెట్స్..

- ☞ హైదరాబాద్‌లో ఉద్యోగ, ఉపాధి పొందుతున్నవారికి కార్యాలయాలకు దగ్గరగా, శాటిలైట్ టౌన్‌షిప్‌ల నిర్మాణాన్ని నగరం చుట్టూ ప్రోత్సహిస్తాం. ఈ టౌన్‌షిప్‌లలో సరసమైన ధరల్లో పేద, మధ్యతరగతి వారికి అనకూలమైన నివాసగృహాల నిర్మాణాలను అందించేలా కృషి చేస్తాం అన్నారు.



- ☞ ప్రస్తుతం మూడు ట్రాఫిక్ కారిడార్లలో మెట్రో సౌకర్యం ఉంది. వివిధ వర్గాల అవసరాలను తీర్చడంతో పాటు నగరంలో అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో ప్రభుత్వం 78.4 కి.మీ. పొడవున్న 5 అదనపు కారిడార్లను రూ.24,042 కోట్లతో అభివృద్ధి పరుస్తుంది. ఇందులో భాగంగా మెట్రో రైలును పాతనగరానికి పొడిగించి, దానిని శంషాబాద్ విమానాశ్రయానికి అనుసంధానం.
- ☞ ప్రస్తుతమున్న కారిడార్లను నాగోలు నుంచి ఎల్.బి.నగర్ వరకు విస్తరిస్తాం. నాగోల్, ఎల్.బి.నగర్, చాంద్రాయణగుట్ట స్టేషన్‌లను ఇంటర్ ఛేంజ్ స్టేషన్‌లుగా అభివృద్ధి చేస్తాం. మియాపూర్ నుంచి పటాన్ చెరు వరకు, ఎల్.బి.నగర్ నుంచి హయత్ నగర్ వరకు మెట్రో రైలు సౌకర్యాన్ని పొడిగించాలని కూడా ప్రణాళిక సిద్ధం.
- ☞ హైదరాబాద్, ఔటర్ రింగ్ రోడ్డు వరకు గల ప్రాంతాలను కోర్ అర్బన్ రీజియన్‌గా గుర్తించి, వాటి అభివృద్ధికి ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందించడం. ఔటర్‌రింగ్‌రోడ్డును నగర సరిహద్దుగా పరిగణిస్తాం.
- ☞ ఓఆర్ఆర్ పరిధిలో విపత్తుల నిర్వహణకు ఒక ఏకీకృత సంస్థ ఏర్పాటు. జిహెచ్‌ఎంసి సహా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాలు దీని పరిధిలోకి వస్తాయి.
- ☞ పట్టణ విపత్తులను నివారించడానికి, వాటిని ఎదుర్కొవడానికి తీసుకోవాల్సిన చర్యలను చేపట్టడంతో పాటు, ఎటువంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొని తక్షణ రక్షణ చర్యలు తీసుకునే విషయంలో జాతీయ, రాష్ట్రేతర సంస్థలతో సమన్వయం, ఈ వ్యవహారాలను పర్యవేక్షించే బాధ్యత హైదరాబాద్ విపత్తు నివారణ, ఆస్తుల పరిరక్షణ సంస్థ(హైడ్రా) చేస్తుంది. ఈ సంస్థలో ఆస్తుల పరిరక్షణకు, విపత్తుల నిర్వహణకు ప్రత్యేక విభాగాలు.
- ☞ మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా సుమారు 110 చదరపు కి.మీ. పట్టణ ప్రాంతం పునరుజ్జీవనం. నదీ తీర ప్రాంతంలో కొత్త వాణిజ్య, నివాస కేంద్రాలు, పాత హెరిటేజ్ ప్రాంతాలకు కొత్త సొబగులు.
- ☞ మూసీ నదీ పరివహక ప్రాంత అభివృద్ధి ప్రాజెక్టులో రిక్రియేషన్ జోన్‌లు, పాదచారుల జోన్‌లు, పీపుల్స్ ప్లాజాలు, చిల్డ్రన్స్ థీమ్ పార్కులు, ఎంటర్‌టైన్‌మెంట్ జోన్‌ల అభివృద్ధి, లండన్ నగరంలో ఉన్న థేమ్స్ నదీ పరివహక అభివృద్ధి తరహాలో మూసీ అభివృద్ధి.
- ☞ హైదరాబాద్ నగరాభివృద్ధి, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు రూ.1,500 కోట్లు.
- ☞ జిహెచ్‌ఎంసి సేవలను ప్రజలకు మరింత మెరుగ్గా అందించేందుకు జిహెచ్‌ఎంసి పరిధిలో మౌలిక వసతుల కల్పనకు రూ.3,065 కోట్లు.
- ☞ హెచ్‌ఎండిఏ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు రూ.500 కోట్లు.
- ☞ జలమండలికి రూ.3,385 కోట్లు.
- ☞ ఎయిర్‌పోర్టు వరకు మెట్రో విస్తరణకు రూ.100 కోట్లు.
- ☞ హైదరాబాద్ మెట్రోరైల్ ప్రాజెక్టుకి రూ.500 కోట్లు,
- ☞ పాత నగరానికి మెట్రో విస్తరణకి రూ.500 కోట్లు.
- ☞ మల్టీ మోడల్ సబర్బన్ రైలు ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ కోసం రూ.50 కోట్లు.
- ☞ ఔటర్ రింగ్ రోడ్డు కోసం రూ.200 కోట్లు.
- ☞ రీజనల్ రింగ్ రోడ్(ట్రిబుల్ ఆర్)తో అభివృద్ధి మరింత వేగవంతం. ఉత్తర ప్రాంతంలోని 158.6 కి.మీ. పొడవున్న సంగారెడ్డి, తూప్రాన్, గజ్వేల్, చౌటుప్పల్ రోడ్డును, దక్షిణ ప్రాంతంలోని 189 కి.మీ.ల పొడవున్న చౌటుప్పల్, షాద్‌నగర్, సంగారెడ్డి రోడ్డును, జాతీయరహదారులుగా ప్రకటించడానికి వీలుగా అప్ గ్రేడ్ చేయాలని ప్రభుత్వం ప్రతిపాదన. రీజనల్ రింగు రోడ్డు హైదరాబాద్ నగర ఉత్తర, దక్షిణ ప్రాంతాలను, తూర్పు, పశ్చిమ ప్రాంతాలను కలుపుతూ జాతీయరహదారి నెట్‌వర్క్‌తో అనుసంధానం.
- ☞ ఎక్స్‌ప్రెస్‌వే ప్రమాణాలను దృష్టిలో ఉంచుకొని దీని నిర్మాణానికి తగినంత భూమిని సేకరించే ప్రయత్నం. ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా తొలుత నాలుగు లేన్‌లతో నిర్మించి, దానిని ఎనిమిది లేన్‌ల సామర్థ్యానికి విస్తరణ. ప్రాథమిక అంచనాల ప్రకారం ట్రిబుల్ ఆర్ ఉత్తర ప్రాంత అభివృద్ధికి రూ.13,522 కోట్లు. దక్షిణ ప్రాంతాభివృద్ధికి రూ.12,980 కోట్లు ఖర్చు. దీనికోసం బడ్జెట్‌లో ప్రస్తుతం రూ.1522 కోట్ల ప్రతిపాదించారు.

## స్వార్థ ప్రయోజనాలకు విలువలు దిగజార్చొద్దు

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** సమాజంలో మీడియాకు ఎంతో విలువ ఉందని, స్వార్థ ప్రయోజనాల కోసం విలువలను దిగజార్చే యత్నం చేసుకోవద్దని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. గురువారం షాద్‌నగర్‌లో జర్నలిస్టులతో సమావేశాన్ని నిర్వహించారు. యూనియన్లకు అతీతంగా నూతనంగా వేసిన కమిటీ సభ్యులను అభినంధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మీడియాకు ప్రభుత్వం అండగా ఉంటుందని, సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తుందని వివరించారు.

### తెలంగాణపై వివక్ష చూపిస్తున్న కేంద్రం

పన్నుల రూపంలో కేంద్ర ప్రభుత్వానికి లక్ష కోట్లు చెల్లిస్తే వార్షిక బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం దురదృష్టకరమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించి మాట్లాడుతూ కేంద్ర మంత్రులుగా ఉన్న బిజెపి నేతలు కేంద్రపెద్దలను ఒప్పించి నిధులు తేవాలని డిమాండ్ చేశారు.

### సాంకేతిక సమస్యలపై అధికారులు దృష్టి సారించండి

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రుణమాఫీని పూర్తి స్థాయిలో అమలు అయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే





శంకర్ సూచించారు. గురువారం వివిధ బ్యాంక్ అధికారులతోపాటు వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అర్హులైన అన్నదాతలకు రుణమాఫీ చేయాలని, సాంకేతిక సమస్యలు ఎక్కడ ఉన్నాయో గుర్తించి వాటిని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ ఎడిఏ రాజారత్నం మాట్లాడుతూ రుణమాఫీ కాని రైతులు మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఖాతా నెంబర్‌కు ముందు 0 లేని కారణంగా 546 మంది రైతులకు రుణ మాఫీ కాలేదని వివరించారు. ఈ సమస్యలను త్వరగా పరిష్కరించి అన్నదాతలకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

### మెరుగైన వైద్యం అందించాలి

వైద్యాన్ని వ్యాపారం చేయకుండా రోగాన్ని గుర్తించి మెరుగైన వైద్యం అందించి ప్రాణాలను కాపాడేందుకు వైద్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. గురువారం పట్టణంలోని బిఆర్‌కే న్యూస్ గ్రూప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నావి మల్టీ స్పెషాలిటి ప్రైవేట్ ఆసుపత్రిని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ నిరుపేదల ప్రాణాలను రక్షించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బిఆర్‌కే గ్రూప్ చైర్మెన్ బొల్లా శివరామకృష్ణ, డైరెక్టర్ పృధ్వీకుమార్, మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్, మున్సిపల్ చైర్మన్ నరేందర్, కౌన్సిలర్ చెట్ల పావని నర్సింలు, నేతలు అందె మోహన్, సుదర్శన్ గౌడ్, కొమ్ము కృష్ణ, లింగారెడ్డిగూడ అశోక్ ఉన్నారు.

## కమిషనర్‌పై కలెక్టర్‌కు మేయర్, డిప్యూటీ మేయర్ ఫిర్యాదు



**ప్రజాపక్షం/రాజేంద్ర నగర్ :** బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రారంభోత్సవాల కోసం కౌన్సిల్ సమావేశాన్ని కమిషనర్ వాయిదా వేసిన అంశాన్ని, ప్రశ్నిస్తే పొంతన లేని సమాధాలతో దాట వేస్తున్నారని మేయర్ లతాప్రేమ్ గౌడ్ అన్నారు. గురువారం మేయర్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌గౌడ్, పలువురు కార్పొరేటర్లతో కలిసి రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు కమిషనర్‌పై ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా మేయర్ లతాప్రేమ్ గౌడ్ మాట్లాడుతూ వీధీ దీపాల సమస్య పరిష్కారానికి అత్యవసరంగా ఈనెల 25న కౌన్సిల్ మీటింగ్, ఆతర్వాత శంకుస్థాపనలు చేసేందుకు ఎజెండా సిద్దంమైందన్నారు. కాని సాయంత్రం అయిన కార్పొరేటర్లకు ఏలాంటి ఏజెండా రాక పోవటంతో కమిషనర్‌ను ఫోన్‌లో సంప్రదించగా పొంతన లేని సమాధానమిచ్చారన్నారు. కార్పొరేషన్ నిధులతో జరిగిన శంకుస్థాపన కార్యక్రమాలకు మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు లేకుండానే ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌తో చేయించారన్నారు. ఈ విషయంపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాని కలెక్టర్‌కు, అదనపు కలెక్టర్, సిడిఎంఏకు ఫిర్యాదు చేశామన్నారు.

## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



**ప్రజాపక్షం/రాజేంద్ర నగర్ :** బండ్లగూడ జాగీర్ మున్సిఫల్ కార్పొరేషన్ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ శంకుస్థాపన చేశారు. తిరుమల హిల్స్, ఇందిరమ్మ కాలనీ, శ్రీనివాస నగర్ కాలనీ, వినాయక నగర్, ఓల్డ్ విలేజ్ దర్గా ప్రాంతాల్లో సీసీ రోడ్లు,అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు కమిషనర్ బి.శరత్‌చంద్రతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు బిజేఎంసీ అధికారులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## చిన్నారులకు టీకా వేయించాలి

### డిఎంహెచ్ఒ వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/రాజేంద్ర నగర్ :** 9 నెలల నుంచి 15సం.రాలు లోపు చిన్నారులకు తప్పని సరిగా మెదడు వాపు నివారణ వాక్సినేషన్ వేయించాలని రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి డాక్టర్. వెంకటేశ్వర్లు అన్నారు. ఈనెల 25వ తేదీ నుంచి ఆగస్టు 15 వరకు చిన్నారులందరికి మెదడు వాపు నుంచి కాపాడుకునేందుకుగాను జపనీస్ ఎన్సెఫాలిటిస్ ఇంజక్షన్ వేసే కార్యక్రమంలో భాగంగా నార్సింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని హైదర్‌షా కోట్ ఆరోగ్య ఉపకేంద్రం ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వాక్సినేషన్ కార్యక్రమం జరిగింది. డాక్టర్ వెంకటేశ్వర్లు, నార్సింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సత్య రత్న, సిహెచ్‌వో కొండా విమలతో కలిసి చిన్నారులకు వాక్సినేషన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలతోనే మెదడు వాపు వ్యాధి సోకుకుందని దోమల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. మెదడు వ్యాపు వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్త చర్యగా ప్రతి ఒక్కరు జపనీస్ ఎన్సెఫాలిటిస్ వాక్సినేషన్ చేయించుకోవాలన్నారు. ఈజపనీస్ ఎన్సెఫాలిటిస్ ఇంజక్షన్ చేయించుకున్న చిన్నారులకు 90శాత ప్రభావంతంగా ఉంటుందన్నారు. ఈవ్యాధి తెలికపాటిదని అరుదుగా ఆకస్మి తలనొప్పి, అధిక జ్వరం, మెడ దృఢత్వం, వికారం, మూర్ఛలు(పిల్లలలో) వంటి లక్షణాల కనిపిస్తాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈవోలు శ్రీనివాస్, సాల్మాన్‌రాజ్, ఎంపిహెచ్‌ఏ(ఎఫ్) టీ. అమృత, మంజుల, పాఠశాల హెచ్‌ఎం నర్సింహా నాయక్, టీచర్ రాజ్యలక్ష్మి, సరిత, ఆర్.శ్రీలత, కరుణశ్రీ, ఆశ వర్కర్లు అరుణ, రమ, భాగ్య, అంబికా తదితరులు పాల్గొన్నారు.

## పాపిరెడ్డిగూడలో పోచమ్మ బోనాలు

**ప్రజాపక్షం/కేశంపేట:** కేశంపేట మండలం పాపిరెడ్డిగూడలో గురువారం ప్రజలు ఘనంగా పోచమ్మ దేవతకు బోనాల పండుగను నిర్వహించారు. గ్రామంలోని మహిళలు, భక్తులు భక్తిశ్రద్ధలతో బోనాలను తయారు చేసి డప్పులు, బ్యాండు మేళాలతో బోనాలను పోచమ్మ దేవాలయానికి తరలించి దేవతకు బోనాలను సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్‌రెడ్డి, లక్ష్మి నారాయణ, సుందరయ్య, భక్తులు ప్రజలు పాల్గొన్నారు.

## ప్రతి శాఖలో ఈ–ఆఫీసు కార్యకలాపాలు

### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** ప్రతి శాఖలో ఈఆఫీసు ద్వారా కార్యకలాపాలు చేపట్టాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక గురువారం జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ శశాంక ఈఆఫీసు నిర్వహణపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులందరూ ఫైళ్లన్ని ఈ ఆఫీస్ ద్వారానే పంపాలని కలెక్టర్ తెలిపారు. ఈ ఆఫీస్ ద్వారా ఫైళ్లన్ని పంపేందుకు ప్రతి ఒక్క శాఖ అలవాటు చేసుకోవాలని, అవసరమైన కంప్యూటర్ పరిజ్ఞానాన్ని ఏర్పరుచుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు ప్రతిమసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### మున్సిపల్ అధికారులు ఫీల్డ్ విజిట్ చేయాలి

పారిశుద్ధం, సీజనల్ వ్యాధులు, వనమహోత్సవం, వీధి కుక్కలకు శస్త్ర చికిత్సలు,మున్సిపల్ పరిధిలో అసంపూర్తిగా మిగిలిన వివిధ పనులపై మున్సిపల్ కమిషనర్‌లతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మున్సిపల్ కమిషనర్ ఉదయం 7 గంటలకు ఫీల్డ్ విజిట్ లో ఉండి, శానిటరీ సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆదేశించారు. వర్షాలకు జిల్లాలోని మున్సిపల్ పరిధిలో ఎలాంటి ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరుగకుండా, లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. తాగునీరు కలుషితమై సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఫ్లోరింగ్, ఫ్లోరైడ్ శాతాన్ని పెంచాలన్నారు. డెంగ్యూ, మలేరియా వ్యాధులు గుర్తించినట్లతే అధికారులు ఆ ప్రాంతాలను సందర్శించి వ్యాధులు రాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కాలనీలల్లో వీధి కుక్కల బెడద లేకుండా రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా వివిధ ఏజెన్సీలతో ఒప్పందం చేసుకోవాలన్నారు. జిల్లాలో మహిళలు మహిళా శక్తి ద్వారా ఆర్థికంగా బలోపేతం కావడానికి, మహిళలకు ఆసక్తికరమైన రంగాన్ని గుర్తించి ఎంపిక చేయాలని సూచించారు. వనమహోవత్సంలో కాలనీవాసులను భాగస్వాములు చేసి, ప్రతి ఇంటికి మొక్కల పంపిణి చేపట్టాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## విద్యార్థినిలు కష్టపడి చదవాలి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వడ్డెమాన్ ను జిల్లా కలెక్టర్ బి.విజయేందిర బోయి సందర్శించారు. విద్యార్థినిలు కష్టపడి చదవాలని, కష్టపడి చదివితేనే ఉన్నత విద్య నభ్యసించి ఆసక్తి ఉన్న రంగంలో జీవితంలో స్థిరపడాలని జిల్లా కలెక్టర్ బి.విజయేందిర బోయి అన్నారు. జిల్లా కలెక్టర్ వడ్డేమాన్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి, ప్రస్తుతం అడ్మిషన్‌ల గురించి అడిగే తెలుసుకుని మొత్తం అడ్మిషన్లు 260 వరకు విద్యార్థులు ఉంటారు. ఒక పదో తరగతిలో తెలుగు, ఇంగ్లీష్ మీడియం కలిసి 62 మెంబర్స్ ఉంటారు. 10వ తరగతి గదులను సందర్శించి విద్యార్థిని విద్యార్థులతో జిల్లా కలెక్టర్ సంభాషించారు. విద్యార్థిని విద్యార్థులతో మాట్లాడి బాగా చదివి నూరు శాతం ఫలితాలు సాధించాలని కోరారు. కష్టపడి చదివితే మంచి విజయాన్ని సాధించావచ్చు. తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించి బలవంతకమైన పోషక ఆహారం తీసుకోవాలని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల గురించి పనులు పూర్తయ్యావని వాటిని తెలుసుకున్నారు.



## బిజెవైఎం నాయకుల ముందస్తు అరెస్టు

**ప్రజాపక్షం/బాలానగర్ :** ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడి చేపట్టిన బీజేవైఎం నాయకులను బాలనగర్ పోలీసులు ముందస్తు అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు . బీజేవైఎం నాయకులను ముందస్తు అరెస్టులు ప్రభుత్వం చేయిస్తుందని మండిపడ్డారు బీజేవైఎం నాయకులు జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేయకపోతే ఉద్యమాన్ని ఇంకా తీవ్రద చేస్తామని హెచ్చరించారు .జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుంటే అసెంబ్లీనీ ముట్టడిస్థామని ,నిరుద్యోగులకు అండగా మేము ఉంటామన్నారు .పెండిగ్లో ఉన్నా స్కాలర్షిప్ రియంబరెన్సట్ 6,500 కోట్లు విడుదల చేయాలని గ్రూప్ 1లో 1:100 క్వాలిపై చేయాలని పేర్కొన్నారు .అరెస్ట్ అయిన వారిలో బీజేవైఎం బాలానగర్ మండల అధ్యక్షులు కుమార్ నాయక్, బీజేవైఎం సీనియర్ నాయకులు వేణు ,బీజేవైఎం ఉపాధ్యక్షులు తరుణ్,నందు,బీజేవైఎం మండల సెక్రటరీలు సాయికుమార్ ,వెంకటేష్ ,బిజెపి వీరన్న పల్లి సెక్రటరీ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు .

## ఆర్భాటానికే పరిమితమైన బడ్జెట్

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.బాల్‌నర్సింహ్మా

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : అసెంబ్లీలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థికశాఖమంత్రి భట్టివిక్రమార్క గురువారం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ ఆర్భాటానికే పరిమితమైందని సిపిఐజిల్లా కార్యదర్శి ఎం.బాల్‌నర్సింహ్మా ఆరోపించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరుగ్యారంటీలను విస్మరించడంతోపాటు నిరుద్యోగభృతి, జాబ్‌క్యాలెండర్ ఊసేలేదని ఆయన విమర్శించారు. బడ్జెట్‌లో పాలమూరు రంగారెడ్డి కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టులకు కేటాయించిన నిధులు పాతబకాయిలకే సరిపోతాయని సంపూర్ణంగా పూర్తిచేసేందుకు నిధులు కేటాయించకపోవడం దురదృష్టకరమన్నారు. బడ్జెట్ విధానం హైదరాబాద్ నగరం చుట్టూ అభివృద్ధికి ప్రాధాన్యతఇస్తూ గ్రామీణ ప్రాంతాలను విస్మరించారని , బడ్జెట్ మొత్తంగా ప్రచార ఆర్భాటంతోకూడిన బడ్జెట్‌తప్ప వాస్తవానికి ప్రజాభివృద్ధికి ఉపయోగపడేవిధంగా లేదన్నారు.

## టెండర్ ప్రక్రియ వాయిదా



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** జిల్లాలోని కస్తూర్బా బాలికల విద్యాలయాల , అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌కు ఈవిద్యా సంవత్సరానికి సంబంధించిన వివిధ సరుకుల సరఫరాకోసం ఈనెల26న నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు ఆధ్వర్యంలో నిర్వహించనున్న టెండర్లనుతెరిచే ప్రక్రియ వాయిదావేసినట్లు జిల్లా విద్యాశాఖఅధికారి గోవిందరాజులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 20కేజిబివిలకు, ఒక అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలకు 202425 సంవత్సరానికి సరుకులు, పండ్లు, కూరగాయలు , గుడ్లను పంపిణీ చేసేందుకు టెండర్‌దాఖలు చేసిన టెండర్‌దారులు, కేజిబివి ప్రత్యేకాధికారులు ఇట్టి విషయాన్ని గమనించాలని ఆయన తెలిపారు. టెండర్లను తెరిచే తదుపరితేదిని తర్వాత ప్రకటించనున్నట్లు తెలిపారు.



## ఉచితకంటివైద్య శిబిరం

**ప్రజాపక్షం/వెల్దండ :** ఐక్యత ఫౌండేషన్ శంకరనేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో కంటివైద్య శిబిరం 8రోజులుగా కొనసాగుతుంది. గురువారం ఈకంటి వైద్యశిబిరంలో 30మంది కంటిరోగులకు శుక్లాలు తొలగించారు. కార్యక్రమానికి ఐక్యతఫౌండేషన్ చైర్మన్ సింగిరెడ్డి రాఘవేందర్ రెడ్డి దగ్గరుండి రోగులకు వారికి సంబంధించిన సర్జరీలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రాంత నిరుపేదలను దృష్టిలో ఉంచుకొని ఈఉచిత కంటివైద్యశిబిరం ఏర్పాటుచేయడం జరిగిందని దాదాపు 1900లమందికి పైగా రోగులకు కంటిపరీక్షలు నిర్వహించామని, ఇప్పటివరకు ఈఉచిత కంటివైద్యశిబిరంలో 136మంది రోగులకు శుక్లాల సర్జరీచేస్తున్నామని, 1100వందలకుపైగా కంటి అద్దాలు పంపిణీ చేశామన్నారు. వీరితోపాటు 200లమంది రోగులకు చెన్నై శంకరనేత్రాలయ బేస్ ఆస్పత్రికి రిఫర్‌చేయడం జరుగుతుందని తెలిపారు. రేపటితో ముగియనున్న ఈకంటి వైద్యశిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అనిల్ గౌడ్, సీనియర్ నాయకులు ఫౌండేషన్ సభ్యులు రచ్చశ్రీరాములు, నరేందర్‌గౌడ్, మల్లయ్య, రమేష్‌నాయక్, కొండల్, గణేష్, హస్సన్, మల్లేష్, శ్రీపతి, శేఖర్, శ్రీను, కల్యాణ్, మహేష్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** ప్రభుత్వ ఆస్పత్రులకు పలురకాల రోగాలతోవచ్చే ప్రజలకు ఎల్లవేళల అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలను అందించాలని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ వైద్యులను ఆదేశించారు. గురువారం పట్టణంలో 50పడకల ప్రభుత్వసామాజిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. ఆరోగ్యకేంద్రంలో మొత్తం ఎంతమంది వైద్యులున్నారు, విధులకు హాజరైన సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు ఎంతమంది రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాంను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్, రాజీవ్ ఆరోగ్యశ్రీసెంటర్ డయాలసిస్ సెంటర్, ఓపి, అత్యవసర వైద్యవిభాగాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలోని బ్లడ్‌బ్యాంకును సందర్శించి రక్తనిల్వల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎల్లప్పుడు ఆస్పత్రిలో అన్నిరకాల రక్తనిల్వలను ఉంచుకోవాలని ఆదేశించారు. పాముకాటుతో ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న వెల్దండ మండలం కోనేటివారితండాకుచెందిన లోక్యానాయక్ , జ్వరంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తిమ్మాయిపల్లికి చెందిన సాయిలకు , వివిధరోగాలతో చికిత్సపొందుతున్న పలువురు రోగులను కలెక్టర్ చికిత్సఅందుతున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈసీజన్‌లో డెంగీ, మలేరియావంటి జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున అంటువ్యాధులు ప్రబలే గ్రామాల్లో అత్యవసర వైద్యసేవలు నిర్వహించి పరిస్థితులు సాధారణస్థితికివచ్చేవిధంగా వైద్యాధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీద్వారా ఇప్పటివరకు ఎంతమందికి వైద్యసహాయం అందించారని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ఏమైన సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలని సిబ్బందికి సూచించారు. కలెక్టర్‌వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ శివరాం, డాక్టర్లు అన్నపూర్ణ, స్వర్ణలత, రోహిత్ ఉన్నారు.

# బడ్జెట్‌లో రైతుల భవిష్యత్తుకు అడుగులు

**ప్రజాపక్షం / కొత్తకోట :** రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో గురువారం ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతాంగానికి భవిష్యత్తుకు అడుగులు వేసే విధంగా అభివృద్ధికి తోడ్పాటు అందించే విధంగా ఉందని కిసాన్ కాంగ్రెస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024/ 25 ఆర్థిక వార్షిక బడ్జెట్ 2,91,159 లక్షల కోట్ల బడ్జెట్‌లో వ్యవసాయ శాఖకు 72,659 కోట్లు , ఉద్యానవనం రూ. 737 కోట్లు, సాగునీటి రంగానికి రూ. 26వేల కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ. 1,980 కోట్లు, నీటిపారుదల శాఖకు రూ. 22,301 కొట్లు కేటాయించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేసి రైతు సంక్షేమానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కట్టుబడి రాష్ట్రంలో చివరి రైతు వరకు సంక్షేమ ఫలాలు అందలనేదే ప్రభుత్వ లక్ష్యమని తెలియజేస్తున్నారు. ప్రతిపాదిత బడ్జెట్‌లో సింహ భాగం వ్యవసాయ రంగానికి కేటాయించడం ఇది రైతుల తలరాతలు మార్చే ఒక చారిత్రాత్మకమైన ఈ వ్యవసాయ బడ్జెట్‌తో ఇది రైతు ప్రభుత్వంని రూపితమైందని బడ్జెట్‌తో మరోసారి రుజువైందని పేర్కొంటున్నారరు. పైసా ఖర్చు లేకుండా రైతు పంట భద్రతకు పంటలు బీమా పథకం ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి రైతులను ఆదుకుంటుందని ఈ బడ్జెట్‌లో ప్రవేశపెట్టడం




సంతోషదాయకమని తెలియజేస్తున్నారు. ఆర్థిక భద్రత కరువై పని దొరకని రోజుల్లో రైతు కూలీలు పస్తులు ఉండకుండా వారందరిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం బడ్జెట్‌లో భూమిలేని రైతు కూలీలకు సంవత్సరానికి రూ. 12వేలు అందిస్తామని బడ్జెట్‌లో పేర్కొనడం చాలా సంతోషం వ్యక్తం చేస్తూ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మేస్త్రీ శ్రీనివాసులు, మండల కాంగ్రెస్ ప్రచార కార్యదర్శి పి. మోహన్‌రెడ్డి, పట్టణ కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంగు బాల్ రెడ్డి, ఎన్ఎస్‌యూఐ మండల శాఖ అధ్యక్షుడు దిలీప్ కుమార్ రెడ్డి పాల్గొని రాష్ట్ర ప్రభుత్వానికి కిసాన్ కాంగ్రెస్ తరఫున కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నారు.

# విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** కొత్త చట్టాలపై ఎప్పటికప్పుడు అవగాహన కలిగి ఉండాలని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి అన్నారు. గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహంలో విద్యార్థులకు కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ సాధికారిక కేంద్ర బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి జిల్లా బీసీ అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు దృష్టిలో ఉంచుకొని ఇటీవల కేంద్ర ప్రభుత్వం మూడు కొత్త చట్టాలను తీసుకు వచ్చిందని వివరించారు. న్యాయ నిపుణులు, మేధావులు, విద్యావంతులు, యువత, విద్యార్థులకు కొత్త చట్టాలపై అవగాహన కల్పిస్తున్నారని ముఖ్యంగా విద్యార్థులు కొత్త చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. బాలికలపై జరుగుతున్న అగత్యాలకు సంబంధించి ఫోక్స్ యాక్ట్ 2012 , షోషో యాక్ట్ 2013 చట్టాల గురించి విద్యార్థులకు పూర్తి అవగాహన కలిగించారు. అపరిచత వ్యక్తులతో మాట్లాడటం కాని ఫోన్‌లో చాటింగ్ చేయడం లాంటివి చేయవద్దని అన్నారు. సైబర్ నేరాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు జరిగితే సంబంధించిన హెల్ప్ లైన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. అంతకు ముందు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పీర్ల గుట్ట మెడికల్ ఆఫీసర్ డా. వైష్ణవి ఆధ్వర్యంలో వసతి గృహంలో విద్యార్థులకు మెడికల్ క్యాంపు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డా. వైష్ణవి, వసతి గృహ సంక్షేమ అధికారి జీవిత , మెడికల్ సిబ్బంది, వసతి గృహ సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## పకడ్బందీ ఏర్పాట్లు చేశాం

జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్

**ప్రజాపక్షం/కల్వకుర్తి/వెల్దండ :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన దృష్ట్యా ఏర్పాట్లు, భద్రత ఏర్పాట్లు త్వరితగతిన పూర్తిచేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం వెల్దండ మండలపరిధిలోని కొట్రచౌరస్తావద్ద విగ్రహ పరిసరాలను పూలమొక్కలతో సుందరీకరించాలని అదేవిధంగా పనులను వేగంగా పూర్తిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం కల్వకుర్తి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంవద్ద నిర్వహించే బహిరంగప్రదేశాన్ని కలెక్టర్ పరిశీలించారు. విఐపి గ్యాలరీ, ముఖ్యమంత్రి సభాస్థలం, ప్రజలకుకావాల్సిన ఏర్పాట్లు తదితర అంశాలను అధికారులకు కలెక్టర్ పలుసూచనలు చేశారు. రానున్న మూడురోజులపాటు వాతావరణాన్నిదృష్టిలో ఉంచుకొని అందుకు అనుకూలమైన సభాస్థలాన్ని ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్‌వెంట కల్వకుర్తి ఆర్‌డిఓ శ్రీనివాసులు, మున్సిపల్ కమీషనర్ ఆశ్రిత్‌కుమార్, వెల్దండ తహసీల్దార్ రవికుమార్, కల్వకుర్తి తహసీల్దార్ ఇబ్రహీం ఉన్నారు.

## ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునే బడ్జెట్

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా బడ్జెట్‌ను ప్రవేశపెట్టామని రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజాపాలనకు అద్దం పట్టేలా ఉన్నదన్నారు. ప్రజలు ఆశించిన,అభిలాషకు అనుగుణంగానే బడ్జెట్ ప్రతిపాదన చేశామని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బడ్జెట్‌ను చీల్చి చెండాడుతామని ప్రతిపక్ష నాయకుడు కెసిఆర్ చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ బడ్జెట్ గత పది సంవత్సరాలు రాష్ట్రాన్ని పాలించిన కెసిఆర్‌కు ఒక కనువిప్పు అని అన్నారు. బడ్జెట్‌ను విమర్శించేందుకు ఏమీలేదని, మొదటిసారి వచ్చారు కాబట్టి, ఏదో ఒకటి మాట్లాడాలనే తన సహజ ధోరణిలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని మంత్రి పొంగులేటి అన్నారు.

## రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి కేటాయింపులు అంతంతమాత్రమే

ఎస్‌టియుఎస్ రాష్ట్ర అదనపు ప్రధానకార్యదర్శి ఎవి సుధాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్యాభివృద్ధితోనే బంగారు తెలంగాణ సాధ్యంఅని నినాదిస్తున్న ప్రభుత్వం 2024–2025 రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి కేటాయిస్తున్న బడ్జెట్ గతంతో పోల్చుతె తగ్గుముఖం పడుతోంది. 2,91,191 కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్యారంగానికి కేవలం21,292 కోట్లు కేటాయించడంతో ప్రభుత్వానికి విద్యారంగం పై గల చిత్తశుద్ధి తేటతెల్లమౌతోంది. కోఠారి కమిషన్ రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 30% నిధులు కేటాయించాలని చెబుతున్నా కేవలం 7.31 శాతం నిధులే కేటాయించడం విడ్డూరం. గత ఏడాది బడ్జెట్ 6.57 శాతంతో పోలిస్తే స్వల్పంగా పెరిగినట్లు కనిపించినా విద్యారంగానికి సరిపోయే నిధులు పెంచలేదు. గత పదేండ్ల లో ప్రభుత్వ పాఠశాల విద్యకు సరిపోను నిధులు కేటాయించక పోవడంతోనే మౌలిక వసతుల కొరత తీవ్రమైంది.గాడితప్పిన విద్యను మళ్ళీ తీర్చి దిద్దాలంటే బడ్జెట్ లో కనీసం20% నిధులు కేటాయిస్తే బాగుండేది. విద్యావేత్తలు,విద్యా పరిరక్షణ సమితి, మేధావులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా కాంగ్రెస్ సర్కారు గత ప్రభుత్వం మాదిరిగా స్వల్ప కేటాయింపులు జరపడం బాధాకరం.




## శిథిలావస్థలో ప్రభుత్వ పాఠశాల

**ప్రజాపక్షం/వంగూర్ :** మండలపరిధిలోని నిజాంబాద్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల పూర్తిగా శిథిలావస్థకు చేరిపైకప్పుపెచ్చులు పెచ్చులుగా ఊడిపోతుందని విద్యార్థులు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వర్షాకాలం వచ్చిందంటే తరగతిగదులు వర్షపునీరుతో చిత్తడి చిత్తడిగామారి విద్యార్థులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఐదు తరగతులకు ఒకేగదిలో విద్యాబోధన చేస్తున్నామని పాఠశాల ఉపాధ్యాయులు దినేష్ పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాల మరమ్మత్తులతోపాటు అదనపు ఉపాధ్యాయులను కేటాయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



## పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

ధరణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

జిల్లా ఇంచార్జీ కలెక్టర్ సంచిత్ గంగ్వార్

**ప్రజాపక్షం / పాన్‌గల్ :** గ్రామాలలో పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని వనపర్తి జిల్లా కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. గురువారం పాన్‌గల్ మండల పరిధిలోని రేమద్దుల, గోప్లాపూర్ , పాన్‌గల్ గ్రామాలలో ఆయన పర్యటించారు. పాన్‌గల్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంను సందర్శించారు. ధరణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కస్తూర్బా పాఠశాలను సందర్శించి మౌలిక సదుపాయాల మరమ్మతు పనులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటారు. హరితహారం కార్యక్రమం భాగంగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, ఎంత మంది ఓపిలు వచ్చారు అనేది రిజిస్టర్‌లను పరిశీలించారు. పిహెచ్‌సిలో ఉన్న మందుల నిలువలు, సమస్యలపై ఆరా తీశారు. రేముద్దుల , గోప్లాపూర్ గ్రామాలలోని పాఠశాలలను సందర్శించి , అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించి, పాఠశాల విద్యార్థులతో మాట్లాడి విద్యా ప్రమాణాలను తెలుసుకున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. గోప్లాపూర్ గ్రామంలో నర్సరీని సందర్శించి వన మహోత్సవ కార్యక్రమానికి ఉపయోగిస్తున్న మొక్కలను పరిశీలించారు. కలెక్టర్ వెంట జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ఉమాదేవి, తహసీల్దార్ సుభాష్ నాయుడు, డిటి ఆశోక్ , ఏపిఓ కురుమయ్య, ఎంపీఓ రఘురామయ్య, పంచాయతీ కార్యదర్శులు, కస్తూర్బా గాంధీ పాఠసాల, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌లు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఉన్నారు.

## సైబర్ నేరాల పట్ల జాగ్రత్త అవసరం

జిల్లా ఎస్పీ డి. జానకి




**ప్రజాపక్షం / మహబూబ్‌నగర్ ప్రతినిధి :** సైబర్ నేరాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, టెక్నాలజిని వాడుకొని సైబర్ నేరగాళ్లు, ప్రజలకు తెలియకుండానే వారి డబ్బులను దోచుకుంటున్నారని ప్రజలు అనవసరం లింక్‌లు క్లిక్ చేయొద్దని , ఓటీపీ, పాస్‌వర్డ్‌లు ఎవరికి చెప్పొద్దని అప్రమత్తతోనే మోసాలకు ఎక్ పెట్టాలని జిల్లా ఎస్పీ డి. జానకి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాట్సాప్ , ఫేస్ బుక్ , ఇతర యాప్‌లు, లింకులు , ఈ మెయిల్స్‌తో హ్యాకర్లు మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు, విద్యార్థులు, యువకులు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దని గుర్తు తెలియని, అపరిచిత వ్యక్తులతో ఫోన్ కాల్స్ , వాట్సాప్ , ఫేస్ బుక్ చాటింగ్‌కు దూరంగా ఉండాలని, ఓటీపీలు వస్తే ఎవరికి చెప్పవద్దని ఎస్పీ సూచించారు. లాటరీలు, బ్యాంకు రివార్డు పేరిట, జాబ్స్ , కమీషన్లు, డిస్కొంట్ల పేరుతో సులభంగా డబ్బు సంపాదించుకోవచ్చని ప్రజలకు ఆశ చూపి ఓసం చేస్తున్నారని, బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నారని, ఆధార్ నంబర్ చెప్పండని, మీ ఏటీఎం పని చేయడం లేదని, కారు గెల్చుకున్నారని , మని ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో , క్రెడిట్ కార్డులిమిట్ పెంచుతామని ఇలా రకరకాలుగా సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసగిస్తూ తెలియకుండానే డబ్బులు కాజేస్తున్నారని ఎస్పీ పేర్కొన్నారు. ఏపికె ఫైల్స్ డౌన్లోడ్ చేయొద్దని అలాగే పోలీస్ అధికారుల ఫోటోలు, డిపిగా పెట్టుకొని మీపై క్రిమినల్ కేసులు నమోదు చేయబడునని మీమమ్మల్ని భయపెట్టోచ్చు సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన బాధితులు వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు గోల్డెన్ వర్ కాల్ చేసి వివరాలు తెలియజేస్తే డబ్బు తిరిగి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. సైబర్ నేరాల నివారణ కోసం పలు అవాహన కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు.



## వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

**ప్రజాపక్షం / వీపనగండ్ల :** చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పాఠశాల కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు భాను ప్రకాశ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని గోవర్ధనగిరి, రంగవరం ప్రాథమిక పాఠశాలలు, గోపాన్‌పల్లి, యూపిఎస్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని వివిధ రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల ద్వారా తెలుగు, ఇంగ్లీష్ , గణిత సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సామర్థ్యాలలో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నాణ్యమైన విద్యా బోధన చేయాలని సూచించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు రుచికరమైన నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలని వంట ఏజెన్సీలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఆర్పి వెంకటేష్ ఉన్నారు.

# అసెంబ్లిలో భజన బ్యాచ్

అసెంబ్లీలో ప్రజల సమస్యలపై మాట్లాడే నేతలే లేరు

బిజెపి ఎంఎల్ఎ హాట్ కామెంట్స్..

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అసెంబ్లీ సమావేశాల జరుగుతున్న తీరు, సభలో కొందరి సభ్యుల వ్యవహార శైలిపై బిజెపి ఎంఎల్ఎ కాటిపల్లి వెంకటరమణారెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు.అసెంబ్లీలో భజన బ్యాచ్ ఎక్కువైపోయిందంటూ హాట్ కామెంట్స్ చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద గురువారం ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న తీరు చాల బాధాకరంగా ఉందన్నారు.ప్రజల ఘోష నేతలకు వినపడటం లేదని వ్యాఖ్యానించారు. సభలో ఎంఎల్‌ఎలు ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకుని బయట మాత్రం తర్వాత చెట్టాపట్టాల్ వేసుకుని తిరుగుతున్నారని వెంకటరమణారెడ్డి విమర్శించారు. తాను జిల్లా పరిషత్తు ఛైర్మన్‌గా పని చేశానని,సభలో ఎలా ఉండాలో తనకు తెలుసు అన్నారు.గతంలో అసెంబ్లీ మీదుగా వెళ్లేటప్పుడు ఎప్పుడు అసెంబ్లీకి వెళ్తామా అని అనుకునేవాడినన్నారు. కాని ఇక్కడ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉందని, అసెంబ్లీలో ప్రజల సమస్యలపై మాట్లాడే నేతలే లేరని వెంకటరమణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.కేంద్రప్రభుత్వం గత 9 ఏళ్లలో తెలంగాణకు ఏమి ఇచ్చిందో జీవోలతో సహా చెప్పేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, మరి గత కెసిఆర్ హయాంలో బిఆర్ఎస్‌కు 12 మంది ఎంపీలు ఉన్నా కేంద్రం నుంచి ఏ మేరకు నిధులు తీసుకొచ్చారో కెటిఆర్ వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు.

## కాలనీల అభివృద్ధికి కృషి : ఎంఎల్ఎ



**ప్రజాపక్షం/చర్లపల్లి** కాలనీలను సంక్షేమ సంఘలతో కలసి అభివృద్ధి చేస్తానని ఉప్పల్ శాసన సభ్యులు బండారి లక్ష్మారెడ్డి అన్నారు.గురువారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మి నరసింహ స్వామి కాలనీ నూతనంగా ఏర్పడిన కమిటీ ఎంఎల్ఎను మర్యాదపూర్వకంగా కలసి కాలనీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.ఈ సందర్భంగా కాలనీ నూతన కమిటీకి అభినందనలు తెలిపిన ఆయన సానుకూలంగా స్పందిస్తూ తన దృష్టికి తీసుకువస్తే సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు మహేష్‌గౌడ్,కాలనీ అధ్యక్ష,కార్యదర్శులు సిహెచ్ నరసింహ,జె సుధాకర్,ట్రెజరర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## మేయర్, డిప్యూటీ మేయర్‌లకు సన్మానం



**ప్రజాపక్షం/బోడుప్పల్ :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన మేయర్ తోటకూర అజయ్ యాదవ్,డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్ లు పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జేజీఆర్ హైస్కూల్ యాజమాన్యం అభినందన సభ ఏర్పాటు చేసి మేయర్, డిప్యూటీ మేయర్లను ఘనం గా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతు బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ విద్య, వైద్య రంగాలలో మరింత అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు.

## అలియాబాద్ పిస్తాహౌస్‌లో భోజనం చేసిన కెటిఆర్

### మేడిగడ్డ బ్యారేజ్‌కు తరలిన బిఆర్ఎస్ ఎంఎల్ఎల బృందం



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మేడిగడ్డ బ్యారేజ్‌ను సందర్శించడానికి హైద్రాబాద్ నుంచి బయల్దేరిన బిఆర్ఎస్ మాజి మంత్రులు, ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలు మేడ్చల్ జిల్లా, శామీర్‌పేట మండలం, అలియాబాద్ ప్రధాన చౌరస్తాలోని పిస్తాహౌస్‌లో ఆగి భోజనం చేశారు. గురువారం మేడిగడ్డ బ్యారేజ్ సందర్శనకు వెళ్తున్న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటిఆర్, ఎంఎల్ఎల బృందం, మేడ్చల్ ఎంఎల్ఎ చామకూర మల్లారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, కౌశిక్ రెడ్డి, సునీతలక్ష్మారెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంఎల్‌సిలు సత్యవతి రాథోడ్, శంబీపూర్ రాజు, మాజి ఎంఎల్ఎ బాల్క సుమన్, తదితరులు పిస్తాహౌస్‌లో బోజనం చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పిస్తాహౌస్‌కు చేరుకుని కేటిఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చామకూర మహేందర్ రెడ్డి, గ్రంధాలయ మాజి చైర్మన్ బాస్కర్‌యాదవ్, మాజి ఎంపిపి ఎల్లుబాయి బాబు, మాజి జడ్‌పిటిసి అనితలాలి, మాజి సర్పంచ్ సరసం మోహన్‌రెడ్డి, వంగ వెంకట్‌రెడ్డి, నందుగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## నవాబుపేట్ పోలీస్ స్టేషన్ సందర్శించిన : జిల్లా ఎస్‌పి




**ప్రజాపక్షం/నవాబుపేట్ :** గురువారం వికారాబాద్ జిల్లా నవాబ్ పేట్ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను వికారాబాద్ డిఎస్‌పి శ్రీనివాస్ రెడ్డి, సిఐ ఆంజనేయులుతో కలిసి ఎస్‌పి నారాయణ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్ పరిసరాలు, క్వార్టర్స్ భవనం, రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి సమస్యలు, కేసులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి నారాయణరెడ్డి మాట్లాడుతూ విధి నిర్వాహణలో ఉన్న ప్రతీ పోలీసు అధికారి పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. వారి నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేసి ఫాలోఅప్ చేయాలని ఆయన సూచించారు. ప్రతీ ఫిర్యాదుదారుడికి సత్వర న్యాయం జరిగేలా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. డయల్ 100కు కాల్ చేసిన వెంటనే స్పందించి ఘటన స్థలానికి చేరుకోవాలని సూచించారు.పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో నిఘా పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక, గంజాయి, డ్రగ్స్, గుట్కా వంటి మత్తుపదార్థాల విక్రయాలపై ప్రత్యేక నిఘాతో కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అంతకుముందు ఎస్‌పికి ఎస్ఐ భరత్ భూషణ్, సిబ్బంది గౌరవవందనం చేసి పువ్వుల బొకే ఇచ్చి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ భరత్ భూషణ్ , ఎఎస్ఐ మురళీధర్,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


## బ్రెయిన్ ఫీవర్ వ్యాధి సోకకుండా జెఇ టీకాలు : డిఎంహెచ్‌ఒ




**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** జిల్లాలోని తొమ్మిది మాసాల నుండి 15 సంవత్సరాల మధ్య ఉండే పిల్లలకు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా బ్రెయిన్ ఫీవర్ వ్యాధిగా పిలువబడే జపనీస్ ఎన్సెఫాలిటీస్ (జెఇ) సోకకుండా ఉండేందుకు గాను జెఈ వ్యాక్సిన్‌ను ఇచ్చే కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని జిల్లా ఆరోగ్య వైద్య అధికారి డా.రఘునాథస్వామి తల్లిదండ్రులను కోరారు. కుషాయిగూడలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో ఆయన గురువారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికార్లు డా.శ్రీదేవి, మల్లీశ్వరి, కుషాయిగూడ వైద్య అధికారిలతో కల్సి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెఈ సోకిన దోమ కుట్టటం ద్వారా ఈ వ్యాధి వ్యాపిస్తుందని, తల్లిదండ్రులు తమ పిల్లల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.జిల్లాలో 4,86,037 మంది పిల్లలు ఈ వయస్సులో ఉన్నారని, జెఇ టీకాలు జూలై 25 నుండి ఆగస్టు 15 వరకు అందుబాటులో ఉంటుందన్నారు. విద్యా సంస్థల్లో, అంగన్‌బాడి పాఠశాలల్లో పిల్లలకు టీకాలు వేయించాలన్నారు.

## నాగారంలో రూ.27లక్షలతో అభివృద్ధి పనులు

**ప్రజాపక్షం/నాగారం :** మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిని సారిస్తానని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు.నాగారం మున్సిపాలిటీ పరిధిలోని పలువార్డుల్లో అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. మున్సిపల్ పరిధిలోని 9వ వార్డు విజయపురి కాలనీలో రూ.10.50 లక్షలతో,4వ వార్డు సంతోష్ నగర్ కాలనీలో రూ.16.60 లక్షలతో పలు అభివృద్ధి పనులకు స్థానిక కౌన్సిలర్లు కొమిరెల్లి అనిత సుధాకర్‌రెడ్డి,లక్ష్మి వేణుగోపాల్‌లతో కలసి చైర్మ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మున్సిపాలిటీలో చేపట్టిన వివిధ పనులను నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# కాళేశ్వరం నుంచి ఎన్ని టిఎంసిల నీరు ఇచ్చారు?

### బిఆర్ఎస్ ఎంఎల్ఎలను ప్రశ్నించిన మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి కరీంనగర్ జిల్లాకు ఎన్ని టిఎంసిల నీటిని రైతులకు ఇచ్చారో బిఆర్ఎస్ నేతలు చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎంఎల్ఎలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యంలతో కలిసి గురువారం సచివాలయం మీడియా పాయింట్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. బిఆర్ఎస్ నాయకులు తమ జిల్లాలో ఉన్న లోయర్, మిడ్ మానేరు డ్యామ్ పరిశీలనకు వెళ్తున్నారన్నారు. 2 టిఎంసిల నీటి కోసం తీసుకున్న ప్రణాళిక ఎందుకు బిఆర్ఎస్ ప్రభుత్వంలో అమలు కాలేదని ప్రశ్నించారు. రెండు టిఎంసిల నీరు రాలేదు కానీ, రూ. 2 వేల కోట్లతో మూడో టిఎంసి నీటి గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. వర్షాకాలంలో నీళ్లు వస్తున్నాయి, కానీ తాము కడితేనే వస్తున్నాయని చెప్పుకునే ప్రయత్నం బిఆర్ఎస్ నేతలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎల్లంపల్లి, మిడ్ మానేర్ ప్రాజెక్టు ద్వారా నీళ్లు వెళ్తాయన్నారు. ముంపు గ్రామాల సమస్య ఎందుకు పరిష్కరించలేదో ప్రజలకు చెప్పి రావాలన్నారు. అధికారంలో ఉన్నప్పుడు నిర్వాసితులను ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. మూడో టిఎంసి నీటిని ఎవ రి లబ్ధి కోసం అడుగుతున్నారో చెప్పాలని నిలదీశారు. యాదవులకు ఉన్న బకాయిలను తాము అధికారంలోకి వచ్చాక తమ జిల్లాల్లో ఇప్పుడు పరిష్కారిస్తున్నామని తెలిపారు. 7 నెలల కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని, మరి పదేళ్ల ప్రభుత్వంపై చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. యాదవులకు చెందిన 8500 డిడిలు గత ప్రభుత్వం ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు.

## ప్రజాప్రభుత్వంలో విద్యారంగం అభివృద్ధికి నోచుకోదా? : ఎఐఎస్‌ఎఫ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో అధికారం లో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈరోజు 2లక్షల 91వేల 159 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టగా విద్యారంగానికి కేవలం 21,292 కోట్లు 7.3%నిధులు మాత్రమే విద్యకు కేటాయించిందని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్‌లు పేర్కొన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో విద్యకు బడ్జెట్ లో 15%నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారని కానీ బడ్జెట్ కేటాయింపులో హామీ మేరకు అయిన నిధులు కేటాయించకపోవడం సరికాదన్నారు. ఈ బడ్జెట్ కేటాయింపులు విద్యకు ఏ మేరకు సరిపోవని, యూనివర్సిటీల అభివృద్ధికి 500 కోట్లు ఇచ్చారని అందులో ఓయు కి 100కోట్లు ,మహిళా యూనివర్సిటికి 100కోట్లు మిగతా అన్ని యూనివర్సిటీలకు కలిపి 300 కోట్లు కేటాయించారని, ఈ నిధులతో విద్యార్థుల మౌలిక వసతులు కల్పన, యూనివర్సిటీల్లో విద్యాప్రమాణాలు ఏ విధంగా పెరుగుతాయని, ప్రభుత్వ పాఠశాలలు,జూనియర్ డిగ్రీ కళాశాలల్లో మౌలిక వసతులకు ప్రత్యేక నిధులు లేవని అన్నారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీల పెంపు పై ప్రకటన,అద్దె భవనాల్లో నిర్వహణలో ఉన్న వాటికి కొత్త భవనాల నిర్మాణానికి నిధులు కేటాయింపు పై నిధులు విడుదల చేయకపోవడం సరికాదని, ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలే 8000కోట్లు పెండింగ్ లో ఉన్నాయని వాటి ఊసే లేదని

# బురదమయమైన రోడ్లు విద్యార్థులకు తప్పిన ఇబ్బందులు



కొండరెడ్డిపల్లిలో శిథిల్యావస్థకు చేరిన పాఠశాల




**ప్రజాపక్షం / కొడంగల్ :** గత మూడు రోజులుగా కొడంగల్‌లో ఎడతేరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు వెళ్లే రహదారి పూర్తిగా బురదమయం కావడంతో పాఠశాలకు వేళ్లే విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసానికి కూత వేటు దూరంలో ఉన్న ఈ పాఠశాలకు సరైన వసతులు లేకపోవడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. ఎంతో మంది పాలకులు వచ్చిన విద్యార్థులను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని పలువు రు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఆనాడు ఎంఎల్‌ఏగా ఉన్న రేవంత్‌రెడ్డి గేల్ సంస్థ ద్వారా ప్రభుత్వ జూనియర్ కళాశాలను నిర్మించారు. అదే సంస్థ నుంచి దాదాపు 3 కోట్లతో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను నిర్మించేందుకు ప్రతిపాదనలు చేసిన ఫలితం లేకపోయింది. కాని ప్రస్తుతం స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కావడంతో విద్యార్థులు కోటి ఆశలతో ఎదురు చూపులు చేస్తున్నారు. ప్రస్తుతం ఆ పాఠశాలకు వేళ్లలంటే పట్టపగలే నరకం చూస్తున్నారు విద్యార్థులు. అధికారులు త్వరిత గతిన స్పందించి విద్యార్థుల సమస్యలను తీర్చాలని డిమాండ్ చేస్తున్నారు.

కొడంగల్ మున్సిపల్ పరిధిలోని కొండరెడ్డిపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల వర్షాలకు తడిపి ఎప్పుడు కూలీపోతుందోనని విద్యార్థులు బిక్కుబిక్కుమంటున్నారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాఠశాల భవనం తడిసి నీరు కారుతుండటంతో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, గ్రామస్థులు భయాందోళనకు గురి అవుతున్నారు. అందులో భాగంగానే గురువారం పాఠశాల సమయంలో తరగతి గదిలోకి వచ్చిన నీటిని పారవేసి వరండాలో ఉపాధ్యాయులు , విద్యార్థులు నిలుచుని పాఠాలను బోదించారు. ఇంత అధ్వాన పరిస్థితులు దాపురించిన ఏ అధికారి ఎందుకు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు మండిపడుతున్నారు. బోంరాస్‌పేట, కొడంగల్, దుద్యాల్ మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోగా గారి సోంత గ్రామంలోనే పాఠశాల భవనం ఈ స్థితిలో ఉండటం వారి నిదర్శనానికే అర్థం అంటు గ్రామస్థులు తీవ్ర అందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన విద్యాశాఖ అధికారులు స్పందించి కొడంగల్‌లో విద్యార్థులు పడుతున్న కష్టాలను,సమస్యలను తీర్చాలని డిమాండ్ చేస్తున్నారు.

## నేడు ఫైర్‌మెన్‌ల పాసింగ్ అవుట్ పరేడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర విపత్తు నిర్వహణ, అగ్నిమాపక సేవల శాఖలో శిక్షణ పూర్తి చేసుకున్న 483 మంది ఫైర్ మెన్‌ల పాసింగ్ అవుట్ పరేడ్ శుక్రవారం గచ్చిబౌలిలోని ఫైర్ విభాగం మైదానంలో జరుగుతుందని ఫైర్ డిజి వై.నాగిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి హాజరవుతున్నారు. అలాగే ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సైతం హాజరవుతున్నారు. ఇటీవల ఎంపికైన డ్రైవర్ అపరేటర్లలో 157 మందికి నియామక పత్రాలు అందజేయనున్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుండి ఎంపికైన 483 మంది ఫైర్‌మెన్‌లకు గత నాలుగు నెలలుగా వరదలు, భూకంపాలు, విపత్తులు, అగ్నిప్రమాదాలు, రోడ్డు, రైలు, విమాన ప్రమాదాలను సమర్ధవంతంగా ఎదుర్కొనేలా నైపుణ్యంతో కూడిన శిక్షణను అందించినట్లు నాగిరెడ్డి తెలిపారు.

## మెదడు వాపు నివారణ టీకాలు



**ప్రజాపక్షం/దమ్మాయిగూడ :** మెదడు వాపు వ్యాధి నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ప్రణీతశ్రీకాంత్‌గౌడ్ అన్నారు.గురువారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు జెఈ టీకా కార్యక్రమం నిర్వహించారు. గురువారం నుండి 14 తేదీ వరకు టీకా కార్యక్రమం నిర్వహించనున్నారని ఆరు నుండి పదిహేను సంవత్సరాల విద్యార్థులు టీకాలు వేయనున్నారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ రామారం శ్రీహరి గౌడ్,ఏఎన్ఎం రేచల్,ఆశావర్కర్స్,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గుంతల రోడ్డుతో ఇబ్బందులు

**ప్రజాపక్షం/చర్లపల్లి :** గుంతల మయమైన రోడ్డుకు మరమ్మతులు చేయాలని వాహనదారులు,స్థానికులు కోరుతున్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని డీమార్ట్ పక్క రోడ్డు వివన్ రెడ్డి నగర్ కాలనీలో సంవత్సరం క్రితం రోడ్డును తవ్వి డ్రైనేజీ పైప్‌లైన్ పనులను చేశారు. సంవత్సర కాలం నుండి వాహనదారులు,స్థానికులు గుంతలతో ఇబ్బందులకు గురవుతున్నారని అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించిన ప్రయోజనం లేకుంగా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రతి నిత్యం రద్దీతో ఉండే రోడ్డులో ఇటీవల కురుస్తున్న వర్షాలతో గుంతలలో నీరు నిలిచి కనిపించకుండా పోయిందన్నారు.ఇకనైనా సంబంధిత అధికారులు,ప్రజా ప్రతినిధులు దృష్టి సారించి రోడ్డుకు మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు,వాహనదారులు కోరుతున్నారు.

### తాండూరు సమస్యలపై పార్లమెంట్‌లో
## గళమెత్తిన కొండ విశ్వేశ్వర్‌రెడ్డి

**ప్రజాపక్షం/తాండూరు :** చేవెళ్ళ పార్లమెంట్ ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తాండూరు నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై పార్లమెంట్ సమావేశంలో గళమెత్తారు. గురువారం జరిగిన పార్లమెంట్ సమావేశాలకు హజరైన చేవెళ్ళ ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తాండూరు నియోజవర్గంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సభా దృష్టికి తీసుకవెళ్ళారు. తాండూరు నియోజకవర్గ పరిధి బషీరాబాద్ మండల నవాంద్గీ రైల్వే స్టేషన్‌లో రద్దు చేసిన రైలను వెంటనే ఆపే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. బషీరాబాద్ ప్రాంతం నుండి హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాలకు ఉద్యోగులతో పాటు విద్యార్థులు, వ్యాపారులు నిత్యం ప్రయాణం సాగిస్తుంటారని తెలిపారు. రైలు మార్గం ఎంతో సుమార్గంని ఈ ప్రాంత ప్రజలు రైలులో ప్రయాణిస్తుంటారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించిన నవాంద్గీ రైల్వే స్టేషన్‌లో రైలు ఆపాలని కోరారు.

## కొంపల్లి మున్సిపల్ టపిఒ కుర్చీ ఎపుడు ఖాళీగానే...



**ప్రజాపక్షం/దుండిగల్ :** కొంపల్లి పురపాలక సంఘం కార్యాలయంలో అధికారుల కొరత చాలానే వుంది మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికరీ వారానికీ ఒకే సారే వీదులకు రావడంతో అం త చైన్ మన్ క్రింది స్థాయి సిబ్బందే చక్రం తీపుతున్నారు. ఇబ్బడి ముబ్బడిగా అక్రమనిర్మాణాలు సాగుతున్న టీపీఓ అధికారి లేకపోవడంతో నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి. మున్సిపల్ చట్టాన్ని ఉల్లంగిస్తూ భారీ బహుళ అంతస్తు కమర్షియల్ నిర్మాణాలు ఆపలేని దుస్థితి ఏర్పడింది. కొంపల్లి దూలపల్లి అనుమతులు ఉన్న వాటికన్నా అనుమతులు లేనివే చాలావున్నాయి. మున్సిపల్ సిబ్బంది కాసులకు కక్కుర్తి పడి అక్రమ నీర్మాణాలను కోనసాగిస్తూ ఆపిన దకలలు నేటికి లేవు ముడుపులు ఇచ్చుకో నీర్మాణాలు చేసుకో అనే తిరుగా అధికారులు తమ విధులు కొనసాగిస్తున్నట్టున్నారు. నేటికైనా ఉన్నతాధికారులు మున్సిపల్ అనుమతులు తీసుకోకుండా నిర్మిస్తున్న వాటిపై దృష్టి సారించాలని, మున్సిపల్ పాలనపై సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

## కనీస వసతులకు కూడా నోచుకోవడం లేదు

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా కేంద్రం లో కనీస వసతులకు కూడా నోయుకోవడం లేదని వికారాబాద్ అభివృద్ధి పోరం ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువరం నాడు వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జోన్‌కు వినితిపత్రం అందజేశారు. వికారాబాద్ జిల్లా కేంద్ర సమస్యలపై కలెక్టర్ కు వివరించారు. ముఖ్యంగా ప్రధాన అంతర్గత రోడ్లు పాడైనగుంతల మాయమౌ ప్రమాదాలు జరుగుతున్నయని .ప్రధాన చౌరస్తాలో సిగ్నల్స్ ,సిసికేమేరాలు లేవని ,ట్రాపిక్ పోలీసులు కూడా లేరని తెలిపారు. చిన్నపాటి వర్షాం పడ్డ ప్రధాన రోడ్లపై మురుగు నీరు,చేరుతుందని ,మురికి నీటి కాలువల వ్యవస్థ సరిగ్గా లేదని ,వీధి దీపాలు కూడా సరిగ్గా లేవని ,ఉదయం 4గంటనుండి వాకర్స్ ముఖ్యంగా మహిళలు చీకట్లోనే వాకింగ్‌కు వెళ్లాల్సి వస్తుంది అవేదన వ్యాక్తం చేశారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో కుక్కల బెడద ఎక్కువైందని ,ప్రజలు తమ పిల్లలను బయటకు పంపటానికి భయపడుతున్నారని అన్నారు. మండల కేంద్రలోని గ్రామలనుండి వచ్చే ప్రజలకు సరైన రోడ్లు దశబ్ద కాలంగా ఇబ్బందులకు గురువుతున్నరని కలెక్టర్ కు వివరించారు. వేంటనే రోడ్లు మరమ్మత్తుకు వేంటనే చార్యలు తీసుకోవానలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు . ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, మారుతీ, దేవదాస్ , విజయకుమార్ , మానిక్‌రెడ్డి , తిరుపతి రెడ్డి తదితరులు పాల్గోన్నారు.

## రేవంత్, బట్టిలకు ఎంఎల్ఎ శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/తాండూరు :** తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు అయిన తరువాత మొదటిసారిగా సభలో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్కలను తాండూరు ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. గురవారం ప్రవేశపెట్టిన బడ్జేట్‌పై ఎంఎల్ఎ మనోహర్‌రెడ్డి సంతృప్తిని వ్యక్తం పర్చారు. ఈ బడ్జేట్‌లో వ్యవసాయ రంగానికి అధిక ప్రధాన్యతను ఇచ్చిందని అన్నారు. ఈ బడ్జేట్‌ను ప్రవేశట్టిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్కలను తాండూరు ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి తోటి సహచార ఎంల్ఎలతో కలసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## 28న కట్టమైసమ్మ బోనాల ఉత్సవాలు

### ఎంఎల్ఎను ఆహ్వానించిన కమిటి సభ్యులు

**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరు పట్టణ పరిధి పాత కుంట ఆదర్శనగర్‌లో వెలసిన మాత కట్టమైసమ్మ బోనాల ఉత్సవాలను ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు ఆలయం కమిటి సభ్యులు మాజీ మార్కెట్ కమి టి చైర్మ న్ విఠల్‌నాయక్ తెలిపారు. ఇట్టి బో నాల ఉత్సవాలకు తాండూరు ఎంఎల్ఎ మ నోహర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలసినకమిటి సభ్యులు గురువారం ఎంఎల్ఎ మనోహర్‌రెడ్డిని కలసి ఆహ్వానించారు. ఎంఎల్ఎను ఆ హ్వానించిన వారిలో ఆలయ కమిటి సభ్యులు ఉన్నారు.

## మెదడు వాపు టీకాలను తప్పనిసరిగా వేయించుకోవాలి

### చైర్ పర్సన్ ముల్లిపావళి జంగయ్య యాదవ్



**ప్రజాపక్షం/ఘట్కేసర్ :** స్కూల్‌లో 5సంవత్సరాల నుండి 15 సంవత్సరాల విద్యార్థులకు మెదడు వాపు టీకా వేయు కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ టీకా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా చైర్పర్సన్ ముళ్ళి పావని జంగయ్య యాదవ్ పాల్గొనడం జరిగింది. చైర్పర్సన్ మాట్లాడుతూ ముందు ముందు పిల్లలు మెదడు వాపు వ్యాధికి గురి కాకుండా 15 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి ఒక్కరూ టీకా వేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిరాజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, హెడ్ మాస్టర్ పాపిరెడ్డి, డాక్టర్ విమల, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### అశోక్‌నగర్ నల్ల పోచమ్మ దేవాలయంలో
## 28,29 తేదీల్లో బోనాలు



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** అశోక్‌నగర్ నల్ల పోచమ్మ దేవాలయంలో ఈ నెల 28,29 తేదీల్లో బోనాల ఉత్సవాలు జరుగనున్నాయని ఆలయ నిర్వాహకులు సురేందర్, బాలి, సత్యనారాయణ, ప్రభాకర్, సంద అనీల్ కిషోర్, విజయశేఖర్ తెలియ చేసారు. ఈ ఉత్సవాలకు స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డిని ఆహ్వానించారు.

## ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌లో...



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌లో ఈ నెల 28,29 తేదీల్లో బోనాల ఉత్సవాలు జరుగనున్నాయని డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, వెంకటేష్ యాదవ్, సతీష్‌కుమార్,బికె శ్రీనివాస్, పిట్టల శ్రీనివాస్, సాయినాథగౌడ్, కొడగౌడ్, సంపత్‌రావు, సిరిగిరి రాజు, సయ్యద్ తదితరులు స్థానిక మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును కల్సి ఈ ఉత్సవాలకు హాజరు కావాలని కోరారు.

## ఘనంగా పోచమ్మ తల్లి కల్యాణ మహోత్సవం



**ప్రజాపక్షం/ఫేట్ బషీరాబాద్ :** గురువారము రోజున కొంపల్లి పట్టణంలోని శ్రీ పోచమ్మ తల్లి దేవాలయంలో సన్న కవిత శ్రీశైలం యాదవ్ మాజీ ఎంపిపి, ప్రస్తుత మున్సిపల్ ఛైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్ సతీమణి చేతుల మీదుగా శ్రీ పోచమ్మ తల్లి అమ్మవారి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిపించడం జరిగింది. ఈ ఆదివారం జరుగాబోయో బోనాల పండుగకు ముందుగా అమ్మవారి కల్యాణ మహోత్సవం చెయ్యడం ప్రతి సంవత్సరము ఆనాయితీగా వస్తుంది. ఈ సందర్భంగా చైర్ పర్సన్ సన్న శ్రీశైలం యాదవ్ మాట్లాడుతూ, ప్రజలంతా ఆయురారోగ్యలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, వర్షాలు సమృద్ధిగా పడాలని ఆ తల్లిని కోరుకున్నని తెలిపారు.

## బంగారు మైసమ్మ బోనాల ఏర్పాట్ల పరిశీలన

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఈ నెల28 ఆదివారం నిర్వహించే బంగారు మైసమ్మ బోనాల పండుగ ఏర్పాట్లను గురువారం నగర మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మేడిపల్లి సిఐ గోవింద్ రెడ్డి తో కలిసి పరిశీలించారు. అనంతరం మేయర్ అజయ్ యాదవ్ మాట్లాడుతూ, బోనాల పండుగ సందర్భంగా అమ్మవారికి బోనం సమర్పించడానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని, అమ్మవారిని దర్శించుకోవడని చాలా మంది భక్తులు వస్తుంటారు కనుక ఎలాంటి అవంచానియా సంఘటనలు జరగకుండా చూడాలని పోలీస్ వారికీ సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, కార్పొరేటర్లు పోగుల నర్సింహా రెడ్డి, కొత్త చందర్ గౌడ్, చీరాల నర్సింహా,కిరణ్ కుమార్ రెడ్డి, నాయకులు దానగాళ్ల యాదగిరి, జక్కా రాములు, బొబ్బల లక్ష్మ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## క్రీడ

# ఆర్చరీలో భారత్ సంచలనం!



పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ శుభారంభం చేసింది. ఆర్చరీలో భారత మహిళల జట్టు, పురుషుల జట్టు క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించింది. 22 ఏళ్ల తెలుగు కుర్రాడు బొమ్మదేవర ధీరజ్ సంచలన ప్రదర్శన చేశాడు. ధీరజ్ ఎక్కుపెట్టిన బాణాలకు మెన్స్ విభాగంతో పాటు మిక్స్‌డ టీమ్‌లోనూ భారత్ సత్తాచాటింది. మిక్స్‌డ టీమ్‌లో ధీరజ్‌అంకిత అయిదో స్థానంలో నిలిచారు. మిక్స్‌డ విభాగంలో ఇండియా రౌండ16కు క్వాలిఫై అయ్యింది. గురువారం జరిగిన క్వాలిఫికేషన్ రౌండ్‌లో భారత పురుషుల ఆర్చర్లు అదరగొట్టారు. ధీరజ్‌తో పాటు తరుణ్‌దీప్, ప్రవీణ్ సత్తాచాటడంతో భారత్ మూడో స్థానంలో నిలిచింది. 2013 పాయింట్లతో సత్తాచాటింది. ఇక వ్యక్తిగత విభాగంలో ధీరజ్ నాలుగో స్థానంలో నిలిచాడు. 681 పాయింట్లు సాధించాడు. తరుణ్‌దీప్ 674 పాయింట్లతో 14 స్థానంలో, ప్రవీణ్ 658 పాయింట్లతో 39వ స్థానంలో నిలిచారు. విజయవాడకు చెందిన ధీరజ్ గత కొంతకాలంగా నిలకడగా రాణిస్తున్నాడు. ఆర్చరీలో దేశానికి తొలి పతకం అందించడానికి కసిగా బరిలోకి దిగిన ఈ తెలుగు తేజం లక్ష్యం దిశగా దూసుకెళ్తున్నాడు. ఇక మహిళల ఆర్చరీ విషయానికొస్తే... మహిళల జట్టు విభాగంలోనూ భారత్ క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది. అంకిత భకత్ అద్భుత ప్రదర్శనతో ఇండియా టాప్4కు చేరింది. భజన కౌర్, దీపిక కుమారి కూడా సత్తాచాటారు. ఈ ముగ్గురమ్మాయిలు కలిసి 1983 పాయింట్లు సాధించారు. మరోవైపు మహిళల వ్యక్తిగత విభాగంలో అంకిత తృటిలో టాప్10ను చేజార్చుకుంది. 11వ స్థానంతో 666 పాయింట్లతో అంకిత నిలిచింది. క్వార్టర్ ఫైనల్‌లో భారత్ మహిళల ఆర్చరీ జట్టు ఫ్రాన్స్ వర్సెస్ నెదర్లాండ్స్ విజేతతో తలపడాల్సి ఉంటుంది.ఇక క్వార్టర్స్‌లో మన అమ్మాయిలు విజయం సాధిస్తే సెమీఫైనల్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ సౌత్ కొరియాతో తలపడే అవకాశం ఉంది.టీమ్ సీడింగ్‌లో సౌత్‌కొరియా అగ్రస్థానంతో ముగించింది. 2046 పాయింట్లు సాధించింది. ఒలింపిక్స్‌లో దక్షిణ కొరియా ఇప్పటివరకు 27 ఆర్చరీ గోల్డ్ మెడల్స్ సాధించింది. ఇక రెండో స్థానంలో చైనా (1996), మూడో స్థానంలో మెక్సికో (1986) ఉన్నాయి. కాగా, సౌత్ కొరియా చేతిలో ఓటమిపాలైతే కాంస్య పతక రేసులో భారత్ పోటీపడాల్సి ఉంటుంది. మన మహిళా ఆర్చర్లు అంకిత భకత్ 666 (11వ స్థానం), భజన కౌర్ 659 (22వ స్థానం), దీపిక కుమారి 658 (23వ స్థానం) అంచనాలకు తగ్గట్లుగా ముగించలేకపోయారు. ఆఖర్లో మెరుగైన ప్రదర్శన చేసి ఉంటే సౌత్ కొరియాతో పోటీని తప్పించుకునేవాళ్లం. జులై 28 నుంచి ఆగష్టు 4 వరకు ఫైనల్ రౌండ పోటీలు జరగనున్నాయి. కాగా, 1988 నుంచి ఒలింపిక్స్ ఆర్చరీలో భారత్ పోటీపడుతోంది. ఇప్పటివరకూ ఒక్క పతకమూ గెలవలేకపోయింది. కానీ ఈ సారి పతక నిరీక్షణకు తెరపడే సమయం వచ్చింది.

## మొరాకో-అర్జెంటీనా పోరు రచ్చరచ్చ

పారిస్ ఒలింపిక్స్ ప్రారంభోత్సవ వేడుకలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. అయితే ఒలింపిక్స్ పోటీలు మాత్రం బుధవారం నుంచే మొదలయ్యాయి. ఫుట్‌బాల్, రగ్బీ సెవెన్స్ క్రీడలు ఆరంభమయ్యాయి. అయితే ఫుట్‌బాల్‌లో తొలి మ్యాచ్ అయిన మొరాకో—అర్జెంటీనా పోరు వివాదంగా మారింది. అభిమానులు మైదానంలో దూసుకొచ్చి రచ్చరచ్చ చేశారు. దీంతో మ్యాచ్ దాదాపు రెండు గంటలపాటు ఆలస్యమైంది. పరిస్థితి అదుపులోకి వచ్చిన తర్వాత మ్యాచ్‌ను కొనసాగించారు. అయితే నాటకీయ పరిమాణాల మధ్య సాగిన ఈ మ్యాచ్‌లో రెండు సార్లు స్వర్ణ పతక విజేత అర్జెంటీనాను మొరాకో 2–1 తేడాతో ఓడించింది. గ్రూప్‌బీలో భాగంగా జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత 22తో స్కోరు సమంగా భావించారంతా. కానీ ఆ తర్వాతే అసలు మలుపు తిరిగింది. మొరాకో ప్లేయర్ రహిమి తమ జట్టుకు రెండు గోల్స్ అందించాడు. 45వ, 51 వ నిమషంలో గోల్ కొట్టాడు. మరోవైపు అర్జెంటీనా ఆలస్యంగా స్కోరు ఖాతాను ఆరంభించింది. 68వ నిమిషంలో సిమోన్ గోల్ సాధించాడు. ఆ తర్వాత మొరాకో తన ఆధిక్యాన్ని కాపాడుకుంటూ ముందుకు సాగింది. కానీ ఇంజ్యూరీ టైమ్‌లో అర్జెంటీనా ఆటగాడు క్రిస్టియన్ మెదినా గోల్ సాధించాడు. దీంతో స్కోరు 2-2తో సమం అయ్యింది. కానీ అది సరైన గోల్ కాదని, మొరాకో అభిమానులు నిరసన తెలుపుతూ మైదానంలోకి వచ్చారు. అంతేగాక అర్జెంటీనా ఆటగాళ్లపై వాటర్ బాటిళ్లు, ఇతర వస్తువులు విసిరారు. దీంతో స్టేడియంలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. దీంతో అధికారులు మ్యాచ్‌ను నిలిపివేశారు. ప్రేక్షకులందరినీ బయటకు పంపించారు. మరోవైపు మ్యాచ్‌ను సస్పెంట్ చేశారని ఫిఫా వెబ్‌సైట్‌తో సహా ప్రముఖ వెబ్‌సైట్‌లు ప్రకటించాయి. కానీ ఆ తర్వాత మ్యాచ్‌ను కొనసాగించారు. అంతకుముందు అర్జెంటీనా చేసిన గోల్‌ను కౌంట్ చేయలేదు. అది ఆఫ్‌సైడ్‌గా ప్రకటించారు. అనంతరం ఆట తిరిగి ప్రారంభమైంది. అయితే మూడు నిమిషాలే మిగిలి ఉన్న ఆటలోఅర్జెంటీనా మరో గోల్ చేయలేకపోయింది. దీంతో 1–2తో మ్యాచ్‌ను కోల్పోయింది. గ్రూప్ సీలో జరిగిన మ్యాచ్‌ల్లో ఉజ్బెకిస్థాన్‌పై స్పెయిన్ 2–1తో గెలిచింది. ఈజిప్ట్‌డొమినికన్ రిపబ్లిక్ మ్యాచ్ 0–0తో ముగిసింది.

## గంభీర్.. అప్పుడే యూ-టర్న్ తీసుకున్నాడు: క్రిష్

**న్యూఢిల్లీ :** భారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్‌గా ఇప్పుడే పని మొదలుపెట్టిన గౌతమ్ గంభీర్‌పై మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ విమర్శలు గుప్పించాడు. రోహిత్, విరాట్ కోహ్లీ విషయంలో గంభీర్ అప్పుడే యూ టర్న్ తీసుకున్నాడని వ్యాఖ్యానించాడు. టీ20ల నుంచి వీడ్కోలు పలికిన ఇద్దరు స్టార్ క్రికెటర్లలో చాలా క్రికెట్ ఉందని గంభీర్ తన తొలి ప్రెస్ కాన్ఫరెన్స్‌లో తెలిపాడు. ఇదే మాజీ క్రికెటర్‌కు అసంతృప్తికి కారణం. 'గౌతమ్ గంభీర్ అప్పుడే యూటర్న్ తీసుకున్నాడు. టీ20 ప్రపంచకప్ ముందు మాట్లాడుతూ.. 'విరాట్, రోహిత్ మంచి ప్రదర్శన ఇవ్వకపోతే.. నా జట్టులో వారికీ స్థానం ఉండదు' అని చెప్పావు. ఇప్పుడు మాత్రం వీరిద్దరినీ మించిన ప్లేయర్లే లేరని అంటున్నావు. కోచ్ అయిన తర్వాత.. వారిలో చాలా క్రికెట్ మిగిలిఉందనేలా మాట్లాడావు. ఫిట్‌గా ఉంటే 2027 వరల్ కప్‌లోనూ ఆడతారన్నావు'' అని శ్రీకాంత్ అన్నాడు. కోహ్లీ, రోహిత్ విషయంలో ఫిట్‌నెస్ కీలక పాత్ర పోషిస్తుందని మాత్రమే నేను చెప్పగలను. విరాట్ ఫిట్‌నెస్ అందరికీ తెలిసిందే. ఇక రోహిత్ ప్లేయర్‌గా తిరుగులేదు. ఇప్పుడు అతడి వయసు 37. వచ్చే వన్డే ప్రపంచ కప్ అంటే 2027లోనే జరగనుంది. అంటే అప్పటికి హిట్‌మ్యాన్ వయసు 40కి చేరుతుంది. ధోనీ, సచిన్‌లా రోహిత్ సూపర్ ఫిట్ పర్సన్ అని నేను అనుకోవడం లేదు. ఈ వయసులో వరల్ కప్ ఆడటం అంత సులువేం కాదు. విరాట్ మాత్రం దీనికి అతీతం. అతడి ఫిట్‌నెస్ స్థాయి విభిన్నం. అందుకే రోహిత్ విషయంలో గంభీర్ తొందరపడ్డాడు. దక్షిణాఫ్రికాలో (ఆతిథ్య దేశం) అతడు కష్టమే'' అని క్రిష్ వ్యాఖ్యానించాడు. ప్రధాన కోచ్‌గా గౌతమ్ గంభీర్ తొలిసారి శ్రీలంక పర్యటనతోనే బాధ్యతలు చేపడతాడు. లంకతో మూడు టీ20లు, మూడు వన్డేలను భారత్ ఆడనుంది. సూర్యకుమార్ యాదవ్ టీ20 కెప్టెన్సీ చేపట్టగా.. వన్డే టీమ్‌ను రోహిత్ శర్మనే నడిపిస్తాడు.

## రీల్

## రెండు సినిమాలకు ఓకె చెప్పిన నితిన్



టాలీవుడ్ యంగ్ హీరో నితిన్ ప్రస్తుతం రెండు సినిమాల్లో నటిస్తూ రిలీజ్ కు రెడీ చేస్తున్నాడు. దర్శకుడు శ్రీరామ్ వేణు డైరెక్షన్ లో 'తమ్ముడు' అనే సినిమాలో నటిస్తున్న నితిన్.. మరో దర్శకుడు వెంకీ కుడుముల తెరకెక్కిస్తున్న 'రాబిన్ హుడ్' లోనూ నటిస్తున్నాడు. ఒక సినిమాను ఈ ఏడాది చివరినాటికి, మరో సినిమాను వచ్చే ఫిబ్రవరిలో రిలీజ్ అయ్యేలా ప్లాన్ చేస్తున్నాడు ఈ హీరో. అయితే, రెండు సినిమాలు షూటింగ్ దశలో ఉండగానే మరో రెండు సినిమాలకు ఓకే చెప్పాడట నితిన్. 'ఇష్క్' చిత్ర దర్శకుడు విక్రమ్ కుమార్ తో నితిన్ తన నెకట్స్ ప్రాజెక్టును స్టార్ట్ చేయాలని చూస్తున్నాడు. అలాగే '#90s' వెబ్ సిరీస్ దర్శకుడు ఆదిత్య హాసన్ డైరెక్షన్ లోనూ ఓ సినిమా చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడట. ఇక ఈ రెండు సినిమాల షూటింగ్ ను ఒకేసారి పూర్తి చేయాలని నితిన్ చూస్తున్నట్లు తెలుస్తోంది. కాగా, విక్రమ్ కుమార్ దర్శకత్వంలో నితిన్ నటించబోయే సినిమాను ప్రైమ్ షో ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై నిర్మాత కె.నిరంజన్ రెడ్డి ప్రొడ్యూస్ చేయనున్నారు. ఈ ఏడాదిలోనే ఈ చిత్ర షూటింగ్ ను ప్రారంభించాలని మేకర్స్ భావిస్తున్నారు.

## వరుణ్ ప్రాజెక్ట్‌కి ప్రముఖ సంస్థ నిర్మాణం



టాలీవుడ్ నటుడు, మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ చివరిసారిగా ఆపరేషన్ వాలెంటైన్ చిత్రంలో కనిపించారు. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేదు. అయితే తదుపరి ఈ హీరో మట్కా చిత్రంను చేస్తున్నారు. ఈ చిత్రంపై అందరిలో ఆసక్తి నెలకొంది. దర్శకుడు కరుణ కుమార్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. మీనాక్షి చౌదరి హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రానికి జీవి ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. అయితే ఈ హీరో మరో చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తుంది. దర్శకుడు విక్రమ్ సిరికొండ, టచ్ చేసి చూడు ఫేమ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ అయిన మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మించే అవకాశం ఉంది. త్వరలో మేకర్స్ నుండి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఈ చిత్రం కి సంబందించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.

## సార్ చీవాట్లు పెడతారు: అనసూయ



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రధాన పాత్రలో, స్టార్ డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం పుష్ప 2 ది రూల్. డిసెంబర్ 6, 2024న వరల్ వైడ్‌గా థియేటర్లలోకి రానున్న ఈ చిత్రం పై ప్రేక్షకుల్లో, అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈరోజు జరిగిన సింబా ట్రైలర్ లాంచ్ ఈవెంట్లో అనసూయ భరద్వాజ్ పాల్గొన్నారు. పుష్ప 2లో దాక్షాయణి పాత్ర పోషించిన అనసూయ భరద్వాజ్ ను, సినిమా గురి ంచి అడగగా, నాకు భయం, నేను చెప్పను. నాకు చివాట్లు పడతాయి మా సార్ (సుకుమార్) నుంచి అంటూ చెప్పుకొచ్చారు. రష్మిక మందన్న ఫీమేల్ లీడ్ రోల్ లో నటించిన ఈ చిత్రంలో ఫహద్ ఫాసిల్, సునీల్, రావు రమేష్, ధనంజయ తదితరులు కీలక పాత్ర ల్లో కనిపించనున్నా రు. మైత్రీ మూ వీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం కోసం ఆడియెన్స్ ఎంతగానో ఎదురు చూస్తున్నారు.

## నటి కాకపోతే టీ అమ్ముకునేదాన్ని 'తంగలాన్' హీరోయిన్



తమిళ స్టార్ హీరో చియాన్ విక్రమ్ నటిస్తున్న తాజా చిత్రం 'తంగలాన్' ఇప్పటికే కోలీవుడ్ వర్గాల్లో ఎలాంటి హైప్ క్రియేట్ చేసిందో అందరికీ తెలిసిందే. దర్శకుడు పా రంజిత్ ఈ సినిమాను తెరకెక్కిస్తుండగా వైవిధ్యమైన కథాంశంతో ఈ సినిమాను రూపొందిస్తున్నారు మేకర్స్. ఇక ఈ మూవీ పోస్టర్స్, టీజర్, ట్రైలర్లు అభిమానుల్లో అంచనాలను అమాంతం పెంచేశాయి. అయితే, ఇందులో నటించిన హీరోయిన్ తాను నటి కాకపోయి ఉంటే టీ అమ్ముకునేదాన్ని అని చెప్పడం ప్రస్తుతం నెట్టింట వైరల్ గా మారింది. 'తంగలాన్' సినిమాలో మాళవిక మోహనన్, పార్వతి తిరువోతు హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా వీరిద్దరు కలిసి ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీరు నటి కాకపోయి ఉంటే ఏం చేసేవారు అనే ప్రశ్నకు వీరిరువురు ఆసక్తికర సమాధానం ఇచ్చారు. నటిని కాకపోయి ఉంటే టీ అమ్ముకునేదాన్ని.. వృత్తి ఏదైనా గౌరవంతో పనిచేయాలని అనుకునేదాన్ని.. అందుకే టీ షాప్ పెట్టుకోవాలని అనుకున్నా.. అంటూ పార్వతి తిరువోతు చెప్పుకొచ్చింది. ఇక మరో హీరోయిన్ మాళవిక మోహనన్ తనకు విజువల్ ఆరట్స్ అంటే ఇష్టమని.. నటి అవకపోయి ఉంటే ఫోటోగ్రఫీ లేదా సినిమాటోగ్రఫీ రంగంలోకి అడుగుపెట్టేదాన్ని అంటూ చెప్పుకొచ్చింది. ప్రస్తుతం వీరు చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## అక్రమ కేసులు పెట్టిన అధికారులకు శిక్షణ తప్పదు : ఎపి సిఎం



**అమరావతి:** శాంతిభద్రతల విషయంలో ఎపిని దేశంలోనే అగ్రస్థానంలో నిలబెడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాజకీయ ప్రేరేపిత కేసులపై సమీక్షిస్తామని, అక్రమ కేసులు పెట్టిన అధికారులను శిక్షించేందుకు సిద్ధమని ప్రకటించారు. శాసనసభలో 'శాంతిభద్రతలపై శ్వేతపత్రం' విడుదల సందర్భంగా సిఎం మాట్లాడారు. లా అండ్ ఆర్డర్‌పై మరింత లోతుగా చర్చించాలని, మరో సెషన్ నిర్వహించాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కోరగా.. సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. ఎన్డీయే సభ్యులు ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టే పరిస్థితి తీసుకురావొద్దని సీఎం సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తి ఏ స్థాయిలో ఉన్నా శిక్షిస్తామన్నారు. అధికారులు చట్టాన్ని గౌరవించినప్పుడే శాంతి భద్రతలు అదుపులో ఉంటాయన్నారు.

**మహిళలపై అసభ్య పోస్టులు పెడితే వదిలిపెట్టను..**

సామాజిక మాధ్యమాల కట్టడికి ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తామని తెలిపారు. మహిళలపై అసభ్య పోస్టులు పెడితే వదిలిపెట్టనని హెచ్చరించారు. మహిళలపై ఎన్డీయే సభ్యులు అసభ్య పోస్టులు పెట్టినా ఉపేక్షించనని స్పష్టం చేశారు.వైకాపా పాలనలో ప్రజలు మానసికంగా, శారీరకంగా వేదన అనుభవించారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. పోలీసుల అండతో వైకాపా నేతలు ప్రజాస్వామ్య పునాదులపై దాడుల చేశారని ఆక్షేపించారు. శాసన మండలిలో 3 రాజధానుల బిల్లు సమయంలో దుర్మార్గంగా ప్రవర్తించారన్నారు. మండలి ఛైర్మన్ పనిచేయకుండా చేసి గొడవ పడ్డారన్నారు. ''గత ప్రభుత్వ పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యమైంది. ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలకు పోలీసులు ఆయుధంగా మారారు. వైసిపి నేతలతో కుమ్మక్కై నిబంధనలు ఉల్లంఘించారు. పోలీసు వ్యవస్థను పూర్తిగా విధ్వంసం చేశారు. బాబ్లీ కేసు తప్ప నాపై గతంలో ఎప్పుడూ కేసులు లేవు. వైకాపా అధికారంలోకి వచ్చాక నాపై 17 కేసులు, పవన్‌కల్యాణ్‌పై 7 కేసులు నమోదు చేశారు. ప్రతిపక్ష నేతలను అణచివేసేందుకు యత్నించారు. జేసీ ప్రభాకర్‌రెడ్డిపై దాదాపు 60కి పైగా కేసులు పెట్టారు. ప్రస్తుత హోంమంత్రి అనిత, స్పీకర్ అయ్యన్నపాత్రుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టారు. రఘురామకృష్ణరాజును లాకప్‌లో చిత్రహింసలు పెట్టారు. దానికి సంబంధించిన వీడియోలు చూసి నాటి సీఎం పైశాచికానందం పొందారు'' అని చంద్రబాబు అన్నారు.

## నియామక పరీక్షల్లో పేపర్ లీక్ కాలేదు : కేంద్రమంత్రి

**న్యూఢిల్లీ :** గత రెండు ఏళ్లలో పరీక్షా పత్రాలు లీకైన ఘటనలు జరగలేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. యునియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి), స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్‌ఎస్‌సి), రైల్వ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్‌ఆర్‌బి), ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (ఐబిపిఎస్) నిర్వహించిన నియామక పరీక్షల్లో గత సంవత్సరాల కాలంలో పరీక్షా పేపర్లు లీక కాలేదని గురువారం కేంద్రం రాజ్యసభకు వెల్లడించింది. ఇటీవల నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) నిర్వహించిన నీట్ (యుజి) పరీక్ష మే 5, 2024న ఒఎంఆర్ మోడ్‌లో నిర్వహించింది. అయితే భారీ అక్రమాలు, అవకతవకలు జరిగినట్లు ఆరోణలు వచ్చాయని కేంద్ర సిబ్బంది శాఖ సహాయమంత్రి జితేందర్ సింగ్ లిఖితపూర్వకంగా తెలియజేశారు. వాటిపై సమీక్షించిన తరువాత ఈనెల 22న సమర్థవంతమైన దర్యాప్తు జరిపేందుకు కేసును సిబిఐకి అప్పగించామని చెప్పారు. గత రెండేళ్లలో యుపిఎస్‌సి, ఎస్ఎస్‌సి, ఆర్‌ఆర్‌బి, ఐబిపిఎస్ నిర్వహించిన నియామక పరీక్షల్లో పేపర్ లీకైనట్లు ఎలాంటి ఆధారాలు లేవన్నారు.

# మనాలీని ముంచెత్తిన కుంభవృష్టి





**మనాలీ/ ముంబయి :** భారీ వర్షాల కారణంగా దేశ పర్యటక ప్రదేశం మనాలీ, మహారాష్ట్ర తీవ్రంగా ప్రభావితం అయ్యాయి. మనాలీలో వరద ధాటికి ఓ కాలువ ఉగ్రరూపం దాల్చగా, పుణెలో నలుగురు మృతి చెందారు. దేశ పర్యటక ప్రదేశమైన మనాలీ సమీపంలోని పాల్చన్‌ను గురువారం కుంభవృష్టి ముంచెత్తింది. దీంతో ఆక్కడి వాతావరణం ప్రమాదకరంగా మారింది. అదే ప్రాంతంలో ఉన్న అంజనీ మహాదేవ్ కాలువ ఒక్కసారిగా ఉగ్రరూపం దాల్చింది. మనాలీకి 15 కి.మీ. దూరంలో మెరుపు వరదలు ఆ ప్రాంతాన్ని ముంచెత్తాయి. అర్ధరాత్రి 1 గంట సమయంలో అంజనీ మహాదేవ్ కాలువ నుంచి తీవ్రమైన శబ్దం రావడం వల్ల స్థానికులు ఉలిక్కిపడి లేచారు. వీరి నివాసాలు కాలువ ఒడ్డనే ఉన్నాయి. వరదలతో అప్రమత్తమైన స్థానికులు మెరుపు వరదను గమణించి ఎత్తైన ప్రదేశాలకు వెళ్లిపోయి ప్రాణాలు కాపాడుకున్నట్లు పాల్చన్ పంచాయతీ సభ్యురాలు రమాదేవీ వెల్లడించారు. కాగా, మనాలీ లేహ్ జాతీయ రహదారిపై ఉన్న వంతెన మీదకు కాలువలోని భారీ బండరాళ్లు కొట్టుకొచ్చాయి. దీంతో ఈ మార్గాన్ని తాత్కాలికంగా మూసివేశారు. ఇది కీలకమైన లద్ధాఖ్‌ను, దేశంలోని మిగిలిన ప్రదేశాలతో కలిపే మార్గం. వర్షం కారణంగా ఇక్కడి నాలాలో కూడా భారీగా వరద నీరు చేరింది. ఈ వరదలకు పల్చన్, రూడా, కులాంగ్ గ్రామాలు తీవ్రంగా ప్రభావితం అయ్యాయి. ఇప్పటివరకు రెండు ఇళ్లు కొట్టుకుపోయాయని సమాచారం. ఈ వరదల్లో ప్రాణనష్టం గురించి ఇంకా తెలియాల్సి ఉంది. ఇక రోహ్‌తంగ్ పాస్ నుంచి లాహౌల్ వరకు భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది.

**ముంబయి, పుణెను ముంచెత్తిన కుండపోత వర్షం..**

దేశ ఆర్థిక రాజధాని ముంబైను మరోసారి భారీ వర్షం ముంచెత్తింది. ఆకాశానికి చిల్లుపడినట్లుగానే కుండపోత వర్షం కురిసింది. గురువారం కురిసిన కుండపోత వర్షానికి ముంబయి, పుణె నగరాలు జలమయం అయ్యాయి. ఇళ్లు, దేవాలయాలు, కార్లు అన్ని నీటి మునిగాయి. ఇక ప్రజా రవాణా అస్తవ్యస్తం అయింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం అయింది. రంగంలోకి దిగిన ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు సహాయ చర్యలు చేపట్టారు. ప్రమాదకరంగా ఉన్న ఇళ్లల్లోంచి ప్రజలను సహాయ బృందాలు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ముంబయిలోని సియోన్, చెంబూర్, అంధేరి వంటి ప్రాంతాలపై తీవ్ర ప్రభావం పడింది. ఇక నగరానికి నీటిని సరఫరా చేసే ఏడు సరస్సుల్లో రెండు మోదక్‌సాగర్ సరస్సు, విహార్ సరస్సులు పొంగిపొర్లుతున్నాయని బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ తెలిపింది. ఈ సరస్సుల సామర్థ్యాలు 12,892 కోట్ల లీటరు, 2,769 కోట్ల లీటర్లు. ప్రస్తుతం రెండు సరస్సులు పొంగిపొర్లుతున్నందున ముంబయిలోని నీటి సరఫరాలో 10 శాతం కోత విధించినట్లు పౌర సంఘం ప్రకటించింది. ముంబయితో పాటు మహారాష్ట్రలోని ఇతర ప్రాంతాలు కూడా వర్షం కష్టాలతో అల్లాడిపోతున్నాయి. థానేలోని ముంబ్రా వంటి కొన్ని ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇక పుణెలో పింప్రి చించ్‌వాడ్‌లోని పలు నివాస సముదాయాలు జలమయమయ్యాయి. విద్యుత్ షాక్‌కు గురై నలుగురు చనిపోయారు. ఇదిలా ఉంటే తాజా పరిణామాలపై వాతావరణ శాఖ అప్రమత్తమైంది. శుక్రవారం ఉదయం వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవచ్చని హెచ్చరించింది. ఈ మేరకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. మరోవైపు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే సమీక్ష నిర్వహించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. అవసరమైతే తప్ప ఎవరు ఇళ్లల్లోంచి బయటకు రావొద్దని ముఖ్యమంత్రి ప్రజలకు సూచించారు. పుణెలోని పరిస్థితి గురించి మాట్లాడుతూ.. నగరంలోని అధికారులతో మాట్లాడానని, అవసరమైతే ప్రజలను ఎయిర్‌లిఫ్ట్ చేస్తానని షిండే చెప్పారు. సైన్యం, నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డిఆర్ఎఫ్)తో మాట్లాడినట్లు చెప్పారు. భారీ వర్షం కారణంగా ముంబై ఎయిర్‌పోర్టులో విమాన రాకపోకలు నిలిచిపోయాయి. పలు విమానాలు రద్దయ్యాయి. దీంతో ముందస్తు ప్రయాణాలు పెట్టుకున్న ప్యాసింజర్స్ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## టీచరమ్మగా రాష్ట్రపతి...

### విద్యార్థులకు పాఠాలు బోధించిన ముర్ము



**న్యూఢిల్లీ :** దేశ ప్రథమ పౌరురాలిగా ద్రౌపదీ ముర్ము బాధ్యతలు చేపట్టి నేటికి సరిగ్గా రెండేళ్లు. ఈ సందర్భాన్ని ఆమె మరింత ప్రత్యేకంగా మార్చుకున్నారు. తనకెంతో ఇష్టమైన వృత్తి అయిన ఉపాధ్యాయురాలిగా మారారు. ప్రెసిడెంట్ ఎస్టేట్‌లోని డా.రాజేంద్ర ప్రసాద్ కేంద్రీయ విద్యాలయ పాఠశాలకు వెళ్లి విద్యార్థులను ఆశ్చర్యపర్చారు. తొమ్మిదో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించారు. తొలుత విద్యార్థుల పేర్లు అడిగి వారితో ముచ్చటించారు. వారి అభిరుచులు, లక్ష్యాలు తెలుసుకున్నారు. ఈ తరం విద్యార్థులు ఎంతో ప్రతిభావంతులని, సాంకేతికంగా వీరికి పుష్కలమైన అవకాశాలు ఉన్నాయని ముర్ము అన్నారు. అనంతరం 'గ్లోబల్ వార్మింగ్'పై వారికి బోధించారు. భావితరాల కోసం పర్యావరణాన్ని కాపాడుకోవాలని విద్యార్థులకు తెలియజేశారు. నీటి సంరక్షణ ప్రాముఖ్యాన్ని వివరించారు. పర్యావరణ మార్పు ప్రభావం మనపై పడకుండా ఉండాలంటే వీలైనన్ని ఎక్కువ మొక్కలు నాటాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈసందర్భంగా ప్రధాని మోదీ పిలుపునిచ్చిన 'ఏక్ పేడ్ మా కే నామ్ (అమ్మ పేరుతో ఒక మొక్క నాటండి)' గురించి ప్రస్తావించారు. ప్రతీ విద్యార్థి తమ పుట్టిన రోజున ఓ మొక్క నాటాలని ఆకాంక్షించారు. ఒడిశాకు చెందిన ద్రౌపదీ ముర్ము దేశ 15వ రాష్ట్రపతిగా 2022 జులై 25న ప్రమాణస్వీకారం చేశారు. దేశ అత్యున్నత పీఠాన్ని అధిరోహించిన తొలి ఆదివాసీ వ్యక్తిగా ఆమె సరికొత్త చరిత్ర సృష్టించారు. అంతేకాదు.. ఈ పదవిని చేపట్టిన అతి పిన్నవయస్కురాలు కూడా ఈమే కావడం విశేషం. రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టడానికి ముందు ఆమె ఝార్ఖండ్ గవర్నర్‌గా వ్యవహరించారు. 1994–97 మధ్య రాయ్‌రంగ్‌పూర్‌లోని శ్రీఅరబిందో ఇంటిగ్రెల్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో గౌరవ అసిస్టెంట్ టీచర్‌గా వ్యవహరించారు.

## రాష్ట్రపతి భవన్‌లో దర్బార్ హాల్, అశోక్ హాల్‌కు కొత్త పేర్లు

**న్యూఢిల్లీ :** రాష్ట్రపతి భవన్‌లో రెండు హాల్స్ పేర్లు మారాయి. వివిధ కార్యక్రమాలకు వేదికగా ఉంటున్న దర్బార్ హాల్, అశోక్ హాల్‌ను ఇకనుంచి గణతంత్ర మండపం, అశోక్ మండపంగా పిలవనున్నారు. ఈ మేరకు ప్రెసిడెంట్ సెక్రటేరియట్ వెల్లడించింది. 'జాతీయ అవార్డుల కార్యక్రమం వంటి ప్రధాన వేడుకలను ఈ దర్బార్ హాల్‌లో నిర్వహిస్తుంటాం. ఆంగ్లేయులు, భారత పాలకులు సమావేశాలు నిర్వహించిన ప్రాంతాన్ని దర్బార్ అనేవారు. భారత్ గణతంత్ర రాజ్యంగా మారిన తర్వాత ఆ పదం ప్రాముఖ్యతను కోల్పోయింది. గణతంత్ర భావన భారత సమాజంలో లోతుగా పాతుకుపోయింది. అందుకే ఈ హాల్‌కు గణతంత్ర మండపం సరైంది' అని పేర్కొంది. 'అశోక్ హాల్ ఒక బాల్ రూమ్. అశోక్ అంటే అన్ని బాధల నుంచి విముక్తుడైన వ్యక్తి అని అర్థం' అని వెల్లడించింది. అలాగే భా రత చరిత్రలో అశోక చక్రవర్తి, సమాజంలో అశోక చెట్టుకున్న ప్రాముఖ్యత దృష్ట్యా దానికి అశోక్ మండపం అని మార్చినట్లు వివరించింది. ఈ పేర్ల మార్పుపై విపక్షాలు విమర్శలు చేశాయి. కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకాగాంధీ మాట్లాడుతూ.. 'దర్బార్ అనే కాన్సెప్ట్ లేదు. కానీ షెహన్‌షా కాన్సెప్ట్ ఉండటం ఆసక్తికరంగా ఉంది' అని వ్యంగ్యంగా స్పందించారు.

## నీట్ యూజీ రివైజ్డ్ ఫలితాలు విడుదల..

### 5 మార్కులు కోల్పోయిన 4.2 లక్షల మంది

**న్యూఢిల్లీ :** నీట్ యుజి 2024 పరీక్ష వివాదం వేళ ఇటీవల సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఫిజిక్స్ విభాగంలోని ఓ ప్రశ్నకు ఒకటే సమాధానం ఉంటుందని నిపుణుల కమిటీ తేల్చడంతో దాని ఆధారంగా ఫలితాలను సవరించాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో పరీక్ష తుది ఫలితాలను ఎన్‌టిఎ గురువారం విడుదల చేసింది. ఇందులో 4.2 లక్షల మంది అభ్యర్థులు 5 మార్కులను కోల్పోయారు. దీంతో టాప్ ర్యాంక్ సాధించిన వారి సంఖ్య కూడా 61 నుంచి 17కు తగ్గింది. సవరించిన ఫలితాలను విద్యార్థులు ఎన్‌టిఎ అధికారిక వెబ్‌సైట్ exams.nta.ac.inలో చూసుకోవచ్చు. ఫిజిక్స్ విభాగంలోని అటామిక్ థియరీకి సంబంధించిన 29వ ప్రశ్నకు రెండు సమాధానాలు ఉన్నాయని, వాటిలో దేన్ని ఎంపిక చేసినా... మార్కులిచ్చారని ఆరోపిస్తూ ఓ అభ్యర్థి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సిజెఐ జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం.. ముగ్గురు నిపుణులతో కమిటీని ఏర్పాటు చేసి, నివేదిక అందించాలని ఐఐటి ఢిల్లీని ఆదేశించింది. ఈ క్రమంలోనే సంబంధిత ప్రశ్నకు ఒక సమాధానమే ఉందని, రెండు లేవని... ఆప్షన్ 4 ఒక్కటే సమాధానమని నిపుణుల కమిటీ కోర్టుకు విన్నవించింది. దాంతో ఆప్షన్ 4ను ఎంచుకున్న అభ్యర్థులకే మార్కులు ఇవ్వాలంటూ ధర్మాసనం పరీక్ష నిర్వాహకులను ఆదేశించింది. ఫలితంగా మరోసారి రివైజ్డ్ ర్యాంకులను విడుదల చేయడం అనివార్యంగా మారింది. తాజాగా ఎన్‌టిఎ తుది ఫలితాలను వెల్లడించగా.. సుమారు 4.2లక్షల మంది అభ్యర్థులు 5 మార్కులు (ప్రశ్నకు నాలుగు మార్కులు+ తప్పు రాసినందుకు ఒక నెగెటివ్ మార్క్) కోల్పోయారు. దీంతో మెరిట్ లిస్ట్ మారింది. అంతేకాదు.. 720కి 720 స్కోరు సాధించిన 61 మందిలో ఈ ప్రశ్నకు మార్కులు పొందిన వారు 44 మంది ఉన్నారు. వారి స్కోరు కూడా మారడంతో టాప్ ర్యాంకర్ల జాబితా 17కు తగ్గింది.

**చెరువులోంచి 16 ఫోన్లు స్వాధీనం..**

నీట్‌యుజి 2024 పరీక్ష పేపర్ లీక్ దర్యాప్తులో సిబిఐ దూకుడు పెంచింది. జార్ఖండ్‌లోని ధన్‌బాద్‌కు చెందిన నిందితుడు అవినాష్ అలియాస్ బంటీకి సంబంధించిన 16 ఫోన్లను సిబిఐ అధికారులు చెరువులోంచి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. నిందితుడిని బీహార్‌లోని పాట్నా సిబిఐ కోర్టులో హాజరుపరచగా విచారణ నిమిత్తం జులై 30 వరకు న్యాయస్థానం కస్టడీకి అప్పగించింది. అంతకుముందు ప్రాథమిక విచారణ సందర్భంగా కేసు గురించి బంటీ కీలక విషయాలు బయటపెట్టినట్లు సమాచారం. పేపర్ లీక్‌కు ఉపయోగించిన 16 ఫోన్లను నిందితుడు చెరువులో పడేయగా టవర్ సిగ్నల్స్ ద్వారా ట్రాక్ చేసి రికవరీ చేసినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. పేపర్ లీక్‌లో అరెస్టయిన శశి పాసవాన్‌తో నిందితుడికి సంబంధాలు ఉన్నట్లు సమాచారం.